ప్రజలే ప్రభువులు

# జనబలం

జనవరి 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-










## 'అందరికీ ఆరోగ్యం' అమలుకు తెలుగు రాష్ట్రాలు నాయకత్వం వహించాలి



## సుపరిపాలన - ప్రజాస్వామ్యం - రాజ్యంపాత్ర

सत्यमेव जयते



# మీ జీవితాల్లో మీరే హీరోలు

## -ఎన్‌టీఆర్‌పై పుస్తకావిష్కరణలో యువతకు జేపీ పిలుపు-

యువతా! మీ జీవితాల్లో మీరే హీరోలు. మీ వ్యక్తిగత జీవితాల్ని చూసుకుంటూనే చుట్టూ ఉన్న సమాజాన్ని కొంత పట్టించుకుంటూ ఎదగండి" అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. 2022లో ఎన్.టి రామారావు శతజయంతి సందర్భంగా.. డా॥ నాగభైరవ కోటేశ్వరరావు వ్యాసాలతో రూపొందించిన 'నందమూరితో నా జ్ఞాపకాలు' పుస్తకాన్ని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. పుస్తకాన్ని తీసుకొచ్చిన అల్లాడ రామకృష్ణ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. జేపీ మాట్లాడుతూ, ఎన్‌టీఆర్‌తో కలసి పనిచేయటం తనకు మరింత ప్రజాప్రయోజనకరంగా పనిచేసే అవకాశంగా అభివర్ణించారు. రామారావు గారితో పరిచయమున్న వ్యక్తులను ఎప్పుడు కలుసుకున్నా.. ఆయనతో విభేదించినవారు సహా అందరూ ఎన్‌టీఆర్ గురించే ఎక్కువగా మాట్లాడతారన్నారు. రామారావు గారు చూపిన ప్రభావానికి ఇదో నిదర్శనమన్నారు. అల్లాడ రామకృష్ణ ఎన్‌టీఆర్‌ని ఎన్నడూ కలుసుకోలేదని, అలాగే నాగభైరవ కోటేశ్వరరావు గారినీ కలుసుకోలేదని, కానీ ఈ పుస్తకాన్ని తీసుకొస్తే సమాజానికి మేలు జరుగుతుందని భావించి సొంతంగా ప్రచురించి తీసుకొచ్చారని అభినందించారు. ఎన్‌టీఆర్ చాలా సామాన్య స్థితి నుండి కష్టపడి ఎదిగిన వ్యక్తి అని, తెల్లవారుజామునే లేచి పాలు అమ్మాక కాలేజీకి వచ్చి చదువుకున్నారన్నారు. అలాంటి వ్యక్తుల నుండి యువత ఎంతో నేర్చుకోవాలని, కులం, మతం, ప్రాంతం వంటి విద్వేషాల ఉచ్చుల్లో చిక్కుకోకుండా ఎవరి జీవితాల్లో వారు హీరోలుగా ఎదగాలని అన్నారు. వ్యక్తిగత సుఖాన్ని, సమాజ హితాన్ని సమన్వయం చేసుకునే విద్యార్థులు, యువత ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో రూపుదిద్దుకోవటమే భారతదేశానికి నిజమైన భరోసా అన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 01

జనవరి 2022

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# బరి తెగించిన సైబర్ నేరగాళ్లు

ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ మత ప్రాతిపదికపై ప్రజల్ని విభజించే ప్రయత్నాలు మరోసారి ముమ్మరంగా మొదలయ్యాయి. కుల, మత, భావోద్వేగాలను రెచ్చగొట్టి సమూహాల మధ్య విద్వేషాలను పెంచే దురంతాలు ఈ మధ్య పెచ్చుమీరుతున్నాయి. సైబర్ చట్టాలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా సామాజిక మాధ్యమాలలో సైబర్ నేరగాళ్లు పేట్రేగి పోతున్నారు. "బుల్లీ బాయ్" యాప్ పేరుతో కొందరు దుండగులు ఇటీవల చేసిన ప్రయత్నం అత్యంత జుగుప్సాకరంగా, నీచంగా ఉంది. దేశంలో చిరకాలంగా మహిళా హక్కుల కోసం, లింగ సమానత్వం కోసం, మానవ హక్కుల కోసం పోరాడుతున్న సుప్రసిద్ధ ముస్లిం మహిళలపై సైబర్‌దాడి జరిగింది. ప్రముఖ న్యాయవాదులు, జర్నలిస్టులు, సినీ, టీవీ రంగ ప్రముఖులుగా ప్రసిద్ధులైన వంద మంది ముస్లిం మహిళ చిత్రాలను ఆన్‌లైన్‌లో పెట్టి వారిని అమ్మకానికి వేలం వేస్తున్నట్లుగా "బుల్లీబాయ్" యాప్ ప్రకటించింది. ప్రముఖ సంఘ సేవకురాలు, సినీ నటి షబానా అజ్మీ ఫొటో సైతం అందులో ఉంది. ఆమెను పనిమనిషిగా అమ్మకానికి పెట్టడాన్ని బట్టి దుండగులు ఎంతగా తెగించారో అర్థం అవుతుంది. పైగా ఒక సిక్కు ఖల్సా సంస్థ ఈ వేలాన్ని నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

సరిగ్గా ఆరు నెలల క్రితం కూడా ఇలాంటిదే మరో ప్రయత్నం జరిగింది. వేరొక యాప్ ద్వారా ఐదు వందల మంది ముస్లిం మహిళా ప్రముఖుల చిత్రాలను పోస్టు చేసి, వారిని వేలం పెట్టారు. ఒక విమానయాన సంస్థలో కమర్షియల్ పైలెట్‌గా చేస్తున్న హనా ఖాన్ తన చిత్రాన్ని యాప్‌లో చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. నోయిడా పోలీసులకు 2021 జూలైలో దీనిపై ఫిర్యాదు ఇచ్చారు. ఫిర్యాదు ఇచ్చి ఆర్నెల్లు గడిచినా పోలీసులు ఇంత వరకూ తగిన చర్యలు తీసుకోలేదు.

ఉన్నత చదువులు చదివి, తమ తమ రంగాల్లో విజయవంతం కావడంతో పాటు , సామాజిక సమస్యలపై గొంతు విప్పుతున్న ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ సైబర్‌దాడులు జరుగుతున్నాయి. యూపీలో జరిగిన సైబర్ నేరంపై రాష్ట్ర పోలీసులుగానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ తగిన విధంగా స్పందించకపోవడంతో నేరస్తులు రెచ్చిపోయారు. 'బుల్లీబాయ్' ఉదంతం మొన్న జనవరి 1వ తేదీన జరిగింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో బాధితులు వారి కుటుంబాలు సైతం దీనిపై ముందుకు రాలేకపోయారు. పైపెచ్చు ముస్లిం సమాజంలో బాధితులకు తగిన మద్దతు లభించకపోవడం కూడా ఒక సమస్యగా మారింది. యూపీ ఎన్నికల ముందు రాష్ట్రంలో ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకుని కొందరు దుండగులు పనిగట్టుకుని సాగిస్తున్న విద్వేష ప్రచారం ఎన్నికల సమీకరణలకు పనికొస్తుందని పాలకపక్షం భావిస్తున్నట్లుగా మహిళా సంఘాలు విమర్శించాయి.

ఇటీవల హరిద్వార్‌లో జరిగిన ధర్మసంసద్‌లో కొందరు సాధువులు సాగించిన విద్వేష ప్రసంగాలు ప్రపంచాన్ని నివ్వెరపరిచాయి. ముస్లింలను ఊచకోత కోయాలని, వారిని దేశం నుండి వెళ్లగొట్టాలని సాధు, సంతులు పిలుపు ఇచ్చారు. తారాస్థాయికి చేరిన ఈ ఉన్మాద ప్రసంగాలకు కొందరు సాధువులు అభ్యంతరం చెప్పి, నిరసనగా సంసద్ నుండి నిష్క్రమించారు. అయినా ఏ మాత్రం తగ్గని రాజకీయ సన్యాసులు ప్రభుత్వానికి దమ్ముంటే తమను అరెస్టు చేయాలని సవాళ్లు విసిరారు. శిక్షా భయం ఏమాత్రం లేకుండా ధర్మ సంసద్‌లో వీరంగం చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకంజ వేశారు.

బుల్లీబాయ్ ఉదంతంలో మొత్తం మీద ముంబై పోలీసులు కొంత మేరకు స్పందించారు. ముగ్గురు విద్యార్థుల్ని అరెస్టు చేశారు. వారెవరూ సిక్కు మత నామధేయాల వారు కారు. దీనిని బట్టి ముస్లింలకు, సిక్కులకు మధ్య తంపులు పెట్టడానికి ఒక పథకం ప్రకారం కొందరు దుండగులు తెగించారని భావించవచ్చు.!

'భారతీయ మిశ్రమ సంస్కృతిని దెబ్బతీయడానికి కుట్ర' జరుగుతోందని మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ఒక ప్రకటన చేశారు. కేంద్రంలోనూ, యూపీలోనూ పాలన సాగిస్తున్న తమ ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం కారణంగానే దుండగులు కుట్రలకు తెగబడుతున్నారని ఆయనకు తెలియదనుకోలేం!

సమ్మిశ్రిత సంస్కృతికి, జండర్ సమానత్వానికి, సామాజిక న్యాయానికి ప్రతీకలుగా నిలుస్తున్న వందలాది మంది మహిళల వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్న దుండగుల భరతం పట్టాల్సిన బాధ్యత పాలకపక్షంపై ఉంది. విభిన్న సమూహాల మధ్య విద్వేషాన్ని రగిల్చి, శాంతి - భద్రతల్ని చెడగొట్టేందుకు యత్నిస్తున్న ఉన్మాదుల్ని కఠినంగా శిక్షించాల్సి ఉంది. అయితే ఎన్నికల వేళ కల్లోల జలాల్లో చేపలు పట్టుకోవాలన్న దుర్బుద్ధితో పాలక పక్షం వ్యవహరించడం చేటు చేస్తుంది. నేరాలను ఉపేక్షించరాదని, చట్టబద్ధ పాలనను అమలు చేయాలని భారతీయ పౌర సమాజానికి చెందిన సుమారు ఐదు వేల మంది ప్రముఖులు రాష్ట్రపతికి, ప్రధానికి గట్టి లేఖను రాశారు. అంతర్జాతీయంగా పరువు పోకముందే ప్రభుత్వం మేల్కొంటుందని ఆశిద్దాం.!

డి. సోమ సుందర్

# సుపరిపాలన - ప్రజాస్వామ్యం - రాజ్యం పాత్ర

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

మంచి పరిపాలన పడికట్టు పదమైతే ప్రయోజనం లేదు. మంచి పరిపాలన అంటే స్పష్టమైన అవగాహన, విశ్లేషణతో అందుకు తగిన ప్రమాణాలను గుర్తించటం కావాలి. ఆధునిక యుగంలో రాజ్యం పాత్ర ఏమిటి, ఆ పాత్రను ఎంతవరకు సమర్థంగా రాజ్యం నిర్వహిస్తోంది. ఇది మొట్టమొదటి ప్రమాణం. ప్రజాస్వామ్య సమాజంలో పౌరుల స్వేచ్ఛ ఏ మేరకు వికసిస్తోంది, ఏ మేరకు స్వపరిపాలన సాధ్యమవుతోంది అన్నది రెండవ ప్రమాణం. ఉదాహరణకి, చైనా రాజ్యం పాత్రను చాలా సమర్థంగా నెరవేరుస్తోంది. కానీ సుపరిపాలన అంటే అది చాలదు. మూడవది, రాజకీయ ప్రక్రియ. ఎన్నికలు గానీ, రాజకీయ పార్టీలుగానీ ఏ మేరకు సమాజ హితాన్ని, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే రీతిలో వ్యవహరిస్తున్నాయి.

**రాజ్యం పాత్ర**

ఆధునిక ప్రపంచంలో ఒక రాజ్యం మంచి పరిపాలన ఇచ్చింది అంటే, కొన్ని లక్ష్యాల్ని సమర్థంగా సాధించింది అని అర్థం. ఆ లక్ష్యాల్ని నెరవేర్చటం కోసమే మానవ సమాజం రాజ్యాన్ని ఏర్పరచుకున్నది. రాజ్యం సమర్థంగా చేపట్టవలసిన మొదటి పని – శాంతి భద్రతల్ని కాపాడటం, అందరికీ సమర్థంగా సమన్యాయాన్ని అందించటం, చట్టబద్ధపాలనను అమలు చేయటం. మన దేశంలో శాంతి భద్రతల పాత్ర వరకు చాలామేర రాజ్యం సమర్థంగా నడుస్తున్నది. కానీ న్యాయం అందించటం విషయంలో రాజ్యం ఘోరంగా విఫలమైంది. సుమారు 3 కోట్ల 60 లక్షల కేసులు న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయి. అందునా ఆధునిక ప్రపంచంలో ఎక్కడా లేనిరీతిలో మన దేశంలో ఈ పెండింగ్‌లో ఎక్కువ శాతం క్రిమినల్ కేసులు. ఆర్థిక వ్యవస్థ పెరుగుతున్నకొద్దీ ఆధునిక రాజ్యంలో సివిల్ కేసులు ఎక్కువగా ఉంటాయి. కానీ మన దేశంలో కోర్టుకెళితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం కొరవడటంతో సివిల్ కేసులకు కోర్టులకు వచ్చేవారు తక్కువగా ఉన్నారు. సామాన్యులు అయితే, గొంతులో దుఃఖాన్ని పూడ్చుకుని అన్యాయానికి బలవుతున్నారు లేదా పలుకుబడిని, డబ్బును ఉపయోగించి కండబలంతో బండన్యాయాన్ని పొందే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో మన సమాజం 'బడితె ఉన్న వాడిదే బర్రె' చందాన మారిపోయింది. అందే కొద్దిపాటి న్యాయం కూడా నిష్పక్షపాతంగా అందరికీ సమానంగా వర్తించటం లేదు. మనది నిజమైన చట్టబద్ధపాలన లేని సమాజం. నేర పరిశోధన, ప్రాసిక్యూషన్ రెండూ పూర్తిగా రాజకీయం చేతుల్లో బందీలై పోయాయి. దీంతో ఏ అండా, పలుకుబడిలేని వారు, డబ్బులేని వాళ్లు మాత్రమే ఎంతో కొంత చట్టానికి కట్టుబడవలసి వస్తోంది. మిగిలినవాళ్లంతా అమలుకాని చట్టం నుంచి తప్పించుకుంటారు.







చట్టబద్ధపాలన మృగ్యమైన కారణంగాను, సివిల్ కేసుల్లో కోర్టులకు వెళ్లకుండా సెటిల్‌మెంట్లకి మొగ్గు చూపుతున్న కారణంగానూ కండబలం ఉన్న సంఘటిత నేర ముఠాలు సమాజంలో ప్రాచుర్యాన్ని పెంచుకుంటున్నాయి. ఈ నేరస్తులు కాలక్రమేణా నేర పరిశోధనని, ప్రాసిక్యూషన్‌ని శాసించే రాజకీయంలోకి ఉత్సాహంగా ప్రవేశిస్తున్నారు. న్యాయం అందించటంలోను, చట్టబద్ధపాలన ఇవ్వటంలోనూ కొట్టొచ్చినట్లు కన్పిస్తున్న ఈ వైఫల్యాలు సుపరిపాలనకు పెనుసవాళ్లు. మనం సుపరిపాలన సాధించాలంటే శాంతి భద్రతల్ని కాపాడటంతోపాటు సమర్థ న్యాయాన్ని సత్వరంగా అందరికీ సమానంగా అందించే ఏర్పాటు చేయాలి. నేర పరిశోధనని, ప్రాసిక్యూషన్‌ని స్వతంత్రంగా, సమర్థంగా, జవాబుదారీగా ఉండేలా చేయటం అత్యవసరం.

ఇప్పటి వరకూ భారతీయ సమాజం ప్రధానంగా గ్రామీణ సమాజం. కుటుంబ వ్యవస్థ బలంతో నడుస్తున్న సమాజం. మన సమాజం రీతి వల్ల పట్టణాలకు వలసపోయే వారు కూడా పదుగురూ ఏమనుకుంటున్నారన్న భీతి వల్ల తమ ప్రవర్తనని అదుపుచేసుకుంటున్నారు. కానీ ఇది ఎల్లవేళలా కొనసాగదు. నగరీకరణ, దూర ప్రాంతాలకు వలసలు, ఆర్థిక అభివృద్ధి, ప్రపంచీకరణ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో అనివార్యం. ఉన్నకొద్దీ ఈ మార్పులు కుటుంబ వ్యవస్థను కొంతవరకు బలహీన పరుస్తాయి. అంతకుమించి సామాజిక కట్టుబాట్లు పూర్తిగా బలహీనపడి వ్యక్తి ప్రవర్తనని సమాజం నిర్దేశించటం అసాధ్యమైపోతుంది. కాబట్టి బలమైన, నిష్పాక్షికమైన, సమన్యాయాన్ని అందించే చట్టబద్ధ పాలనా వ్యవస్థకి గట్టి ఏర్పాట్లు చేయకుంటే వచ్చే 30 ఏళ్ల కాలంలో శాంతి భద్రతలు, నేర ప్రవృత్తి అదుపు తప్పే ప్రమాదముంది. సమన్యాయాన్ని అందించే ఏర్పాట్లు లేని సమాజంలో అరాచకత్వం పెరుగుతుంది, కండబలం, ధన ప్రభావం బలహీనుల్ని పూర్తిగా శాసిస్తాయి. ఈ ప్రమాదం నుంచి మన సమాజాన్ని కాపాడటం నేటి చారిత్రక అవసరం.

ఇక శాంతి భద్రతలు, సమన్యాయం, చట్టబద్ధపాలన తర్వాత, ఒక రాజ్యం చేయవలసిన అతి కీలకమైన పని మన సమాజంలో ఉమ్మడి అవసరాలను తీర్చటం. నూటికి 90 పాళ్లు మన జీవితం వ్యక్తిగతంగా లేదా కుటుంబంలో తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడి ఉంటుంది. కానీ వ్యక్తులు తాము సొంతంగా, ఒంటరిగా చేపట్టలేని అంశాలు, అందరూ కలసి సామూహికంగా మాత్రమే చేయగల పనులు మన సమాజంలో చాలా ఉన్నాయి. రోజువారీ మనకు కావలసిన మౌలిక సౌకర్యాలన్నీ ఈ కోవకి చెందుతాయి. ఉదాహరణకి, మన ఇంట్లో కుళాయిలో వచ్చే నీళ్లు, అధిక వర్షాల ముంపు నుండి కాపాడే వరద నివారణ చర్యలు, మురుగునీటి పారుదల, దోమల నియంత్రణ, ఇంటి ముందు రోడ్ల మీద గుంతల్ని పూడ్చటం, ట్రాఫిక్ నియంత్రణ. ఇవన్నీ మన నిత్యావసరాలు. ఇవన్నీ సరిగా అందకపోతే మనం వ్యక్తులుగా సతమతమవుతాం, మన జీవితాలు గందరగోళమవుతాయి, ఆనందం కరవవుతుంది, మన ఉత్పాదకత తగ్గిపోతుంది.

అలాగే మరింత విస్తృతమైన స్థాయిలో ఆర్థిక వ్యవస్థ అందరికీ కావలసిన మౌలిక సదుపాయాలు.. అంటే రవాణా సదుపాయాలు, 24 గంటల విద్యుత్తు, నిరంతరం ప్రపంచంతో సమాచారం పంచుకుని లావాదేవీలు జరుపుకునే కమ్యూనికేషన్ వ్యవస్థ – వీటన్నిటినీ ప్రభుత్వమే స్వయంగా చేయపోవచ్చు కానీ.. వీటిని సమర్థంగా పౌరులందరికీ అందించే ఏర్పాటు చేయటం ప్రభుత్వాల మౌలిక కర్తవ్యం. నిత్యజీవితంలో ఉమ్మడి అవసరాలు, మౌలిక సదుపాయాలు సరిగా అందించకుంటే ఆ సమాజం రాతియుగంలో ఉండిపోతుంది. అలాంటి సమాజంలో ఆర్థిక అభివృద్ధి కష్టం, ఉత్పాదకత అసాధ్యం. మన దేశంలో ఇప్పటికీ పరిశుభ్రమైన నీరు లేక కోట్ల మంది అంటువ్యాధులకు గురవుతున్నారు. నిరుపేదలు సైతం రక్షిత మంచినీరు కోసం నీళ్ల సీసాలను కొనుక్కోవలసి వస్తోంది. ఇక ప్రతి నగరంలోను సరైన వరద నీటిపారుదల వ్యవస్థలేక వర్షం వస్తే మునిగిపోయే పరిస్థితి దాపురించింది. ఇక పారిశుద్ధ్యం సంగతి చెప్పక్కర్లేదు. ఇప్పటికీ గ్రామీణ సమాజంలో చాలామంది బహిరంగ మల విసర్జన చేస్తుండగా, పట్టణాల్లో నగరాల్లో నూటికి 70 మందికి ఇంకా సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేదు. ఆ కారణంగా మన చెరువులు, సరస్సులు, నదులు వ్యర్థపదార్థాలతో కలుషితమై నశించి పోతున్నాయి. మంచినీటి నాలాల్లో మురుగునీరు కలుస్తోంది. ఇక విద్యుత్తు, రవాణాలో ప్రపంచంలో అతి హీన స్థాయిలో ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచంలో 50 పెద్ద దేశాల్లో గమనించినట్లయితే, వాటిల్లో మౌలిక సదుపాయాల్లోను, ప్రభుత్వం పౌరులకు అందిస్తున్న సేవల్లోనూ ప్రతి అంశంలోనూ భారత్ అట్టడుగు స్థానాల్లో పాకిస్తాన్, నైజీరియా, బంగ్లాదేశ్ దేశాల సరసన ఉంది. వీటిని శరవేగంగా, గణనీయంగా అభివృద్ధి చేయకపోతే పేదరికాన్ని తొలగించటం గానీ, అందరికీ గౌరవప్రదమైన జీవితాన్ని ఇవ్వటం గానీ అసాధ్యం.

చట్టబద్ధపాలన, మౌలిక సదుపాయాల తర్వాత ఆధునిక రాజ్యం అందించవలసిన అతి కీలక సేవలు.. అందరికీ అందే మంచి ప్రమాణాల విద్య, నైపుణ్యం, అన్ని కుటుంబాలకీ అందే ఉన్నత ప్రమాణాల ఆరోగ్యం.

ఈ విద్య, ఆరోగ్యం పాలనా రంగాల్లోనూ మన దేశం పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నది. 74 దేశాల మధ్య 15 ఏళ్ల వయసులో ఉన్న పిల్లల విద్యాప్రమాణాల్ని పరిశీలించే సర్వే జరిపినప్పుడు మన దేశం 73వ స్థానంలో నిలిచింది. ఒకే ఒక్క దేశం కిర్గిజిస్థాన్ మన కంటే తక్కువ స్థానంలో ఉంది. 10 ఏళ్ల పాఠశాల చదువు పూర్తయ్యాక కూడా కనీస ప్రమాణాల పరిజ్ఞానం, సమస్యల్ని పరిష్కరించే నేర్పరితనం లేక కోట్లాదిమంది యువత భవిష్యత్తు బుగ్గిపాలవుతోందని ఎన్నో సర్వేలలో తేటతెల్లమవుతోంది. ఎనిమిదవ తరగతిలో మన విద్యార్థుల్లో నూటికి 25 మంది కనీసం 2వ తరగతి స్థాయి వాక్యాలను చదవలేకపోతున్నారు. నూటికి 35 మంది రెండంకెల తీసివేత చేయలేకపోతున్నారు. నూటికి 58 మంది భాగాహారం చేయలేకపోతున్నారు. 14–18 ఏళ్ల మధ్య నూటికి 50 మంది గడియారం చూసి గంట, నిముషాలతో సమయం చెప్పలేకపోతున్నారు. నూటికి 30 మంది డబ్బును లెక్కించలేకపోతున్నారు. నూటికి 50 మంది మార్కెట్లో తూకం వెయ్యలేకపోతున్నారు. అంటే ఆర్థిక వ్యవస్థ విలువను పెంచుతూ తమ కాళ్లపై తాము నిలబడే శక్తిని అందించలేకపోతున్నాము. విద్య మీద విపరీతంగా డబ్బు ఖర్చు పెడుతున్నా, అవి చాలా వరకు నిరర్థకమైపోతున్నాయి. మన విద్యార్థుల తెలివితేటలకు కొదవ లేదు. మన తల్లిదండ్రులు ప్రపంచంలో ఏ దేశానికీ తగ్గకుండా పిల్లల భవిష్యత్తు కోసం అపార త్యాగాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి, సమాజం విద్యను, విద్వత్తును గౌరవిస్తోంది, అయినా సరైన విద్యను అందించకపోవటం వల్ల పుట్టిన కులం, కుటుంబం నూటికి 80 మంది పిల్లల భవిష్యత్తుని శాసిస్తున్నాయి. పుట్టుకతో వచ్చిన అంతరాలు కొనసాగుతున్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు కూడా తీవ్ర అవరోధమవుతోంది.

ఇక ఆరోగ్యం విషయంలో, ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాలలో కరోనా విజృంభించిన తీరు, ఆస్పత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, ఐసీయూల లోటు, సరైన వైద్య సేవలు సకాలంలో అందక లక్షల మంది అకాల మరణం, వైద్య ఖర్చుల్ని భరించే శక్తి లేక పదుల లక్షల కుటుంబాలు గుల్లయిపోవటం.. ఇవన్నీ ఆరోగ్య రంగంలో మన బలహీనతలకి అద్దం పట్టాయి. సరైన ఆరోగ్యం అందక ఏటా 6 కోట్ల మంది భారతీయులు ఏడాది ప్రారంభంలో బీదలు కాకపోయినా సంవత్సరాంతంలో బీదరికంలోకి జారిపోతున్నారు. ఏడాదికి ఏడున్నర లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులు అకాల మరణం పాలవుతున్నారు.

విద్య, ఆరోగ్యం ప్రభుత్వాల మౌలిక బాధ్యతలుగా గత 150 సంవత్సరాల నుండి కూడా మానవ సమాజం గుర్తించటం జరిగింది. ప్రపంచంలో నాగరిక దేశాలు, మంచి ప్రమాణాల దేశాలు అత్యున్నత ప్రమాణాల విద్యను, ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. సంపన్న దేశాలే కాకుండా పలు వర్ధమాన

దేశాలు కూడా మంచి ప్రమాణాల విద్యను, ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. ఉదాహరణకు చైనా పాఠశాల విద్యలో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంది.

కేవలం జాతీయాదాయంలో 1% మాత్రమే ప్రభుత్వాలు ఆరోగ్యానికి ఖర్చు పెడుతున్నాయి. మనకున్న అవకాశాలను ఉపయోగించుకుంటే, జాతీయాదాయంలో అదనంగా, విచక్షణతో 0.4% వినియోగిస్తే ఈ దేశంలో ప్రతి కుటుంబానికీ ఆర్థిక భారం లేకుండా అత్యున్నత ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించగలం. కానీ మంచి ప్రమాణాల విద్య, ఆర్థిక భారంలేని అత్యున్నత ప్రమాణాల ఆరోగ్యం మన రాజకీయ చర్చలో, ఎన్నికల ప్రణాళికల్లో ఇప్పటికీ అంతర్భాగం కాలేదు. పైన పేర్కొన్న లక్ష్యాలు నెరవేర్చని జాతికి ఆర్థికాభివృద్ధి అసాధ్యం. అసమానతలు తొలగించటం అసాధ్యం. వ్యక్తి గౌరవాన్ని పెంచటం అసాధ్యం. కానీ మన రాజకీయ వ్యవస్థలో తాత్కాలిక తాయిలాలతో ప్రజల్ని తృప్తి పరచి ఓట్లు పొందటమే గొప్ప చతురతగా, నైపుణ్యంగా చెలామణి అవుతున్నది. కాబట్టి ప్రభుత్వ మౌలిక బాధ్యతల్ని పక్కనపెట్టి ఎన్నికల్లో నెగ్గటానికి ప్రజల్ని తాత్కాలిక తాయిలాలతో ఆకట్టుకోవటం రాజకీయ ఎత్తుగడగా నడుస్తున్నది. ఈ పైన పేర్కొన్న లక్ష్యాల్ని సాధించకుండా మిగిలిన ఎన్ని లక్ష్యాల్ని ప్రతిపాదించినా అవి మన బిడ్డల భవిష్యత్తుకి నిరర్థకమే.

### వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన

ఇక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం మందిహితం కోసం కావలసిన లక్ష్యాల్ని సాధించటంతోపాటు వ్యక్తి స్వేచ్ఛను వికసింపచేయాలి, స్వపరిపాలనను సార్థకం చేయాలి.

మన దేశంలో స్వేచ్ఛ ప్రధానంగా ఉంది కానీ, హక్కులతోపాటు బాధ్యతలు ఉన్నాయన్న స్పృహ లేదు. ప్రజలకు ఆదర్శాన్ని చూపాల్సిన రాజకీయ రాజకీయ పార్టీలు నిరంతరం అప్రజాస్వామిక నిరసన పద్ధతులను అనుసరిస్తున్నాయి. చీటికిమాటికి రాస్తారోకోలు, బంద్‌లు, హర్తాళ్లు, రైల్‌రోకోల వల్ల పాలన కుంటుపడుతూ ప్రజల హక్కులు హరించుకుపోతున్నాయి. రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చే సమయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ ధోరణులపై మనల్ని హెచ్చరించారు కూడా. రాజ్యాంగబద్ధ వ్యవస్థ, వయోజన ఓటు ఉన్న సమాజంలో నిరసన పద్ధతులు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, సమాజ జీవనానికి ఎటువంటి ఆటంకం లేని రీతిలో ఉండాలి. అలాకాకుండా వలస పాలన కాలంనాటి పద్ధతుల్ని కొనసాగిస్తే అది ప్రజల స్వేచ్ఛకు అవరోధమవుతుంది. అలాగే విపరీత కేంద్రీకరణ ఉన్న మన దేశంలో పేరుకి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు క్రమబద్ధంగా జరుగుతున్నా, స్వపరిపాలనకు చోటు లేకుండా పోయింది. అధికారం ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్‌ల చేతుల్లోనే కేంద్రీకృతమవటంతో, సామాన్య ప్రజలకు తమ చుట్టూ ఉన్న సమస్యల్ని పరిష్కరించుకునే అవకాశాలు మృగ్యమయ్యాయి. స్థానిక ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. రోజువారీ పరిపాలన అధ్వాన్నంగా ఉండటం సామాన్యుల జీవితాల్ని దుర్భరం చేస్తోంది. చాలా సందర్భాల్లో లంచాలు, సిఫార్సు లేకుండా, పదిసార్లు తిరిగి తిరిగి వేసారకుండా పౌరులకు హక్కుగా జరగాల్సిన ఒక్క చిన్న పని కూడా జరగటం లేదు. ఇప్పటికీ పౌర సేవల్ని సకాలంలో అందించటం కోసం సిటిజన్ చార్టర్ల చట్టం గానీ, అమలుగానీ లేకుండా పోయింది.

మన ప్రజాస్వామ్యం స్వయందిద్దుబాటు శక్తిని ప్రదర్శించటంలో విఫలమైంది. ప్రతి చిన్న విషయానికీ రాద్ధాంతం చేస్తే గానీ, ఉద్యమం చేస్తే గానీ, అరుపులు, కేకలు, పెడబొబ్బలు పెడితే గానీ ప్రభుత్వాలు స్పందించవనే భావన సమాజంలో పాతుకుపోయింది. ఇది ప్రజాజీవితంలో అరాచకత్వానికి దారితీస్తోంది. పాలనలో పారదర్శకత కొరవడింది. ఎంతో ఆశతో ఒక ప్రామాణికమైన పాలనా సమాచార హక్కు చట్టాన్ని తీసుకొస్తే ఆచరణలో నిర్వీర్యం చేశారు. ఇలా వివిధ స్థాయిల్లో పాలకులు ప్రజలకు ఏమాత్రం జవాబుదారీ కాకుండా వ్యవహరిస్తుండటంతో.. యజమానులు కావలసిన ప్రజలు గులాములుగా మారారు, ప్రజలకు సేవకులు కావలసిన పాలకులు ప్రభువులుగా రూపాంతరం చెందారు. ఇవన్నీ వ్యవస్థ స్వేచ్ఛను కుంటుపరుస్తున్నాయి, ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్నాయి.

### రాజకీయ, పాలనా సంస్కరణల్ని చేపట్టాలి

ఈ పరిస్థితుల్ని చక్కదిద్దాలంటే, మౌలికమైన రాజకీయ, పాలనా సంస్కరణల్ని చేపట్టటం అవసరం. ప్రజాస్వామ్యం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. అన్ని ప్రజాస్వామ్య దేశాల్లోనూ ఈనాడు మన దేశంలో ఉన్న పరిస్థితులు తారసపడ్డాయి. కానీ ఆ దేశాల్లోని నాయకత్వం ముందుచూపుతో, విజ్ఞతతో, సకాలంలో స్పందించి సవాళ్లను అధిగమించాయి. మన దేశంలో అన్ని రంగాల్లో – రాజకీయం, పాలన, పౌర సమాజం, పత్రికల్లోని ఆలోచనాపరులు సంస్కరణల కోసం నడుం బిగించాలి. కొందరు వ్యక్తులు, కుటుంబాల ప్రయివేటు ఆస్తులుగా మారిన పార్టీలని ప్రజాస్వామీకరణ చేయటం, అధికారాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి ఎక్కడికక్కడ కట్టుదిట్టంగా జవాబుదారీతనానికి ఏర్పాట్లు చేయటం, పాలనా యంత్రాంగంలో సమూలమైన సంస్కరణల్ని చేపట్టి సామర్థ్యం, వృత్తి నైపుణ్యం, సంకల్పం, నిజాయతీ నిరంతరం నిలబడేందుకు తగిన ఏర్పాట్లు చేయటం, మౌలికమైన ఎన్నికల సంస్కరణల్ని చేపట్టి డబ్బు పంపిణీ, తాయిలాలని ఎర చూపటం, ద్వేషాల్ని రగల్చటం చుట్టూ నడుస్తున్న ఎన్నికల రాజకీయాన్ని సమూలంగా మార్చటం, సమర్థులు, నిజాయతీపరులు రాజకీయంలో ప్రవేశించటానికి, ఎదగటానికి, ప్రజాహితాన్ని పెంచటానికి తగిన ఏర్పాట్లు చేయటం, పైన వివరించిన ప్రాధాన్యాల్ని జాతి లక్ష్యాలుగా గుర్తించి ఒక దశాబ్ద కాలంలో సాధించటానికి ఒక బృహత్తర కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టటం ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం. సుపరిపాలన నినాదంగా మారిపోయి ఏడాదికి ఒకసారి స్మరించటంగా తయారైతే సుపరిపాలన అందదు. అందుకు దేశ ప్రజల భాగస్వామ్యం, రాజకీయ, పాలనా రంగాల్లో ప్రజాస్వామిక మార్పులకు జవాబుదారీతనంతో వ్యవస్థల్ని నిర్మించుకోవటం అవసరం. ✦

# ప్రజాస్వామ్యానికి పెరుగుతున్న సవాళ్లు

20వ శతాబ్దంలో స్ఫూర్తిదాయక లక్ష్యంగా నిలిచిన ప్రజాస్వామ్యం.. 21వ శతాబ్దం రెండు దశాబ్దాలు గడిచే నాటికి, పరిస్థితి ఏమిటి అనే పెద్ద ప్రశ్నను ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యానికి ప్రపంచ చిరునామాగా వెలుగొందుతున్న అమెరికాలో వ్యవస్థీకృత లోపాల్ని సరిచేయకుండా వాటిని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందటమే లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ చెలరేగిపోవటంతో.. ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై చర్చ అంతర్జాతీయ మైంది. తాను అధ్యక్ష పదవిలో ఉండి కూడా అమెరికా ఎన్నికల వ్యవస్థ మీదే ఆరోపణలు చేసిన ట్రంప్‌ను గద్దె దింపి అధికారం లోకి వచ్చిన డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్, ప్రజా స్వామ్యంపై ప్రపంచ సదస్సును నిర్వహించనున్నట్లు ప్రమాణ స్వీకారం సమయంలోనే ప్రకటించారు. 2021 చివర్లో సుమారు 110 దేశాల భాగస్వామ్యంతో సదస్సును నిర్వహించారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణకు అధ్యక్షుడి చొరవ' అనే కార్యక్రమం కింద అమెరికా నిర్వహించిన 'ప్రజాస్వామ్య శిఖరాగ్ర సదస్సు' చర్చల పట్ల, తీర్మానాలు, కార్యాచరణల పట్ల ప్రజాస్వామ్యవాదులు, రాజనీతి శాస్త్రజ్ఞులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. అయితే అంత స్థాయిలో సదస్సు జరగలేదు. 'ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య పునరుద్ధరణవ్యూహం' కింద 42.44 కోట్ల డాలర్లను సమకూర్చనున్నట్లు బైడెన్ చేసిన ప్రకటన మొక్కుబడిగా ఉంది. సదస్సుకు ఆహ్వానించిన దేశాల జాబితా పట్ల కూడా సహేతుక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పాకిస్తాన్‌ను పిలిచి, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకల్ని తప్పించటమంటే ఆ ప్రాతిపదికలు ప్రశ్నించదగ్గవే అవుతాయి. ఇదే సమయంలో, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశంలో ఒక కీలక ఘటన నమోదైంది. దాదాపు సంవత్సరం పాటు ఢిల్లీ సరిహద్దుల వద్ద రైతులు చేసిన ఆందోళనలకు తలొగ్గి మోదీ సర్కారు నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేసింది.

ఈ సాగు చట్టాల వల్ల రైతులకు మేలు జరుగుతున్నా, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పలుమార్లు ఈ చట్టాలను తీసుకొస్తామని చెప్పినా, పలు రాష్ట్రాల్లో ఈ చట్టాల పట్ల పెద్ద వ్యతిరేకత లేకున్నా కూడా.. బలమైన శక్తుల ఆందోళనల ప్రభావానికి రైతులు, ప్రజలు లోనుకాకుండా వారికి వాస్తవాల్ని వివరించటం, ఆందోళనకారులకు కూడా నచ్చచెప్పి ఒప్పించటం వంటి పనుల్ని ప్రభుత్వం చేయలేకపోయింది. ప్రజల్లో అపార ఆదరణ ఉన్న నాయకుడి నేతృత్వంలోని ప్రభుత్వమే అయినా కూడా ఒక మంచి పనికి ప్రజలను సన్నద్ధం చేయటంలో విఫలమైంది. ఈ వైఫల్యం, పార్లమెంటులో వ్యవసాయ సంక్షోభంపై సరైన చర్చ లేకుండానే వ్యవసాయ చట్టాలను ఆమోదించటం నుండీ మొదలైంది. ఎప్పుడైతే ఉత్తర ప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయో, తాను ప్రధానమంత్రినని మర్చిపోయి ఫక్తు పార్టీ నేతలా మోదీ వ్యవహరించారు. చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ రైతులకు క్షమాపణ చెప్పారు. ఆరోజు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఒక సునిశిత వ్యాఖ్య చేశారు. "ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు ఎలా తీసుకోవాలో భవిష్యత్ తరాలకు వ్యవసాయ చట్టాలు ఒక గొప్ప కేస్ స్టడీ" అన్నారు.




మోదీ భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని, పార్టీని, పాలనని విపరీతంగా కేంద్రీకరిస్తున్నారని కొన్నేళ్లుగా బలమైన ఆరోపణలు వస్తున్నాయి. అయితే వరుసగా రెండోసారి, అది కూడా అంతకుముందు కంటే పెద్ద మెజారిటీతో గెలవటంతో ఆ విమర్శల స్వరం తగ్గింది. ఆ తర్వాత కరోనా వచ్చాక మహమ్మారిని బూచిగా చూపి నిరంకుశ నిర్ణయాలు తీసుకున్నారని మళ్లీ విమర్శలు పదునెక్కాయి. వ్యవసాయ చట్టాల నేపథ్యంలో మోదీ పాలనలోని అప్రజాస్వామిక ధోరణులపై చర్చ విస్తృతమైంది. కానీ మోదీ మన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచటం కన్నా.. మన ప్రజాస్వామ్యంలో పరిణతిని పెంచే వ్యవస్థీకృత మార్పుల్ని మనం స్వతంత్రం వచ్చిన దగ్గర్నుండీ ఇంతవరకూ తీసుకురాలేకపోయామన్నది మనం మొదట గుర్తించాల్సిన అంశం. ఈ దీర్ఘకాల వైఫల్యాన్ని సరిచేసేందుకు మోదీ తనకు లభించిన చరిత్రాత్మక ఎన్నికల విజయాన్ని వినియోగించకపోవటం ఒక దురదృష్టకర పరిణామం. ఆ మేరకు కాలం వృధా అయి జాతి మూల్యం చెల్లించకతప్పదు.

ప్రజాస్వామ్యంపై అమెరికా నిర్వహించిన శిఖరాగ్ర సదస్సులో మోదీ మాట్లాడుతూ, సున్నితత్వం, జవాబుదారీతనం, భాగస్వామ్యం, సంస్కరణలు అనే నాలుగు స్తంభాల మీద భారత ప్రజాస్వామ్య పాలన నడుస్తోందని చెప్పారు. మానవ గౌరవానికి పట్టం కడుతున్నామన్నారు. చట్టాన్ని, బహుళత్వాన్ని గౌరవించటం భారతీయుల్లో అంతర్లీనంగా ఉంటుందని చెప్పారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా కన్పిస్తుంది. ఆ అంశాలకు తగ్గ సంస్థాగత ఏర్పాట్ల విషయంలో ఎటువంటి నిర్మాణాత్మక ప్రయత్నమూ లేదు.

మోదీ చెప్పిన నాలుగు అంశాలు - సున్నితత్వం,

జవాబుదారీతనం, భాగస్వామ్యం, సంస్కరణల్లో భాగమైన చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యానికి స్థానిక స్వయంపాలనకు ఏర్పాట్లు, పాలన, రాజకీయ, ఎన్నికల సంస్కరణలు ఎంత అరకొరగా, సాంకేతికంగా ఉన్నాయి!

రుసుము చెల్లించి ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పొందాల్సిన సేవలకు గ్యారంటీ ఇచ్చే ఏర్పాటు చేయకుండా.. గతిలేక లంచం ఇచ్చే సామాన్య పౌరుడ్ని ప్రభుత్వోద్యోగి కంటే తీవ్రంగా, వేగంగా శిక్షించేలా చట్టసవరణ తీసుకొచ్చింది మోదీ సర్కారు. వ్యవస్థలో బాధితులుగా ఉన్న సామాన్య ప్రజలను నేరస్తులుగా చూడటం పెద్ద ప్రజాస్వామిక పాలనా వైఫల్యం. పాలనా యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు ఏర్పాట్ల పట్ల ఎటువంటి శ్రద్ధనూ ప్రదర్శించకపోగా, అందుకు దోహదం చేసే పాలనా సమాచార హక్కు చట్టాన్ని కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మరోవైపు, అవినీతి అక్రమాలను నియంత్రించేందుకు స్వతంత్రంగా వ్యవహరించాల్సిన సంస్థల్ని ప్రతిపక్షాల మీద దాడులకు ఎన్నికల సందర్భాల్లో ఉపయోగించుకుంటూ వ్యవస్థలను బలహీనపరుస్తున్నారు. ఎన్నికల సంఘం కూడా విమర్శకు అతీతంకాని పరిస్థితి నెలకొంది. వ్యతిరేకించేవారిపై పెగాసస్ స్పైవేర్‌తో నిఘా పెట్టినట్లు బలమైన ఆరోపణలున్నాయి. ప్రజల మధ్య సుహృద్భావాన్ని, పరస్పర నమ్మకాన్ని పెంచి సమాజం సవ్యంగా నడవటానికి కావలసిన చట్టబద్ధపాలన అధ్వాన్నంగా ఉంది. నేరచరితులు రాజకీయాలలో కొనగటానికి మోదీ పార్టీయే ఊతమిస్తోంది. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్నవారిని కూడా మోదీ కేబినెట్‌లోకి తీసుకున్నారు. పాలనాధికారాలు ఎక్కువగా ఉండాల్సిన రాష్ట్రాలకు చొరవ తీసుకునే అవకాశం లేకుండా ఫెడరలిజాన్ని బలహీన పరుస్తున్నారు. ప్రజల భాగస్వామ్యానికి ఎంతో కీలకమైన స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చేందుకు ఎటువంటి చొరవా లేదు. సర్పంచ్ చెప్పాల్సిన విషయాల్ని కూడా ప్రధానమంత్రే మాట్లాడతారు. ఆ తర్వాత ఆ అంశాలేమయ్యాయో ఎవరికీ పట్టదు. తన జీవితం మీద తనకు పూర్తి అధికారం చిట్టచివరి పౌరునికి కూడా ఉండేలా, తప్పు చేసే పాలకుల్ని ప్రజలు ఎప్పుడైనా నియంత్రించగలిగేలా వ్యవస్థ ఉన్నప్పుడే స్వాతంత్ర్యానికి సార్థకత అని మహాత్మాగాంధీ భావించేవారు. స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన ఉత్సవాలు జరుపుకుంటున్నా, ఇప్పటికీ ఆ స్పృహ ఏ అంచెలోనూ మన పాలకుల్లోకి రావటం లేదు. తన రోజువారీ జీవితంలో 80 శాతం అంశాలతో ముడిపడిన పాలనను వెంటనే సరిదిద్దుకునే అవకాశం ఈ దేశ ప్రజలకు లేదు. ప్రజాస్వామ్యానికి పాఠశాలలు వంటి స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యం కావటంతో, ప్రజలకు పాలన, రాజకీయం పనితీరు పట్ల అవగాహన కొరవడుతోంది, సరైన నాయకత్వం రూపుదిద్దుకోవటం లేదు. సాంకేతికత వినియోగమే వీటన్నిటినీ పరిష్కరించే సర్వరోగనివారణి అని మోదీ భావిస్తున్నట్టుంది. అయితే, సర్వత్రా డిజిటల్, క్రిప్టో కరెన్సీలు వచ్చినా సరే.. పాలనను బాగు చేయకుండా అత్యధిక శాతం ప్రజానీకానికి సాధికారత అసాధ్యమన్నది వాస్తవం. పాలనను బాగుచేయాలంటే ప్రభుత్వాలు తాము నిర్వర్తించాల్సిన మౌలిక బాధ్యతల్ని పార్టీలకతీతంగా నిర్వర్తించాలి.

ప్రభుత్వం తన విధిగా.. చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలు, స్థానిక స్వయంపాలన, సత్వర న్యాయం మొదలైన చర్యల్ని చేపట్టాలి. ఇవి లేకుంటే ఆర్థిక, సామాజిక అంతరాలు పెరుగుతాయి, ఓటుకు–తమ జీవితానికి మధ్య సంబంధం అర్థం కాక ప్రజలు తాత్కాలిక తాయిలాల కోసం అర్రులు జాస్తారు, మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుంది, డబ్బు నల్లదా, తెల్లదా అని తేడా లేకుండా అధికారమే పరమావధిగా డబ్బు రాజకీయం వెర్రితలలు వేస్తుంది, ప్రజాస్వామ్యం కంటే నియంతృత్వమే మేలనే ధోరణులు పెరుగుతాయి. ప్రజల్లో ప్రజాస్వామ్య స్పృహ పెరగడానికి సామాజిక మాధ్యమాలు ఎంతగానో దోహదం చేస్తున్నప్పటికీ, కనీస ప్రమాణాల జీవితం అత్యధిక ప్రజలకు కొరవడుతుండటంతో స్వేచ్ఛ కాస్తా మార్కెట్ సరకుగా మారిపోయి, స్వేచ్ఛకు, సమానత్వానికి మధ్య వైరుధ్యం ఏర్పడుతోంది. డిజిటల్ నియంతృత్వం పెచ్చరిల్లుతోంది.

తమ సామర్థ్యానికనుగుణంగా ఎదిగే అవకాశాల్ని సమాజం, వ్యవస్థ అందించటంలేదని భావించేవారి సంఖ్య పెరుగుతుండటం వల్లే ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యంపై అసంతృప్తి పెరుగుతోంది. కొవిడ్ వంటి పరిస్థితులు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. నిరంకుశ పాలకులు ప్రాచుర్యంలోకి వస్తున్నారు. ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం సన్నగిల్లటంతోపాటు కనీస జీవన ప్రమాణాల పట్ల పోరాడే క్రమంలో ప్రతిఘటించే సామర్థ్యం, సంకల్పం ప్రజల్లో పరిమితమైపోతోంది. ఇలాంటి పరిస్థితుల నుండే ప్రజాస్వామ్య దేశాలుగా మారిన కొద్దికాలంలోనే 2021లో ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్‌లలో నియంతృత్వ వ్యవస్థలు వచ్చాయి.

అయితే ఎన్ని లొసుగులున్నా మొత్తంగా ప్రజాస్వామ్యాన్ని అక్కర్లేదనుకునే పరిస్థితయితే లేదు. చివరికి నియంతృత్వ దేశమైన చైనా కూడా తమది ప్రజాస్వామిక వ్యవస్థేనని, కాకపోతే భిన్నమైన ప్రజాస్వామిక వ్యవస్థని వాదిస్తోంది. ప్రజాస్వామ్యంలో అంతిమమైన ప్రజాభిప్రాయం తమ పక్షానే ఉందని పేర్కొంది. ప్రజాస్వామ్యం పేరుతో ఇరాక్, లిబియా, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా నిర్వాకాన్ని రష్యాతో కలిసి ఎండగట్టింది. చైనా తీరును ఆ దేశ ప్రజలు ఆమోదిస్తున్నారంటే, ఒక ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రభుత్వాలు చేయాల్సిన పైన పేర్కొన్న మౌలిక బాధ్యతల్ని చైనా ఏకపార్టీ ప్రభుత్వం సక్రమంగా నెరవేరుస్తుండటం వల్లే. సాంస్కృతిక ఆధిపత్యంతో, డిజిటల్ పాలనతో చైనా నమూనాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం.. నియంతృత్వ వ్యవస్థ మనుగడకు చైనా కూడా ఒక ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలననే పునాదిగా చేసుకుందని గుర్తించాలి.

ఎన్నో స్వతంత్ర పోరాటాలకు స్ఫూర్తినిచ్చి ప్రజలను నడిపించిన ప్రజాస్వామ్యం అనే లక్ష్యం ఇప్పుడు ఒడిదుడుకులను ఎదుర్కొంటుండవచ్చు, ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద

సవాళ్లలో ఇది ఒకటి కావచ్చు. కానీ ఇప్పటికీ ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయాన్నయితే ఎవరూ ప్రతిపాదించకలేకపోతున్నారు. కరోనా కాలంలో కూడా ప్రభుత్వాల అప్రజాస్వామిక ధోరణులపై పౌర సమాజం క్రియాశీలంగా పోరాడిందని మనం విస్మరించకూడదు. ఉన్న వ్యవస్థలన్నిటిలోకీ ప్రజాస్వామ్యమే అత్యుత్తమమైనది. మానవాళి చరిత్రలో గణనీయమైన ప్రగతి ప్రజాస్వామిక వ్యవస్థల ద్వారా సాధ్యమైందని పలు రుజువులు కూడా ఉన్నాయి. భారతదేశం ఒక ప్రజాస్వామిక దేశంగా నిలదొక్కుకోవాలంటే, వాస్తవాలు, నిష్పాక్షికత, విశ్వసనీయత, విలువలు, జవాబుదారీతనం, దూరదృష్టి ఉన్న వ్యవస్థను నిర్మించుకోవాలంటే, ముందు రాజ్యం చేయాల్సిన మౌలిక బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు, మౌలికంగా ప్రజాస్వామ్య స్వభావంలేని భారతీయ సమాజాన్ని రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామీకరించాలంటే రాజ్యం పాత్ర కీలకం. ముఖ్యంగా రాజ్యవ్యవస్థ తన మౌలిక బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చాలి. ఆపైన సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాల్లోకి వచ్చేలా రాజకీయ, ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావాలి. పార్టీల్ని ప్రజాస్వామికం చేసే పద్ధతుల్ని ప్రవేశపెట్టాలి. సాగు చట్టాలు వంటి అంశాల్లో ప్రజలు ఆందోళనలకు దిగినప్పుడు స్పందించే రాజకీయ వ్యవస్థ, రాజ్యాంగబద్ధ పద్ధతులను ప్రోత్సహించే రాజకీయ సంస్కృతి నెలకొనాలి. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగేందుకు (రైతుల ఆందోళనలకు స్పందించామని ఓ పక్క చెబుతూనే, మరోపక్క సాగు చట్టాల రద్దుని కూడా పార్లమెంటులో ఏకపక్షంగా ప్రభుత్వం ప్రకటించింది) చర్యలు తీసుకోవాలి. బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంపొందించాలి. అప్పుడు మాత్రమే సామాజిక ఒడంబడిక ద్వారా ప్రజలు ఆశిస్తున్న వ్యక్తి గౌరవం, ఎదిగే అవకాశాలు, సుఖమయ జీవనం లభిస్తాయి. తాత్కాలిక సంక్షోభాలకు, మన దీర్ఘకాల స్వయంకృతాపరాధాలకి హేతుబద్ధ పరిష్కారాలు వెతక్కుండా నియంతృత్వం వైపు మొగ్గు చూపితే ఆ నష్టాన్ని అధిగమించటానికి మళ్లీ ఎంతో సమయం వృథా అవుతుంది.

మానవ జీవితం నిత్యనూతనం. దీర్ఘకాలంలో చూస్తే తప్ప ఆ నిత్యనూతనాల్ని గుర్తించలేం. అలాగే ప్రతి తరం అంతకుముందు తరం కంటే మెరుగైన పరిస్థితుల్లో ఉంటుంది, భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. ప్రజాస్వామ్యం అంటే మానవ జీవన విధానానికి వ్యవస్థీకృత ఏర్పాటే. అందుకే నిత్యనూతనత్వం అవసరం. మనిషి ఎలాగైతే నిత్యనూతనంగా ఆలోచిస్తూ కొత్త పరిస్థితులకనుగుణంగా కొత్త పుంతలు తొక్కుతుంటాడో, అలాగే ప్రజాస్వామ్యాన్ని కూడా ఎప్పటికప్పుడు కొత్త పరిస్థితులకనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ పరిపుష్టం చేసుకుంటుండాలి. ప్రజాస్వామ్యం ఉచితంగా లభించదు కాబట్టి, అందుకు మన వంతు బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చాలి అని గుర్తించి వ్యక్తి సుఖాన్ని, సమాజ హితాన్ని సంధానం చేసుకుంటూ జీవనశైలిలో భాగం చేసుకోవటమే మనం చేయవలసింది.

## అసమానతల నిలయంగా భారత్

**ప్రజాస్వామ్యం అంటేనే అందరిదీ అని అర్థం, సమన్యాయం, సమానత్వం ఉన్న వ్యవస్థ అని అర్థం. కానీ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందిన భారతదేశం అసమానతల నిలయంగా కొనసాగుతోంది. దేశంలో ఉన్నత వర్గీయుల సంపద మాత్రమే పెరుగుతోందని ప్రపంచ అసమానతలపై తాజా నివేదిక వెల్లడించింది. 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' ప్రచురించిన ఈ నివేదిక ప్రకారం.. పైస్థాయిలోని 10 శాతం మంది జాతీయాదాయంలో 57 శాతాన్ని, 1 శాతం మంది 22 శాతాన్ని సొంతం చేసుకుంటూ ఉంటే, దిగువ శ్రేణిలోని 50 శాతం మంది వాటా కేవలం 13 శాతం. భారత వయోజనుల సగటు జాతీయాదాయం రూ.2,04,200గా ఉంది. ఇందులో 50 శాతం ప్రజల సగటు ఆదాయం రూ.53,610 మాత్రమే. దేశంలో సగటు కుటుంబ సంపద రూ.9,83,010గా ఉంది. అలాగే భారత్‌లో లింగపరమైన అసమానతలూ చాలా ఎక్కువ. చైనా మినహా ఇతర ఆసియా దేశాల్లో కార్మికుల ఆదాయంలో స్త్రీల వాటా 21 శాతం కాగా, భారత్‌లో అది 18 శాతం మాత్రమే. కొవిడ్ సంక్షోభం వచ్చాక పేద, ధనిక అంతరాలు మరింత తీవ్రమయ్యాయి.**

## ప్రజాస్వామ్య దేశాలు ఎన్ని?

అమెరికా నిర్వహించిన ప్రజాస్వామ్య శిఖరాగ్ర సదస్సులో 110 దాకా దేశాలు పాల్గొన్నా, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలు వందలోపే ఉన్నాయని అంతర్జాతీయ ప్రజాస్వామ్య, ఎన్నికల సహాయ సంస్థ (ఐడీఈఏ) తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ జనాభాలో దాదాపు మూడింట రెండొంతుల మంది అరకొర ప్రజాస్వామ్యమున్న లేదా ప్రజాస్వామ్యం క్రమంగా క్షీణిస్తున్న దేశాల్లో నివసిస్తున్నట్లు తెలిపింది. ప్రజాస్వామ్య విలువలను గౌరవించే దేశాల్లో ప్రజల సంఖ్య ప్రపంచ జనాభాలో 10 శాతం లోపే ఉంది. చైనా, సౌదీ అరేబియా, ఇరాన్ సహా 47 దేశాల్లో నిరంకుశ ప్రభుత్వాలుండగా, రష్యా, మొరాకో, టర్కీ తదితర దేశాల్లో మిశ్రమ ప్రభుత్వాలున్నాయి. పలు దేశాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయటం, వ్యక్తిగత విశ్వాసాలను నియంత్రించటం, మీడియాను కట్టడి చేయటం వంటి ధోరణులు పెచ్చరిల్లుతున్నాయి. మాలి, ట్యునీషియా, బెలారస్, సూడాన్, క్యూబా తదితర దేశాల్లో సైనిక తిరుగుబాటు, ప్రజాస్వామ్య అణచివేతలు చోటు చేసుకున్నాయి. అమెరికా, భారత్‌లలోనూ ప్రజాస్వామ్యం ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు నివేదిక తెలిపింది.

# సరైన ప్రమాణాలుంటేనే ప్రజాస్వామ్యం

**- డా॥ బీఆర్ అంబేద్కర్**



ప్రజాస్వామ్యం సంక్షోభంలో చిక్కుకోకుండా విజయవంతంగా పనిచేయాలంటే కొన్ని ప్రమాణాలను పాటించాలి. ఈ అంశం గురించి చర్చించే ముందు కొన్ని ప్రాథమిక సూత్రాలను గమనంలోకి తీసుకోవటం అవసరం. మొదటిది: ప్రజాస్వామ్యం ఎప్పుడూ ఒకే తీరులో ఉండదు. ప్రజాస్వామ్య భావన ఎప్పటికప్పుడు స్థాయిలో మార్పు చెందుతూ వస్తుంటుంది. ఉదాహరణకు గ్రీకుల అథీనియన్ ప్రజాస్వామ్యం వేరు. ఇప్పటి మన ప్రజాస్వామ్యం వేరు. నాటి గ్రీకు సమాజంలో సగం మందే పౌరులు. మిగిలిన సగం బానిసలే. బానిసలకు ఎటువంటి రాజకీయ హక్కులు ఉండవు. మన ప్రజాస్వామ్యం ఇందుకు పూర్తిగా భిన్నమైనది. రెండవ అంశం: ప్రజాస్వామ్యం ఒకే దేశంలో కూడా ఒకే రకంగా ఉండదు. ఇంగ్లండ్ చరిత్రనే తీసుకుంటే, 1688 విప్లవం ముందు ప్రజాస్వామ్యం వేరు, తదనంతరం వేరు. మళ్లీ 1832 చట్టం తర్వాత ప్రజాస్వామ్యం లక్షణంలోనే కాదు లక్ష్యంలో కూడా మార్పు వస్తుందని మనం గమనించాల్సిన మూడవ విషయం. పురాతన ఇంగ్లిష్ ప్రజాస్వామ్యాన్ని గమనిస్తే లక్షణంలో, లక్ష్యాలలో మార్పు కనిపిస్తుంది. రాజు నిరంకుశ అధికారాన్ని అడ్డుకోవడానికి ప్రజాస్వామ్య చర్యలు అవసరమయ్యాయి.

మరి ఈరోజు ప్రజాస్వామ్యం లక్ష్యం ఏమిటి? ప్రజాసంక్షేమమే ఈనాటి ప్రజాస్వామ్య ప్రధాన కర్తవ్యం. ఇది ప్రజాస్వామ్య భావనలో వచ్చిన బలీయమైన మార్పు.

ప్రజాస్వామ్య భావనలో వచ్చిన మార్పులు సరే, ఇంతకీ ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? రాజనీతి కోవిదులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు అనేకమంది అనేకరకాలుగా ప్రజాస్వామ్యాన్ని నిర్వచించారు. మనం రెండు ప్రఖ్యాత నిర్వచనాలను తీసుకుందాం. వాల్టర్ బెగాట్ ఆధునిక ప్రజాస్వామ్యాన్ని "చర్చల ద్వారా ప్రభుత్వం" అని నిర్వచించారు. ఇక అబ్రహాం లింకన్ ఇచ్చిన నిర్వచనం చాలామందికి తెలిసిందే. "ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వమే ప్రజాస్వామ్యం". నా దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే "రక్తపాతరహితంగా ప్రజల ఆర్థిక, సామాజిక జీవితాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చే ప్రభుత్వ వ్యవస్థ". ప్రభుత్వం వివిధ రంగాలలో ప్రవేశపెట్టే మార్పును ప్రజలు శాంతియుతంగా ఆమోదిస్తే ప్రజాస్వామ్యం ఉన్నట్టే. ప్రజామోదమే ప్రజాస్వామ్యానికి గీటురాయి. ఈ ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయాలంటే ఎటువంటి పరిస్థితులు ఉండాలి అన్నదే ఇప్పుడు మన ముందున్న విషయం. ఫలానా సూత్రాలను అనుసరిస్తే ప్రజాస్వామ్యం విజయవంతంగా నడుస్తుందని ఇంతవరకూ ఏ శాస్త్రకారుడూ రాయలేదు. మనకు మనంగా చరిత్రను అధ్యయనం చేసి ప్రజాస్వామ్య సాఫల్య, వైఫల్య పరిస్థితులను అర్థం చేసుకుని స్థూలంగా నిర్ణయాలు చేసుకోవాలి.

ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఉండాల్సిన మొదటి షరతు- సమాజంలో ఎటువంటి అసమానతలు ఉండకపోవటం. అణచివేతకు గురయ్యే వర్గం ఉండకూడదు. పల్లకీ ఎక్కేవాళ్లు, పల్లకీ మోసేవాళ్లు ఉన్న సమాజంలో ప్రజాస్వామ్యం వికసించదు. ఇంత హెచ్చుతగ్గులు ఉన్న సమాజంలో రక్తపాత విప్లవానికి ఎప్పుడూ అవకాశాలు ఉంటాయి. మనం ముక్కచెక్కలుగా ఉంటే ప్రజాస్వామ్య సౌధం కూలిపోతుందని లింకన్ మహాశయుడు హెచ్చరించారు. వర్గం, కులం వంటి విభేదాలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తాయి. అణచివేసే, అణచివేతకు గురయ్యేవారి మధ్య అగాధం పెరిగినకొద్దీ ప్రజాస్వామ్యంకుప్పకూలుతుంది. సామాజిక అసమానతల వల్ల ప్రజాస్వామ్యం విఫలమైన ఉదాహరణలు చరిత్రలో కోకొల్లలు.

ప్రజాస్వామ్యం క్రమబద్ధంగా పనిచేయడానికి అవసరమైన రెండవ కీలకాంశం- ప్రతిపక్షాల ఉనికి. ప్రజాస్వామ్యంలో పార్టీ పద్ధతి గురించి పెద్ద చర్చే జరుగుతోంది. మాట వరసకు అడుగుతున్నాను- అసలు ప్రజాస్వామ్యం పనితీరు ఏమిటి? ఇది ఒక రకమైన వీటో అధికారం. నియంతృత్వ, ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకునే అధికారాన్ని కలిగి ఉండటమే

ప్రజాస్వామ్యం. అయిదేళ్లకొకసారి తమ దగ్గరికొచ్చే ప్రతినిధులను తొలగించాలా, తిరిగి ఎన్నుకోవాలా? అన్నది నిర్ణయించుకునే అధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. అంటే ప్రజల చేతుల్లో వీటో అధికారం ఉంటుందన్న మాట. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు సవాలు చేయటానికి, అవసరమైతే తిప్పికొట్టటానికి ప్రతిపక్షం ఉంటేనే ఇది సాధ్యపడుతుంది. తన పార్టీకి చెందని సభ్యులకు జవాబుదారీగా ఉండాల్సిరావటంతో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే దీనికి సంబంధించి భారతదేశంలో పరిస్థితులు అపసవ్య దిశలో ఉన్నాయి. వ్యాపార ప్రకటనల కోసం మన పత్రికలు ప్రభుత్వ కార్యక్రమాలకు ఎక్కువ ప్రచారం ఇస్తున్నాయి. ప్రతిపక్షాల నుంచి ఎక్కువ రాబడి రాదు కదా! అధికార పార్టీ సభ్యుల ఉపన్యాసాలను మొదటి పేజీలలోను, ప్రతిపక్షాల వారి ప్రకటనలను మూలల్లోనూ ప్రచురిస్తుంటారు. ఇది ప్రజాస్వామ్యానికి క్షేమం కాదు. ఇంగ్లండ్, కెనడాలలో పరిస్థితి చాలావరకు మెరుగ్గా ఉంటుంది. ప్రతిపక్షాల విలువను అక్కడ బాగా గుర్తిస్తారు. దీనివల్ల ప్రజాస్వామ్యం సాఫీగా పనిచేస్తుంది.

ప్రజాస్వామ్యం సజావుగా పనిచేయాలంటే అనివార్యంగా ఉండాల్సిన మూడవ అంశం–చట్టసమానత్వం. ప్రభుత్వ వ్యవహారాలలో చట్టసంబంధ వ్యవహారాలలో ఎవరికీ మినహాయింపు ఉండకూడదు. చట్టం ముందు సమానత్వం కేసులు అక్కడక్కడా కన్పించవచ్చు. కానీ ప్రభుత్వ లావాదేవీలలో ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి తాండవం చేస్తున్నాయి. తన పార్టీవాళ్లు, తన సొంతవాళ్లు అనుకున్నవారి కోసం నిబంధనలకు నీళ్లొదిలిన సంఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. ఏ రంగు టోపీ పెట్టుకున్నాడో చూసి లైసెన్సులు గ్రాంట్ చేసే దౌర్భాగ్యులు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉన్నారు. ఒకప్పుడు అమెరికాలో కూడా కూడా ఇలాంటి విషాదకర పరిస్థితే ఉండేది. కానీ దీని వల్ల ప్రజాస్వామ్యం పతనమవుతుందని గ్రహించి ప్రభుత్వాల్ని, ఉద్యోగుల్ని ముడిపెట్టే విధానానికి స్వస్తి చెప్పారు. గ్రేట్ బ్రిటన్‌ను ఈ విషయంలో ఆదర్శప్రాయంగా చెప్పుకోవచ్చు. స్వచ్ఛమైన పాలన ఉండాలంటే ప్రభుత్వం ఉద్యోగస్తుల విధినిర్వహణలో జోక్యం చేసుకోకూడదని వారు ఖచ్చితంగా విశ్వసిస్తారు, పాటిస్తారు. బ్రిటీష్ ఇండియాలో కూడా ఇదే పద్ధతి అమలులో ఉండేది. ప్రభుత్వం పాలసీలను రూపొందించవచ్చు, కానీ పరిపాలనావిధానంలో జోక్యం చేసుకోకూడదన్నది ప్రజాస్వామ్య మౌలికసూత్రాలలో ఒకటి. ఈరోజు మనదేశం ఈ విషయంలో గాడితప్పింది. దీనివల్ల అనేక కుంభకోణాలు చోటుచేసుకోవటమేకాక ప్రజాస్వామ్యం మీద నమ్మకం సడలిపోతుంది.

రాజ్యాంగ నైతికతను గుర్తించటం ప్రజాస్వామ్య విజయానికి మరో కీలక అంశం. మనదేశంలో రాజ్యాంగం గురించి మాట్లాడేవాళ్లకు కొదవలేదు. మౌలిక విలువలు పాటించకపోతే రాజ్యాంగం చిత్తుకాగితం పాటి విలువ చేయదన్న వాదనతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. లిఖిత రాజ్యాంగం లేని ఇంగ్లండ్‌లో కేవలం ఈ విలువలను పాటించటం వల్ల వ్యవస్థ నడుస్తున్నది. మనకంటే ఎన్నోరెట్లు మెరుగైన పాలనను వాళ్లు అందుకోగలిగారంటే నైతిక విలువలే కారణం. ఇక్కడ ఒక మంచి ఉదాహరణ చెబుతాను. వాషింగ్‌టన్ అమెరికన్‌ల ఆరాధ్యదైవం. అమెరికన్‌లు రాజ్యాంగం రాసుకున్న తర్వాత మొదటి అధ్యక్షుడు వాషింగ్‌టన్. తన పదవీకాలం పూర్తయిన తర్వాత తిరిగి అధ్యక్ష పదవికి నిలబడటానికి ఆయన నిరాకరించారు. వాషింగ్‌టన్ కోరుకుంటే ఎన్నిసార్లు నిలబడితే అన్నిసార్లు అధ్యక్షుడవుతారు. కానీ ఆయన అలా చేయలేదు. వ్యక్తి ఆరాధన ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని చివరకు విలువలు పతనమవుతాయని హెచ్చరించారు. అందరి బలవంతం మీద రెండోసారి అధ్యక్షుడైనా మూడోసారి మాత్రం అధ్యక్ష పదవిని వాషింగ్‌టన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అదీ నైతికత అంటే. అలాగే ఇంగ్లండ్ విషయంలో నైతిక విలువల గురించి మనం అనేక ఉదాహరణలు చెప్పుకోవచ్చు. విలువలను కాపాడటం కోసం అధికారాన్ని తృణీకరించిన ఆంగ్లేయ నాయకులు అనేకమంది ఉన్నారు.

అలాగే మైనారిటీ మీద మెజారిటీ పెత్తనం చెలాయించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు. ఇంగ్లండ్‌లో 1931 ఎన్నికలను ఇక్కడ ఉదాహరణగా ప్రస్తావించవచ్చు. 650 మంది సభ్యులు గల కామన్స్ సభలో 50మంది మాత్రమే లేబర్ పార్టీ సభ్యులు ఉన్నారు. ఎన్నోరెట్లు ఎక్కువ ఉన్నా కన్జర్వేటివ్ పార్టీ సభ్యుల ముందు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలిగారు. ఫలానా సందర్భంగా మమ్మల్ని కన్జర్వేటివ్ పార్టీ మాట్లాడనీయలేదు అనే ఆరోపణను నేను ఎప్పుడూ లేబర్ పార్టీ వారి నుంచి వినలేదు (ఆ సమయంలో నేను ఇంగ్లండ్‌లో ఉన్నాను). సంఖ్యాబలం లేని పార్టీ సభ్యుల ప్రతిపాదనల మీద స్వేచ్ఛగా చర్చించే అవకాశం కల్పించాలి. మైనారిటీల అభిప్రాయాలను పార్లమెంట్‌లో అణగదొక్కితే వాళ్లు రాజ్యాంగేతర మార్గాలను అనుసరిస్తారు.

మనం మరువకూడని మరో అంశం– అన్యాయానికి స్పందించే లక్షణం! నలుపైనా, తెలుపైనా, ఆడయినా, మగయినా, నిమ్న అయినా, అగ్ర అయినా అన్యాయం జరిగితే స్పందించి ముందుకు ఉరకటం అనేది ప్రజాస్వామ్య భావనను ఉద్దీపింప చేస్తుంది. దక్షిణాఫ్రికాలో నల్లవారికి జరిగే అన్యాయాలకు స్పందించి పోరాడే శ్వేతజాతీయులు ఉన్నారు. మనదేశంలో దక్షిణాఫ్రికాగా పేర్కొనదగిన వేలాది పల్లెలు ఉన్నాయి. కానీ దళితుల కోసం ఆరాటపడి పోరాడే అలాంటివారు ఇక్కడ దాదాపు లేరు. ఎందుకంటే, అంతరంగిక చైతన్యం, స్పందన ఇక్కడ కొరవడుతోంది.

ప్రజాస్వామ్యం గురించి ప్రాథమిక స్థాయిలో అవకాశమున్నంత మేరకు చర్చించాం. మనకు స్వాతంత్ర్యం లభించింది అనే భావనలో ఇప్పుడు మనం ఉన్నాం. ఇక చేయాల్సింది ఏమీ లేదు అనే భావన ఆవరిస్తున్నట్టు కనిపిస్తోంది.

ప్రజాస్వామ్యం అనే పచ్చని చెట్టు ఎక్కడబడితే అక్కడ ఎదగదు. ఇంగ్లండ్‌లో, అమెరికాలో అది పరిఢవిల్లింది. ఫ్రాన్స్‌లో ఒకమేరకు అభివృద్ధి చెందింది. ఎన్నో దేశాలలో ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా ఖూనీ చేసి సైనిక, నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఎన్నో సవాళ్లను అధిగమిస్తే తప్ప ప్రజాస్వామ్యం భారతదేశంలో విజయవంతం కాదు. ఇన్నాళ్లూ మనదేశంలో ఏదైనా తప్పు జరిగితే బ్రిటీషువాళ్ల మీద నెట్టేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం లేదు. అన్నిటికీ మనమే బాధ్యత వహించాలి.

**(అంబేద్కర్ రచనల నుండి స్వీకారం, స్వేచ్ఛానువాదం)**



# పేదరికానికి విరుగుడు లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానం

ప్రభుత్వం సంక్షేమం పేరుతో వేల కోట్లను ఖర్చు చేస్తున్నా పేదరికం, ప్రజల కష్టాలు తీరటం లేదని, లోక్‌సత్తా ప్రతిపాదించిన అందరికీ ఆరోగ్యం విధానాన్ని అమలు చేస్తే మాత్రం గ్యారంటీగా పేదరికం తగ్గి ప్రజలు ఊపిరి పీల్చుకుంటారని లోక్‌సత్తా పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె. ఆనందాచారి అన్నారు. ప్రభుత్వ ఖజానాపై అతితక్కువ భారంతో ప్రజలకు జేబు ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని ఎంతో అధ్యయనం, అనుభవంతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రూపొందించారన్నారు. ఈ విధానం అమలుకి ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా కేవలం రూ.2,400 కోట్లు మాత్రమే ఏడాదికి ఖర్చవుతాయని, ప్రభుత్వం పెట్టే సంక్షేమ వ్యయంలో ఇది చాలా స్వల్ప మొత్తమన్నారు. ఆరోగ్యశ్రీ మంచి పథకమేనని, కానీ అది సర్వరోగనివారిణి కాదని కరోనా అనుభవం రుజువు చేసిందన్నారు. ఆరోగ్యశ్రీని కూడా ఉపయోగించుకుంటూ లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానం ఇప్పుడు రాష్ట్రానికి, దేశానికి అవసరమన్నారు. ఈ విధానం అమలు కోసం జేపీ త్వరలో ఏపీ సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలవనున్నారన్నారు. నూతన ఆరోగ్య విధానం అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవ తీసుకోవాలని, పార్టీలకతీతంగా అందరూ కలసిరావాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా పార్టీ మండల అధ్యక్షుడు పి.జయరాముడు, గుంతకల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, శ్రీనివాసులు ప్రసాద్, ఎర్రిస్వామి, షరీఫ్, బాషా, లక్ష్మణ స్వామి, కాశప్ప, శ్రీరాములు, విష్ణువర్ధన్ నాయుడు తదితర నేతలు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# కాశీ-గాంధీ-మోదీ




ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథుని నడవా తొలి దశను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. యావత్ భారతదేశం దృష్టినీ ఆకర్షించారు. ఈ సందర్భంగానే, విదేశాల నుండి భారత్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడి ఈ సమాజంలో కలసిపోయినవారి మీద వాడివేడి విమర్శనాస్త్రాలు సంధించారు.

కాశీ విశ్వనాథుని నడవా ప్రారంభ కార్యక్రమాన్ని మోదీ ఇలా మత భావ కోణంలో, మత విశ్వాసాల ప్రాతిపదికన విభజన కోణంలో చూడగా, కాశీ విశ్వనాథుని మందిరం చుట్టూ ఈ తరహా ప్రక్షాళన చేయాలని 106 సంవత్సరాల క్రితమే చెప్పిన మహాత్మాగాంధీ.. ఆ అంశాన్ని స్వయంపాలనతో ముడిపెట్టారు.

**అంశం ఒకటే.. దృక్కోణాలు వేరు.**

తన మత విశ్వాసాన్ని, భారతీయతను, స్వయంపాలనను గాంధీజీ వేర్వేరుగా చూస్తూ, ఒక మతపరమైన అంశాన్ని ఉమ్మడి ప్రయోజనం దిశగా మలిచే ప్రజాస్వామిక నాయకత్వ స్పృహతో, దూరదృష్టితో వ్యవహరించారు. మతమేదైనా, వ్యక్తి సుఖాన్ని మందిహితంతో అనుసంధానించేందుకు మానవజాతి చేసిన ప్రయత్నంలో మతం ఒక భాగమనే వాస్తవాన్ని ఆయన చెప్పకనే చెప్పారు.

కాశీలోని పరిస్థితులపై నాడు గాంధీజీ ఆవేదన వ్యక్తం చేసిన అంశాన్ని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి, ఇంకొందరు బీజేపీ నాయకులు కూడా ప్రస్తావించారు గానీ ఆయన ఆ అంశాన్ని ఏ కోణంలో చూశారన్న విషయాన్ని మాత్రం విస్మరించారు.

కేవలం కాశీ విశ్వనాథుని నడవా నిర్మాణమే అయితే ఇంత ప్రచారం అక్కర్లేదు. గాంధీజీలా ఆ అంశాన్ని, ప్రజల సాధికారతతో సమన్వయం చేయగలిగితే ఎంతైనా ప్రచారం చేసుకోవచ్చు.

స్వతంత్రం వచ్చి 75 ఏళ్లయినా భారతదేశం ఇంకా స్వయంపాలనా వ్యవస్థలను నిర్మించుకోలేని పరిస్థితుల్లో.. కాశీ విశ్వనాథ్ కారిడార్ ప్రారంభం మనకు అలనాడు గాంధీజీ తన ప్రసంగంలో చెప్పిన మాటల్ని గుర్తుకుతేవాలి. అసలైన కార్యాచరణ దిశగా మనల్ని అడుగులు వేయించాలి.

దక్షిణాఫ్రికా నుండి తిరిగొచ్చాక 1916, ఫిబ్రవరిలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో గాంధీజీ ఈ చరిత్రాత్మక ప్రసంగం చేశారు. విశ్వవిద్యాలయం ప్రారంభం సందర్భంగా పండిత మాలవీయ ఏర్పాటు చేసిన కార్యక్రమమిది. యూనివర్సిటీ ప్రధాన ప్రాంగణానికి పునాది రాయి వేయటానికి వైస్రాయ్ లార్డ్ హార్డింజ్ ప్రత్యేకించి విచ్చేశారు. అనేకమంది సుప్రసిద్ధులూ పాల్గొన్నారు. గంగా ప్రవాహంలా సాగి యావత్ భారతదేశాన్నీ, ముఖ్యంగా యువతనీ ఉర్రూతలూగించిన గాంధీజీ బనారస్ ప్రసంగంలోని కొన్ని అంశాలు:

- ఉపన్యాసాల-తయారీలో మన వనరులు దాదాపు ఖాళీ అయ్యాయని చెప్పటానికి నేను సాహసిస్తున్నాను. ప్రసంగం మనకు వీనుల విందు, కనువిందు చేస్తే చాలదు.. మన హృదయాలను తాకాలి, మన చేతులను, కాళ్లను కదిలించగలగాలి.
- స్వయంపాలనపై కాంగ్రెస్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ముస్లిం లీగ్ తమ బాధ్యతను నెరవేరుస్తాయని, ఆచరణాత్మకమైన సూచనలను అందిస్తాయని నేను నిస్సందేహంగా నమ్ముతున్నాను. అదేసమయంలో నేను దాపరికం లేకుండా అంగీకరిస్తున్నాను- వాళ్లు ఎంతమేర చేయగలరు అనే దాని మీద నాకు అంత ఆసక్తి లేదు. నాకున్న ఆసక్తంతా- ఈ దేశ విద్యార్థి ప్రపంచం ఏం సాధిస్తుంది? సామాన్య ప్రజలు ఏం సాధిస్తారు? అంశాల మీదే! కాగితాల్లో వక్కాణించటం ద్వారా మనకు స్వయంపాలన రాదు. ఎన్ని ప్రసంగాలైనా మనల్ని స్వయంపాలనకు తగురీతిలో సిద్ధం చేయలేవు. మన ప్రవర్తన మాత్రమే మనల్ని స్వయంపాలనకు అర్హులుగా తయారుచేస్తుంది. మనల్ని మనం పరిపాలించుకోవటానికి మనం ఏ విధంగా ప్రయత్నిస్తున్నాం మరి?
- మనం నగర జీవనం అలవాటు లేని ప్రజలం. కానీ మనకు నగర జీవనం కావాలంటే, పల్లెసీమల్లోలా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించటం సాధ్యం కాదు. భవనాల అంతస్తుల్లో

ఉన్నవారు తమ మీద ఉమ్మి వేస్తారనే భయంతో, భారతదేశ బాంబేలో రోడ్ల మీద నడవాలి అన్న ఆలోచనే అసౌకర్యంగా అనిపిస్తుంది. నేను రైలు ప్రయాణాలు చాలా ఎక్కువగా చేస్తుంటాను. మూడో తరగతి ప్రయాణీకుల కష్టాల్ని చూస్తుంటాను. కానీ వారి కష్టాలకు రైల్వే యంత్రాంగాన్ని ఏ రకంగానూ నిందించలేం. పరిశుభ్రతకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు కూడా మనకు తెలియవు. రైల్వే పెట్టెలో ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేస్తుంటాం. మళ్లీ ఇక్కడే పడుకుంటామన్న స్పృహ కూడా ఉండదు. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్న ఆలోచన చేయటం సైతం బరువను కుంటాం. ఫలితంగా రైలుపెట్టెలు చెప్పలేనంత రోతగా తయారవుతున్నాయి. ఇక మనలాంటి సామాన్య సహోద రులకు పైన ఉన్నత తరగతి ప్రయాణికులు ఉంటారు. వాళ్లలో విద్యార్థులను కూడా చూశాను. కొన్నిసార్లు వాళ్లు సైతం భిన్నంగా ఏమీ ప్రవర్తించరు. వాళ్లు ఇంగ్లీష్‌లో మాట్లాడగలరు. నార్ఫోక్ జాకెట్లు వేసుకుంటారు. కాబట్టి లోపలికి దూసుకొచ్చి సీటు కోసం దబాయిస్తారు.

- బ్రిటిష్ ఇండియాలో కావచ్చు, మన గొప్ప సంస్థానాధిపతులు పాలిస్తున్న భారతదేశంలో కావచ్చు.. ఏ గొప్ప నగరంలో గొప్ప భవంతి నిర్మాణం గురించి విన్నా నాకు వెంటనే అసూయ కలుగుతుంది. "మన వ్యవసాయదారుల నుంచి వచ్చిన డబ్బు గదా ఇది" అనేస్తాను. డెబ్బయి అయిదు శాతానికి పైగా దేశ జనాభా వ్యవసాయంలో ఉన్నారు. హిగ్గిన్‌బాథమ్ తన భాషలో గత రాత్రి అతికినట్టు చక్కగా చెప్పారు– ఒకటి పండే చోట రెండు పండించిన కష్టజీవులు వారు. ఆ కష్టం ఫలితాలన్నిటినీ వారి నుంచి మనం లాగేసుకున్నా, ఇతరులు లాగేసుకోవటానికి అనుమతించినా.. మనకు స్వయంపాలన స్ఫూర్తి పెద్దగా ఉండదు.
- భారతదేశంలో పేదరికం గురించి మిగతా వక్తలు కూడా గొప్ప వక్కాణింపునిచ్చారు. కానీ వైస్రాయ్ పునాది రాయి వేసిన ఆ గొప్ప మంటపంలో మనం ఏం చూశాం? అదో అత్యంత ఘనమైన ప్రదర్శన అనటంలో సందేహం లేదు. ఆభరణాలతో మెరిసిపోతున్న సంపన్న సంస్థానాధిపతులను, కోట్లాది పేద ప్రజలను నేను పోలుస్తాను. ఈ సంపన్నులకు చెప్పాలని నాకనిపిస్తున్నది– "మీరు మీ ఆభరణాలను స్వచ్ఛందంగా త్యజించి భారత్‌లోని మీ దేశ ప్రజల కోసం ధర్మకర్తలుగా వ్యవహరించకపోతే భారత్‌కు విముక్తి ఉండదు".
- ఇండియన్ సివిల్ సర్వీస్‌లోని పలువురు అహంకారపూరితంగా వ్యవహరిస్తూ దాష్టీకాలకు పాల్పడుతుంటారనటానికి ఏమాత్రం సందేహించనక్కర్లేదు. వాళ్లు క్రూరంగా, కొన్నిసార్లు మతిలేకుండా వ్యవహరిస్తారు. వీటన్నిటితోపాటు ఇంకోటి కూడా మనం గుర్తించాలి. భారత్‌లో కొన్నేళ్లపాటు గడిపాక వారిలో కొందరు కొంతమేర




దిగజారిపోయారు. అది దేన్ని సూచిస్తోంది? ఇక్కడకు రాకముందు వాళ్లు పెద్దమనుషులు. ఇక్కడికొచ్చాక వాళ్లు తమ నైతికతను కొంత కోల్పోయారంటే, అది మనం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం. మీరే ఆలోచించండి, నిన్న మంచిగా ఉన్న వ్యక్తి నాతో కలిసున్నాక చెడ్డగా మారాడంటే, అతను దిగజారిపోవటానికి అతనే కారణమా? నేనా కారణం?.. భారత్‌లోకి అడుగుపెట్టాక వాళ్లను చుట్టుముట్టే స్వార్థపూరిత పొగడ్తలు, తప్పుడు ధోరణులు వారిని దిగజారుస్తున్నాయి. ఆ స్థితిలో మనలో చాలామంది కూడా అలాగే అవుతారు. కొన్నిసార్లు విమర్శను తీసుకోవటం మంచిది. మనం స్వయంపాలనను అందుకోవాలంటే, విమర్శను స్వీకరించక తప్పదు. మనకు స్వయంపాలనను పళ్లెంలో పెట్టి అందించటమనేది ఎప్పటికీ జరగదు. బ్రిటీష్ సామ్రాజ్య, బ్రిటీష్ దేశ చరిత్రను చూడండి. స్వేచ్ఛను ప్రేమిస్తుంది, కానీ తమంతట తాము స్వేచ్ఛను తీసుకోలేనివారికి మాత్రం స్వేచ్ఛను ఇవ్వదు. కావాలంటే బోయర్ యుద్ధం నుంచి పాఠం నేర్చుకోండి. కేవలం కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఆ సామ్రాజ్యానికి శత్రువులుగా ఉన్నవారు ఇప్పుడు స్నేహితులుగా మారారు....

- భారత్‌లో అరాచకత్వానికి తావులేదని విన్నవిస్తున్నాను. పాలకులకు ఏం చెప్పాలనుకుంటున్నామో వాటిని నిర్మొహమాటంగా, బహిరంగంగా చెబుదాం. మనం చెప్పింది వారికి నచ్చకపోతే, పర్యవసానాల్ని ఎదుర్కొందాం. కానీ దూషించటం మనం చేయొద్దు.

గాంధీ తర్వాత మోదీయే అని బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్ ఆమధ్య వ్యాఖ్యానించారు. ఆశించటంలో తప్పు లేదు. కానీ గాంధీకి, మోదీకి మధ్య ఎంత అంతరం ఉందో కాశీ ఉదంతమే తెలియచేస్తోంది.

భారతదేశంలో రాజకీయంగా తిరుగులేని స్థానంలో ఉన్న మోదీ.. గతం చుట్టూ అతిగా తిరగకుండా వర్తమానం, భవిష్యత్ మీద దృష్టి పెట్టి అధికారాన్ని స్థానిక ప్రభుత్వాల స్థాయికి వికేంద్రీకరించి ప్రజలకి నిజమైన స్వయంపాలనను అందిస్తే కాశీ విశ్వనాథ కారిడార్ ప్రారంభం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది, మహాత్ముని కల నెరవేరుతుంది, భారతదేశ అమృతోత్సవాలకూ సార్థకత చేకూరుతుంది.

# అందరికీ ఆరోగ్యం విధానం అమలుకు తెలుగు రాష్ట్రాలు నాయకత్వం వహించాలి


## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

మన దేశానికి స్వతంత్రం వచ్చే సమయంలోనే ఆరోగ్యంపై కొంత లోతైన చర్చ జరిగింది. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యాలను వేర్వేరుగా చూడకుండా వాటిని అనుసంధానం చేస్తూ ఆరోగ్య విధానాన్ని రూపొందించాలని అప్పట్లోనే గుర్తించారు. కానీ స్వాతంత్ర్యం వచ్చాక మన పేదరిక నిర్మూలన, దేశ నిర్మాణ కార్యక్రమాలకు నిధులు సరిపోవేమోనన్న భయంతో ఆరోగ్య రంగానికి కేటాయింపుల్ని కుదించారు. అదే సమయంలో మనదేశం నుండి నిష్క్రమించిన బ్రిటన్ మాత్రం రెండో ప్రపంచ యుద్ధానంతర కల్లోల పరిస్థితులున్నా కూడా ఒక సాహసోపేత నిర్ణయాన్ని తీసుకుంది. అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని (ఎన్.హెచ్.ఎస్) 1948లో ప్రవేశపెట్టింది. 20వ శతాబ్దపు గొప్ప ఘటనగా ఈ పాలనా నిర్ణయం నమోదైంది. మనం ఆనాడు జారవిడిచిన అవకాశాన్ని ఇప్పటికీ అందుకోలేకపోయాం. ఫలితంగా ఏ పేదరిక నిర్మూలన కోసమయితే ప్రపంచంలోనే ఎక్కడాలేని రీతిలో మనం సంక్షేమ పథకాల కోసం ఖర్చు చేస్తున్నామో, ఆ పేదరికానికి ఆరోగ్య రంగంలో మన విధానపరమైన వైఫల్యమే కారణమవుతోంది.

కేవలం అనారోగ్యం వల్ల మన దేశంలో ఏటా సుమారు 6 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుండి 45 లక్షలున్నారు. తెలంగాణ నుండి 19 లక్షలమంది, ఆంధ్రప్రదేశ్‌లో 26 లక్షల మంది ప్రతి ఏడూ అనారోగ్యం వల్ల కొత్తగా బీదలయిపోతున్నారు. తీవ్ర అనారోగ్య సమస్యకు భారత్‌లో ప్రజలు జేబుల్లో నుండి వ్యయం చేస్తున్న ఖర్చు మొత్తం కుటుంబ వినియోగ వ్యయంలో 10 శాతం లేదా ఇంకా ఎక్కువగా ఉంటోంది. మొత్తం ఇంటి ఖర్చులో ఆరోగ్యం కోసం వ్యయం క్రమంగా పెరుగుతూ 1993-94లో 4.9 శాతం నుండి 2004-05లో 6%కి, 2011-12లో 7.2%కి చేరింది. తీవ్ర అనారోగ్యాల చికిత్స వ్యయ భారాన్ని మోస్తున్న కుటుంబాల సంఖ్య 2004లో 21 శాతం ఉంటే, 2014లో అది సుమారు 25 శాతానికి పెరిగింది. సాధారణంగా రోజువారీ వినియోగ వ్యయం వాటా సంపన్నుల ఆదాయంలో తక్కువగా, పేదల ఆదాయంలో పెద్దఎత్తున ఉంటుంది. ఫలితంగా, అధికంగా జేబుల్లో నుండి ఖర్చు, ఆరోగ్య వైఫల్యం వల్ల వేతనాన్ని, ఆదాయాల్ని కోల్పోవటం పేద, మధ్యతరగతి వర్గాలకే చాలా సందర్భాల్లో అశనిపాతమవుతోంది. వారిని మరింత పేదరికంలోకి నెట్టటమో, వారి కుటుంబాల్ని ఆర్థికంగా కుంగదీయటమో చేస్తోంది. ఆరోగ్య సేవల్ని అందుకోవటం పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్న కొద్దీ భారంగా మారుతోందని, ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయని అనేక సాక్ష్యాలు తేటతెల్లం చేస్తున్నాయి. అందుకే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఎన్నేళ్లు గడిచినా మన దేశంలో పేదరికం ఆశించిన స్థాయిలో తగ్గకుండా ఒక విషవలయంలా కొనసాగుతోంది. పేదరిక రేఖకు కాస్త ఎగువకు చేర్చగలిగాం అనుకునేలోపే కోట్లాదిమంది పేదరికంలోకి జారిపోతున్నారు. వారి పనిచేసే సామర్థ్యం, ఉత్పాదక శక్తి కుంటుపడుతున్నాయి. సాంక్రమిక (అంటు), అసాంక్రమిక (అంటుకోని) వ్యాధుల వల్ల అకాల మరణాలు, అనారోగ్యం వల్ల శక్తిసామర్థ్యాల్ని కోల్పోవటం, జబ్బు వల్ల ఉపాధిని కోల్పోవటం.. వీటన్నిటి వల్ల నష్టపోయిన సంవత్సరాల్ని లెక్కేసి, ఒక సమాజం ఆరోగ్య స్థితిని గణాంకరూపంలో తేలిస్తే భారత్ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. సాంక్రమిక, అసాంక్రమిక.. రెండు రకాల వ్యాధుల వల్ల ప్రజలపై పడే భారం భారత్‌లోనే అత్యధికంగా ఉంది. సాంక్రమిక వ్యాధులకు సంబంధించి దక్షిణాఫ్రికా మాత్రమే మన కంటే అధమంగా ఉంది.




గడచిన రెండు దశాబ్దాలలో ఆరోగ్య రంగంలో మన దేశంలో, తెలుగు రాష్ట్రాలలో కొన్ని మంచి ప్రయత్నాలు జరిగాయి. 2005లో జాతీయ ఆరోగ్య మిషన్, 108 సంఖ్యతో ఆంబులెన్స్ సౌకర్యం, 2007లో ఆరోగ్యశ్రీ, మొహల్లా క్లినిక్‌లు, 2018లో ఆయుష్మాన్ భారత్ వీటిలో చెప్పుకోదగినవి. కానీ ప్రాథమిక ఆరోగ్యం నుండి అందరికీ ఆరోగ్యాన్నిచ్చే సమగ్ర విధానం లేకుండా పైస్థాయిలో పథకాలు అమలు చేయటం సరిపోదని కొవిడ్-19 మహమ్మారి మనకు స్పష్టంగా తెలియచెప్పింది. తప్పిదాల్ని వేగంగా దిద్దుకుంటూ అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే కూడా మన ప్రజలు, మీడియా, ప్రభుత్వాలు కొవిడ్‌ను మెరుగ్గా ఎదుర్కొన్నా కూడా.. మన ఆరోగ్య రంగంలోని వైఫల్యం వల్ల కరోనా సంక్షోభం కోట్లాది


దేశంలో ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ తీరు ఇలా వుంది :
సరైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ లేదు
ఏ ఆస్పత్రికి వెళ్లాలో దిశానిర్దేశం చేసే రెఫరల్ ఏర్పాటు లేదు
సకాలంలో చికిత్స అందించటం లేదు - వ్యాధులు ముదురుతున్నాయి
ఔట్‌పేషెంట్ సేవలకు, తేలిగ్గా చికిత్స చేయగలిగిన/ నివారించగలిగిన వ్యాధులకు కూడా ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది
ఫలితంగా ద్వితీయ స్థాయి, తృతీయ స్థాయి ఆసుపత్రుల్లో విపరీతమైన రద్దీ - ఎయిమ్స్, న్యూఢిల్లీలో ఒక్క ఏడాది (2019-20) ఔట్‌పేషెంట్ రోగులు 44,14,490-అంటే రోజుకు 12,000 మంది ఔట్‌పేషెంట్లు!

**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్)/ లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆరోగ్య విధానాన్ని అమలులోకి తీసుకొస్తే ప్రజలకు జేబు ఖర్చు లేకుండా వైద్యం ఇంత సులువుగా, నాణ్యతతో సమగ్రంగా అందుబాటులోకి వస్తుంది:**

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS



జీవితాల్ని అల్లకల్లోలం చేసింది. సరైన ఆరోగ్యం కోసం శాశ్వత ఏర్పాట్లు కావాలన్న డిమాండ్ అన్ని వర్గాల ప్రజల నుండి కూడా పెద్దఎత్తున వస్తోంది. సమగ్ర ఆరోగ్య విధానం అమలుకు ఇది సరైన సమయం. అందుకే వైద్య, పాలన, సామాజిక, రాజకీయ రంగాలలో, విధానాల రూపకల్పనలో ఉన్న అవగాహనను, అనుభవాన్ని రంగరించి వివిధ దేశాల వ్యవస్థల్ని, నిపుణుల పరిశీలనల్ని, మన దేశ పరిస్థితుల్ని, అనుభవాల్ని, అత్యుత్తమ పద్ధతుల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందరికీ ఆరోగ్యానికి ఒక సమగ్ర విధానాన్ని ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్.డి.ఆర్) వేదికగా రూపొందించాం. మనకున్న వనరుల్లోనే, ఇప్పుడున్న కార్యక్రమాల్ని కొనసాగిస్తూనే, జాతీయాదాయంలో కేవలం 0.4% పెంపుతోనే ప్రజల జేబులపై ఎటువంటి ఆర్థికభారం లేకుండా 'అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఆచరణసాధ్య నమూనా' ఇది.

**ఈ నమూనాలోని కీలకాంశాలు:**

+ మొదటి దశలో ఫ్యామిలీ డాక్టర్ నేతృత్వంలో పటిష్ఠ ప్రాథమిక వైద్యం ఉంటుంది. అన్ని రకాల ఔట్‌పేషెంట్ సేవలకూ ప్రజలు తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది, తద్వారా వైద్య సేవల మధ్య పోటీ ఉంటుంది. ఫ్యామిలీ ఫిజీషియన్ (ఎఫ్.పి) ఆధ్వర్యంలో ఈ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పైస్థాయి ఆస్పత్రి సేవలకు అనుసంధానమై ఉంటుంది. ఆస్పత్రి చికిత్స అవసరమనుకుంటే ఫ్యామిలీ ఫిజీషియనే సిఫార్సు చేస్తారు.

+ ద్వితీయ, తృతీయ స్థాయి చికిత్సల ఆస్పత్రులు ఇన్‌పేషెంట్ సేవలకు మాత్రమే పరిమితం. అత్యవసరాలు మినహాయించి అన్ని కేసుల్లో కింద స్థాయి వైద్యుని నుండి సిఫార్సు (రెఫరల్) తప్పనిసరి.

+ ఆయుష్మాన్ భారత్, ప్రభుత్వం నిధులిచ్చే ఆరోగ్యశ్రీ, ఇతర ఆరోగ్య బీమా/హామీ పథకాల నుండి తృతీయ స్థాయి వైద్య సేవలను మినహాయించి, ఆ పథకాలు అన్ని ద్వితీయ స్థాయి చికిత్సలకూ, అందరు పౌరులకూ వర్తించేలా వాటి పరిధిని విస్తరించటం. తృతీయ స్థాయిలో నాణ్యమైన, ఖర్చుకు తగ్గ ఫలితాలనిచ్చే వైద్య సేవలందించేలా దేశంలోని జిల్లా, ప్రభుత్వ బోధనాస్పత్రులను అభివృద్ధి చేయటం, అదనపు వనరుల్ని సమకూర్చటం.

**ప్రతి ఇంటికీ ఓ ఫ్యామిలీ డాక్టర్.. జేబులో రూపాయి లేకుండా వైద్యం కోసం వెళ్లవచ్చు**

ఈ ప్రతిపాదిత నమూనాలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో ప్రతి పౌరునికీ ఒక ఫ్యామిలీ డాక్టర్ ఉంటారు. ఔట్‌పేషెంట్ సేవలు (ఓ.పి) పూర్తిగా ఈ ఫ్యామిలీ వైద్యుని వద్దే ఉంటాయి. జేబులో రూపాయి లేకున్నా ఎవరైనా తమ ఫ్యామిలీ ఫిజీషియన్ (ఎఫ్.పి) వద్దకు వెళ్లి ఓ.పి వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. వైద్యపరీక్షలు, మందులు కూడా ఉచితం.

ప్రభుత్వం చెప్పిన ఫ్యామిలీ డాక్టర్‌నే ప్రజలు ఆమోదించనక్కర్లేదు. పది మంది ఫ్యామిలీ వైద్యుల బృందంలో తమకు మెరుగైన సేవలందిస్తారనే నమ్మకమున్న డాక్టర్‌నే ఎంచుకోవచ్చు. ఈ వైద్యుల బృందం గ్రామాలకు దగ్గర్లోని చిన్న పట్టణాలలో ఉంటారు. ఊళ్ల నుండి ప్రజలు తమ రోజువారీ పనుల కోసం వెళ్తుండే 5-6 కిలోమీటర్ల దూరంలోని పట్టణాలను ఫ్యామిలీ డాక్టర్ కేంద్రాలుగా ఎంపిక చేస్తారు. ఈ పట్టణాల జనాభా 1 లక్ష, లక్షన్నర ఉంటుంది. అంటే ప్రతి 15,000 మందికి ఒక ఫ్యామిలీ డాక్టర్ ఉంటారు. తాము పనిచేసే చిన్న పట్టణంలోనే నివసించే ఈ ఫ్యామిలీ ఫిజీషియన్లు ఒక్కొక్కరు రోజుకు 40-50 మంది రోగులను చూస్తారు. అందరికీ నాణ్యమైన సేవలు అందుతాయి. ఇంకా మెరుగైన వైద్యం అవసరమనుకుంటే అవసరమైన రోగులను ఆస్పత్రి సేవలకు సిఫార్సు చేసేలా ఫ్యామిలీ ఫిజీషియన్‌కపైస్థాయిలోని ద్వితీయ, తృతీయ స్థాయి ఆస్పత్రి సేవలతో అనుసంధానమై ఉంటారు. రోగులకు ఎటువంటి ఆందోళనా అక్కర్లేకుండా ఎఫ్.పియే ఆస్పత్రి సేవలతో సమన్వయం చేసుకుంటారు. డాక్టర్లకు కన్సల్టేషన్ ఫీజును ప్రభుత్వమే రీఇంబర్స్ చేస్తుంది. ఫ్యామిలీ క్లినిక్ నిర్వహణ మొత్తాన్నీ సదరు డాక్టరే చూసుకుంటారు. ఈ ఖర్చులన్నీ పోగా కూడా డాక్టర్లకు నెలకు రూ.1,00,000 దాకా ఆదాయం వస్తుంది. ఫ్యామిలీ డాక్టర్‌గా పనిచేయటానికి ఎంబీబీఎస్ పట్టభద్రులు పెద్దఎత్తున ముందుకు రావటానికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇది. ఒక ఫ్యామిలీ వైద్యుడు ఎంతమంది రోగులని చూస్తే, రోగికింత అని అంత పారితోషికం అందుతుంది. ఏ డాక్టరు బాగా సేవలందిస్తారో ఆ డాక్టరు దగ్గరికి ఎక్కువమంది రోగులు వెళతారు. ఆ వచ్చిన రోగులను బట్టి ఆ డాక్టరుకి పారితోషికం అందుతుంది. అంటే సేవలకి డబ్బిచ్చేది ప్రభుత్వమే అయినా, డాక్టర్ల పనితీరు ప్రైవేటు వైద్యుల లాగా ఉంటుంది. జవాబుదారీతనం, పోటీ ఉంటాయి.

మన దేశంలో ఉన్నకొద్దీ పెరుగుతున్న అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్), మధుమేహం, క్యాన్సర్, గుండెజబ్బు వంటి అసాంక్రమిక దీర్ఘకాల వ్యాధుల భారాన్ని (అంటువ్యాధుల కంటే మూడు రెట్లు, 74% దాకా మరణాలు ఈ అసాంక్రమిక, దీర్ఘకాల వ్యాధుల వల్లనే!) కూడా ఈ రకమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో సమర్థవంతంగా నియంత్రించవచ్చు. ఆ వ్యాధుల బారినపడకుండా ముందు జాగ్రత్తలు పాటించేలా చేయటానికి, వ్యాధులకు గురైనట్లయితే, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి తొలిదశలోనే గుర్తించి, మందులు వాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఫ్యామిలీ ఫిజీషియన్ పద్ధతి ఎంతగానో ఉపకరిస్తుంది. ప్రాథమిక వైద్యం అందించే వారు.. మొత్తం వ్యాధి నివారణ సేవల్ని కూడా అందించగలరు.

10 మంది ప్రాథమిక వైద్యులున్న చిన్న పట్టణంలోనే ఉచిత ఔషధాలకి, ఉచిత వైద్యపరీక్షలకి ఏర్పాటుంటుంది. కాబట్టి రోగులకి హైరానా లేకుండా డాక్టరుని సంప్రదించటం, పరీక్షలు చేయించుకోవటం, డాక్టరు సూచించిన ఔషధాలు కొనుక్కోవటం - అన్నీ ఉచితంగా, ఉన్న ఊరికి 5-10 కి.మీ దగ్గరలో అందుబాటులో ఉంటాయి.

ఫ్యామిలీ ఫిజిషియన్ క్లినిక్‌లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంతో, సమీపంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంతో సమన్వయంతో పనిచేస్తాయి. ప్రతి ఆరోగ్య కేంద్రం బాధ్యతలూ స్పష్టంగా విభజించబడి ఉంటాయి. ఫ్యామిలీ ఫిజిషియన్.. రికార్డులను నిర్వహిస్తూ ఔట్‌పేషెంట్ సేవలను అందిస్తారు, ప్రజారోగ్య కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తారు. టీకాలు, గర్భిణుల పరీక్షలు, పౌష్టికాహార లోపాన్ని అంచనా వేయటం, అంటువ్యాధుల చికిత్స, దీర్ఘకాల వ్యాధుల నియంత్రణ చికిత్స వంటి ప్రాథమిక, నివారణ వైద్యాలను ఎఫ్.పి క్లినిక్‌ల వద్ద అందిస్తారు. పి.హెచ్.సి.. వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, క్షేత్రస్థాయి పర్యటనలు, వ్యాధులపై సర్వేలకు బాధ్యత వహిస్తుంది. పి.హెచ్.సిలలో శీతల నిల్వ కేంద్రాల గొలుసు, ఇతర మౌలిక సదుపాయాలు ఉంటాయి. ప్రస్తుతం భారత గ్రామీణ ప్రజానీకంలోని అత్యధికులు తమ ఆరోగ్య అవసరాలకు మొదటగా సంప్రదించే అనధికార గ్రామీణ ఆరోగ్య సేవలదారుల (ఆర్.హెచ్.పిలు) సేవల్ని కూడా వినియోగించుకునే ఏర్పాటు ఈ విధానంలో ఉంది. ఎఫ్.పి క్లినిక్‌లతో అనుసంధానమైన ఆర్.హెచ్.పిలు ఎఫ్.పిల పర్యవేక్షణలో పనిచేస్తారు.

మనకు సరైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ లేకపోవటం వల్ల చిన్నపాటి జ్వరాలకు కూడా ప్రస్తుతం ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీనివల్ల, ఆస్పత్రుల్లో నిజంగా సంక్లిష్ట చికిత్సలు అవసరమైన రోగులకు డాక్టర్లు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రోజూ మూడు, నాలుగు వేల మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. 2019–20లో న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో రోజుకు 12,000 మంది ఔట్‌పేషెంట్లు వస్తారు. వీరిలో 80శాతం మందికి ప్రాథమిక స్థాయి వైద్యం చాలు. అంతెందుకు, ఫ్యామిలీ డాక్టర్ పద్ధతి ఉన్నట్లయితే, కొవిడ్ ఉధృతి కాలంలో అందరూ ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. వ్యాధి సోకినవారిలో చాలామంది ఇంటి వద్దే తమ కుటుంబ వైద్యుని సలహాసూచనలతో సరైన జాగ్రత్తలు పాటిస్తూ మందులు, ఆహారం తీసుకునేవారు. ప్రతిపాదిత నమూనాలోని పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ వల్ల ఆ పెద్ద సమస్యను పరిష్కరించవచ్చు. ఈ నమూనాలో ఫ్యామిలీ డాక్టర్ నేతృత్వంలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ బలంగా ఉండటం వల్ల వ్యాధిని ముందుగానే గుర్తించటమో, తొలిదశలోనే గుర్తించి నయం చేయటమో జరుగుతుంది. దీనివల్ల జబ్బు ముదిరి తర్వాత సంక్లిష్టమైన చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. చిన్నపాటి వైద్యంతోనే ఆరోగ్యం కుదుటపడుతుంది. అంటువ్యాధుల్ని కూడా సమర్థవంతంగా నిలువరించవచ్చు. మనకి డాక్టర్ల కొరత లేదు. ఏటా మన దేశంలో 80,000 మందికి పైగా వైద్య పట్టభద్రులు తయారవుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండే ప్రతి సంవత్సరం 7,000 – 8,000 మంది డాక్టర్‌లు అవుతున్నారు.

**ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్, చిన్న నర్సింగ్ హోంలతో ద్వితీయ స్థాయి వైద్య చికిత్సలు**

ఇక వైద్య సేవల రెండో స్థాయిలో ఆస్పత్రి చికిత్సలు ఉంటాయి. పటిష్ఠ ప్రాథమిక వైద్య వ్యవస్థ, ఫ్యామిలీ డాక్టర్ రెఫరల్ పద్ధతి వల్ల ద్వితీయ స్థాయి వైద్యానికి వచ్చేవారు 20% మంది దాకా ఉంటారు. అన్ని ఆస్పత్రి సేవలు, శిశు జననాలు, సిజేరియన్ శస్త్ర చికిత్సలు సహా ప్రసూతి సేవలు, పొత్తికడుపు లేదా కంటి శుక్లాల ఆపరేషన్లు వంటి ప్రణాళికాబద్ధంగా ఎంపిక చేసుకున్న సేవలు లేదా తక్షణ, అత్యవసర సేవలు, సాధారణ స్థాయిలోని ఎముకల పగుళ్లు, విరగటం, గాయాలు సహా ట్రౌమా చికిత్స ఈ రెండో దశ వైద్యంలో భాగంగా ఉంటాయి. ఇందులో ఆస్పత్రి పడకలు, శస్త్రచికిత్సలు, ఆధునిక వైద్య సేవలు అవసరం కావచ్చు. ఈ స్థాయి ఆస్పత్రి సేవల్లో సాపేక్షంగా తక్కువ ఖర్చయ్యే సాధారణ చికిత్సలు ఉంటాయి. రెండో దశ చికిత్సలో ఒక ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే యంత్రం, ఇతర మౌలిక రోగ నిర్ధారణ పరీక్ష ఏర్పాట్లు, ఆక్సిజన్ నిర్వహణ సదుపాయాలు, ఇంకా ఇన్‌పేషెంట్, ఆపరేషన్ అనంతర వైద్య సేవలకు కావలసిన అన్ని సౌకర్యాలూ ఉంటాయి. చిన్న నర్సింగ్ హోంలను మనం ద్వితీయ స్థాయి వైద్యంలో కేంద్రబిందువుగా చేస్తే, నాణ్యమైన రెండో దశ వైద్యాన్ని తక్కువ ఖర్చుతోనే చిన్న పట్టణాల్లో అందించవచ్చు. దీనివల్ల మొత్తం ద్వితీయ స్థాయి సేవల చికిత్సలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. పలు చోట్ల చిన్న పట్టణాల్లో మనకు ప్రయివేటు నర్సింగ్ హోంలు ఉన్నాయి. ఉదాహరణకి, ఆంధ్రప్రదేశ్‌లో కనీసం 30 పడకలు గల అటువంటి నర్సింగ్ హోంలు 600కి పైగా ఉండగా, తెలంగాణలో 1000కి పైగా ఉన్నాయి. ప్రభుత్వ బీమా కార్యక్రమంలో ప్రయివేటు భాగస్వామ్యం ప్రధానంగా ఈ చిన్న నర్సింగ్ హోంలకే పరిమితం కావాలి. ఇటువంటి విధానం వల్ల ఆస్పత్రి సేవలను ఆశించే గ్రామీణ, చిన్న పట్టణ ప్రజానీకం మొత్తానికి రవాణా, బస వంటి కారణాలరీత్యా జేబుల్లో నుండి సొంతంగా చేసే వ్యయం కూడా తగ్గుతుంది.

ప్రస్తుతం ప్రభుత్వం ఇన్సూరెన్స్ చెల్లింపులు చేస్తూ అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాల్లోని వైద్య సేవల్లో 50 శాతానికి పైగా చాలా సంక్లిష్టమయిన తృతీయ స్థాయి చికిత్సలకు సంబంధించి ఉంటున్నాయి. ఆరోగ్యశ్రీలో అందించిన వైద్య ప్రక్రియల్లో ఎక్కువ ఖర్చు గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్, మోకాలి మార్పిడి చికిత్సలకే అవుతున్నది. అత్యంత ఖరీదైన తృతీయ స్థాయి వైద్యానికి ఈ పథకాలను వర్తింపచేయటం వల్ల, అందులో ప్రభుత్వ ఇన్సూరెన్స్ చెల్లింపులు అత్యధిక భాగం ఖరీదైన ప్రయివేటు రంగానికి వెళ్తుండటం వల్ల ఖజానాపై పడే భారం ఏటికేడు పెరగటమే తప్ప తగ్గటం ఉండదు. చాలా ద్వితీయ స్థాయి చికిత్సలకు అటువంటి ఖరీదైన మౌలిక సదుపాయాలు, పరికరాలు అక్కర్లేదు. తగిన వసతులున్న చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలు నాణ్యమైన ద్వితీయ స్థాయి

సేవల్ని సమర్థవంతంగా అందించగలవు. అందువల్ల తృతీయ స్థాయి వైద్యాన్ని ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ నుండి తొలగించి, ద్వితీయ స్థాయిలో వైద్యానికే ఆ పథకాల్ని పరిమితం చేయటం మేలు. అలాగే ఆదాయాలతో, రేషన్ కార్డు, ఇతర ధృవీకరణ పత్రాలతో సంబంధం లేకుండా ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్, ఇతర అటువంటి పథకాల కవరేజీని విస్తరించాలి. దీని వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఆరోగ్య సంరక్షణ సేవల్ని ఏ రకంగా పరిమితం చేసినా, మొత్తంగా ప్రజా సంక్షేమాన్ని, ఉత్పాదకతను, ఆర్థికాన్ని దెబ్బతీస్తుంది. అలాగే, కేవలం పేదలకే ఉద్దేశించిన సేవలు కాలక్రమంలో నాణ్యతాపరంగా క్షీణిస్తాయి. జనాభాలో ప్రశ్నించ గలిగే వర్గాలకు కూడా అందులో భాగస్వామ్యం ఉన్నప్పుడే సేవ గణనీయంగా మెరుగుపడుతుంది. కాబట్టి, మధ్యతరగతుల వారిని కూడా ఈ పథకాల్లో చేర్చటం సేవల నాణ్యతను మెరుగుపరుస్తుంది.

**జిల్లా, ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో తృతీయ స్థాయి చికిత్సలు**

నివారణ, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఎంత బాగా ఉన్నప్పటికీ, కొంతమంది తీవ్ర అనారోగ్యం బారిన పడుతుంటారు. తృతీయ స్థాయి చికిత్సలు అవసరమైనప్పుడు ఆ అనారోగ్యం కుటుంబ ఆర్థిక స్థితిని సంక్షోభంలోకి నెడుతుంది, వ్యక్తుల ఉత్పాదకతను దెబ్బతీస్తుంది, ఆర్థిక వృద్ధిని ఆటంకపరుస్తుంది. కాబట్టి, ఖర్చుకు తగ్గ ఆరోగ్య ఫలితాలు లేకపోయినా, వ్యయం విపరీతంగా పెరిగే పెద్ద ప్రమాదం తృతీయ స్థాయి చికిత్సలో పొంచి ఉన్నప్పటికీ.. ప్రజలకు అందుబాటులో ఉండేలా, ఖర్చుకు తగ్గ ఫలితం ఉండేలా అందరికీ నాణ్యమైన తృతీయ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వమే అందించటం తప్పనిసరి. కాలిన గాయాలు, గుండెజబ్బులు, గుండె, ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సలు, బహుళ ట్రౌమా, కీళ్ల సర్జరీలు, బహుళ-వ్యవస్థ జబ్బులు, క్యాన్సర్ చికిత్స, న్యూరో సర్జరీ వగైరాలకు ప్రత్యేకీకరించిన చికిత్సలు తృతీయ స్థాయి వైద్యంలో భాగంగా ఉంటాయి. సాధారణంగా, ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్యుల నుండి సిఫార్సుతో మాత్రమే రోగులకు ఈ ఆస్పత్రి సేవలందిస్తారు.

ఓపక్క ప్రయివేటు రంగం ప్రస్తుతం 75 శాతం జనాభా ఆరోగ్య అవసరాలను తీరుస్తూ, మరోవైపు అసాంక్రమిక వ్యాధుల భారం పెరుగుతున్న నేపథ్యంలో.. తృతీయ స్థాయి చికిత్సలో ఆయుష్మాన్ భారత్ వంటి ఇన్సూరెన్స్ ఆధారిత సామాజిక పథకాలను అనుసరించటం వల్ల వ్యయం పెరుగుతూ అదుపుతప్పటం అనివార్యమని అమెరికా అనుభవం స్పష్టంగా తెలియచేస్తోంది. ఆరోగ్య రంగంలో ఇన్సూరెన్స్ పద్ధతి ఎంత నష్టదాయకమో చెప్పటానికి అమెరికాయే పెద్ద ఉదాహరణ. అమెరికాలో ప్రతి 5 డాలర్లలో 1 డాలర్ ఆరోగ్యం మీద ఖర్చు పెడతారు. అయినా అక్కడ కోట్ల మంది ఆరోగ్యం అందక గగ్గోలు పెడుతున్నారు. అందుకు కారణం ఇన్సూరెన్స్ నమూనాను అనుసరించటం. అమెరికన్ వ్యవస్థ వైఫల్యం నుండి నేర్చుకోవటం మనకు అవసరం. ఆస్పత్రి ఆరోగ్య వ్యవస్థలో ఎక్కువ శాతం ప్రభుత్వ రంగంలో ఉన్న బ్రిటన్ నమూనా.. వ్యయానికి తగ్గ ప్రయోజనాలతో మనం అనుసరించదగినదిగా ఉంది. కాబట్టి, దేశంలో ప్రభుత్వ తృతీయ స్థాయి ఆరోగ్య వ్యవస్థ నాణ్యతని మెరుగుపరచటం, అందరికీ తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవటం మనం తక్షణం చేయాల్సిన పని. సర్కారు చేసే ప్రతి రూపాయి ఖర్చుకీ ఈ ప్రభుత్వ ఆస్పత్రులు నాలుగు రూపాయల విలువైన సేవలను అందిస్తున్నాయని ప్రజాస్వామ్య పీఠం అధ్యయనంలో తేలింది. ప్రభుత్వ సదుపాయంతో పోలిస్తే ప్రయివేటు ఆస్పత్రిలో ఒక్కో ఆస్పత్రి కేసుకు సగటున అయ్యే ఖర్చు ఆరు నుండి ఏడు రెట్లు ఎక్కువ. తృతీయ స్థాయి వైద్యంలో మొదటి అంచె (టయర్ 1) ఆస్పత్రుల్లో (మంచి సదుపాయాలు, దీర్ఘకాల చరిత్ర, అనుభవం ఉన్న 140 ప్రభుత్వ బోధనా ఆసుపత్రులు) అన్ని పరికరాలు, వనరులు, నైపుణ్యాలతో దాదాపు 1,40,000 పడకల్ని అధునాతన మూడో దశ వైద్యానికి సిద్ధం చేయాలి. మిగిలిన రెండవ అంచె (టయర్ 2) ఆస్పత్రుల్లోని (మిగిలిన ప్రభుత్వ బోధనా ఆసుపత్రులు, అన్ని జిల్లా ఆసుపత్రులు కలిపి) 1,47,000 పడకల్ని నాణ్యమైన తృతీయ స్థాయి వైద్యాన్ని అందుబాటు వ్యయంలో అందించేలా సాధానాసంపత్తితో బలోపేతం చేయాలి. డిమాండ్ పెరుగుతూ, సేవల నాణ్యత మెరుగుపడుతూ ఉన్నకొద్దీ వ్యయాన్ని, పడకల సంఖ్యను ఇంకా పెంచవచ్చు.

వైద్య సేవలు దుర్వినియోగం కాకుండా కొన్ని రకాల ముందు జాగ్రత్తలు మినహాయించి, ఈ ఆరోగ్య నమూనాలోని అన్ని సేవలూ అందరు ప్రజలకూ ఉచితం. ఈ సంస్కరణల అమలులో తమ ప్రాంత ప్రత్యేక పరిస్థితులు, అవసరాలకనుగుణంగా ఏ విధమైన జోడింపులు, సవరణలనయినా రాష్ట్రాలు చేసుకోవచ్చు. వివిధ రాష్ట్రాలు అన్వయించుకునేందుకు వీలుగా, నమూనాలోని వివిధ అంశాలను తగిన వెసులుబాటుతో సరళంగా రూపొందించటమైంది. జవాబుదారీతనం ఆరోగ్య వ్యవస్థలో ఎంతో కీలకమైన అంశం. అది లేకుండా మొత్తం నమూనా సామర్థ్యం ప్రమాదంలో పడుతుంది. ఆరోగ్య సేవల జారీ, పర్యవేక్షణ బాధ్యత ప్రధానంగా రాష్ట్రాలపై ఉంటుంది కాబట్టి, రాష్ట్రంలో ప్రభుత్వంలోని వివిధ స్థాయిలో జవాబుదారీతనం అమలుకు బలమైన సంస్థలు ఉంటాయి. ఈ నమూనాలో ద్వితీయ స్థాయి వైద్యంలో, కొన్ని సేవల జారీలో ప్రయివేటు ఆస్పత్రుల భాగస్వామ్యం ఉంటుంది. అయితే అన్ని స్థాయిల్లో కూడా ప్రయివేటు వైద్యం ఎటువంటి అవరోధాలు లేకుండా యథాతథంగా కొనసాగుతుంది. వనరులున్నవారు స్వేచ్ఛగా తమకు నచ్చిన ప్రయివేటు సేవలను పొందవచ్చు.

**ప్రతిపాదిత సిఫార్సుల మొత్తం ఖర్చు**

దేశవ్యాప్తంగా ఈ నమూనా అమలుకు అదనంగా అయ్యే వ్యయం ఏడాదికి సుమారు రూ.85,000 కోట్లు. అంటే జి.డి.పిలో దాదాపు 0.4%. ఈ అదనపు వ్యయాన్ని

కలుపుకున్నా కూడా దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యయం ఆరోగ్యంపై 1.6%గా మాత్రమే, ప్రపంచంలోనే అన్ని ప్రధాన దేశాలతో పోలిస్తే అతి తక్కువగానే ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అదనపు వ్యయం వరుసగా ఏడాదికి సుమారు రూ.1900 కోట్లు, రూ.2600 కోట్లు ఉంటుంది. నమూనాను మూడేళ్ల కాలవ్యవధిలో దశలవారీగా అమలు చేయవచ్చు.

**ఆరోగ్య రంగంలో మార్కెట్ విఫలమవుతుంది.. ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి**

ప్రభుత్వ ఖజానాకు తక్కువ ఖర్చు మాత్రమే అయ్యేలా, దేశంలోని పేదలు ఆరోగ్య భారంతో సంక్షోభంలో కూరుకుపోకుండా, అత్యుత్తమ ఫలితాలనిచ్చే వినూత్న ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాలతో, పౌరులందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటం ఎఫ్.డి.ఆర్ రూపొందించిన ఆరోగ్య రంగ సంస్కరణ లక్ష్యం. ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి కలసికట్టుగా సాగుతాయి. అందువల్ల ఆరోగ్యం.. పాలనలో కీలక విభాగం! వనరుల కేటాయింపు సమర్థవంతంగా ఉండేలా చేయటంలో ప్రయివేటు ఆరోగ్య మార్కెట్లు విఫలమైనందున, అందరికీ తక్కువ వ్యయంలో, అందుబాటులో ఆరోగ్యాన్ని అందించటంలో ప్రభుత్వ జోక్యం కీలకంగా మారింది. అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, విద్యలను అందించటం ప్రభుత్వాల ప్రాథమిక విధి.

**పార్టీలకతీతంగా కలసిరండి**

కొవిడ్ తర్వాత ఆరోగ్యానికి ప్రజల్లో డిమాండ్ భారీగా పెరిగింది. కానీ విఫలమైన పాత ఆరోగ్య విధానాన్నే కొనసాగిస్తే, ఉన్నకొద్దీ ఖర్చు పెరుగుతుంది తప్ప ప్రజలకు ఆరోగ్యం అందదు. ఆధునిక వైద్యంలో నాణ్యమైన ఆరోగ్యాన్ని జనాభా మొత్తానికీ అందించటం ఓ పెద్ద సవాలు. ఎందుకంటే, సాంకేతికతలో ముందడుగులు, వైద్య పరిశోధన వల్ల కొత్త శాస్త్ర ఆవిష్కరణలతో ఆరోగ్య వ్యయాలు పెరుగుతూనే ఉంటాయి. కాబట్టి, పెట్టుబడులు వివేకవంతంగా ఉండాలి. అంతిమంగా, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ వైద్య సేవలు ఉచితంగా లేదా ఓ మోస్తరు రుసుముతో పౌరులందరికీ అందుబాటులోకి రావాలి. ఈవేళ్టి సంక్షోభాన్ని పరిష్కరించేలా, రేపటి అవసరాలను అందుకునేలా, ప్రతి రాష్ట్రం తనకవసరమైన మార్పులు చేసుకునే వీలుండేలా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య విధానాన్ని రూపొందించాము. ఈ విధానం అమలులో జాతీయ స్థాయి ప్రభుత్వం కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎందుకంటే, మొత్తం దేశానికి దిశానిర్దేశం చేసేలా ఒక బలమైన, జాతీయ స్థాయి ఆరోగ్య నమూనా ఉండటం అవసరం. అదేసమయంలో వైద్య ఆరోగ్యం రాష్ట్రాల అంశం కాబట్టి, అమలులో రాష్ట్రాల భాగస్వామ్యం ఎంతో కీలకమైనది. సంక్షేమ పథకాల కోసం దేశంలోనే రికార్డు స్థాయిలో మన తెలుగు రాష్ట్రాలు ఖర్చు చేస్తున్నాయి. అందులో కొద్దిగా ఈ ఆరోగ్యానికి ఖర్చు చేస్తే.. ఎంతోమంది శాశ్వతంగా పేదరికం నుండి బయట పడతారు. మిగతా అన్ని రంగాల్లో యథాతథ స్థితిని కొనసాగించినా, ఒక్క ఆరోగ్య రంగంలో ప్రజలకు సేవల్ని మెరుగుపరిస్తే ఒక దశాబ్ద




కాలంలో భారత్‌లో పేదరికం తొలగిపోతుంది. అందుకే తెలుగు రాష్ట్రాలు ఈ ఆరోగ్య విధానం అమలుకు నాయకత్వం వహించాలి, ఇతర రాష్ట్రాలకు, దేశానికి మార్గదర్శకత్వం వహించాలి. ఆరోగ్య రంగంలో ఇంకా తీసుకురావలసిన సంస్కరణలు ఉన్నాయి. కానీ ఈ ప్రతిపాదిత నమూనాను అమలు చేస్తే, భారతదేశంలో ఒక పటిష్ఠమైన, ఆచరణసాధ్యమైన, అందుబాటులో ఉండే, అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది, గుణాత్మక మార్పుతో మన ఆరోగ్య వ్యవస్థ సమగ్రంగా పునర్నిర్మాణమవుతుంది. ఈ ఆరోగ్య విధానపత్రం పూర్తి వివరాలున్న 'Towards Viable Universal Healthcare'ని www.fdrindia.orgలో చూడగలరు.


మానవ వనరులు, ప్రపంచంలోనే చౌకగా ఔషధాల ఉత్పత్తి, చికిత్సలు, కొవిడ్ తర్వాత ప్రజల్లో భారీ డిమాండ్, అధునాతన సాంకేతికతలు.. ఇలా సమగ్ర ఆరోగ్య విధానం అమలుకు అన్నీ అనుకూలిస్తున్న అద్భుత సమయమిది. కావలసిందల్లా రాజకీయ పార్టీలు, నాయకులు, పౌర సమాజం, ప్రజా సంఘాలు, ఆలోచనాపరులు, మీడియా అందరూ పక్షపాతాలకతీతంగా కలసి వేగంగా అమలుకు కృషి చేయటమే. ఎంతో అనుభవం, అధ్యయనం, ముందుచూపుతో రూపొందించిన ఈ సమగ్ర ఆరోగ్య విధానం నమూనాకు మద్దతివ్వవలసిందిగా మిమ్మల్ని వినమ్రపూర్వకంగా కోరుతున్నాం. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళయినా మనం సాధించుకుని తీరాల్సిన లక్ష్యమిది.

# సమగ్ర ఆరోగ్య విధానం లేకుండా ఇన్సూరెన్స్ చుట్టూ ఎన్ని పథకాలు తెచ్చినా ఆరోగ్యం అందదు

## - వెల్లడించిన మరో జాతీయ నివేదిక-

సమగ్ర ఆరోగ్య విధానం లేకుండా, సరైన రీతిలో కేటాయింపులు చేయకుండా ఇన్సూరెన్స్ చుట్టూ ప్రభుత్వాలు ఎన్ని ఆరోగ్య పథకాలు తెచ్చినా ప్రజలకు ఆరోగ్యం అందదని ఇటీవల మరో నివేదిక కూడా వెల్లడించింది.

2017-18 జాతీయ ఆరోగ్య వ్యయ నివేదిక ప్రకారం వివిధ రాష్ట్రాలలో ప్రజలు జేబుల్లో నుంచి వైద్యం కోసం చేస్తున్న ఖర్చులు ఇలా ఉన్నాయి.. (రూ. కోట్లలో).




| రాష్ట్రం | మొత్తం ఆరోగ్య వ్యయం | ప్రజలు జేబుల్లో నుండి చేస్తున్న ఖర్చు |
|---|---|---|
| ఉత్తరప్రదేశ్ | 73,171 | 53,127 |
| మహారాష్ట్ర | 63,350 | 31,092 |
| పశ్చిమ బెంగాల్ | 42,820 | 29,902 |
| కేరళ | 32,424 | 22,271 |
| తమిళనాడు | 29,664 | ..... |
| కర్ణాటక | 29,465 | ...... |
| రాజస్థాన్ | 25,888 | ...... |
| ఆంధ్రప్రదేశ్ | 24,068 | 16,130 |
| తెలంగాణ | 15,789 | 7,844 |

**తలసరి ఖర్చు:** ● మొత్తం ఆరోగ్య వ్యయంలో తలసరి ఖర్చు అత్యధికంగా కేరళలో రూ.9,264 నమోదు కాగా, అందులో ప్రజలు చేస్తున్న ఖర్చు రూ. 6,363, ప్రభుత్వ ఖర్చు రూ.2,272.

- హిమాచల్‌ప్రదేశ్‌లో తలసరి వ్యయం రూ.6,541 కాగా, ప్రజలు రూ.3,220, ప్రభుత్వం రూ.3,177 ఖర్చు చేస్తున్నాయి.
- పశ్చిమ బెంగాల్‌లో ఈ వ్యయం రూ.4,460 కాగా, ప్రజలు రూ.3,115 భరిస్తున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,628 వ్యయం అవుతుండగా, అందులో ప్రభుత్వం రూ.1,381, ప్రజలు రూ.3,102 చొప్పున భరిస్తున్నారు. ● తెలంగాణలో తలసరి వ్యయం రూ.4,267 కాగా, ప్రభుత్వం అందులో రూ.1,698 వెచ్చిస్తోంది, ప్రజలు రూ.2,120 సొంతంగా ఖర్చు చేస్తున్నారు.

## వైద్యం, విద్యపై ప్రభుత్వ ఖర్చు తక్కువగా ఉన్న తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన దగ్గర్నుంచి ఇప్పటి వరకు ఏ ఏడాది కూడా వైద్య రంగంపై ఖర్చు బడ్జెట్‌లో 5 శాతం దాటలేదని రిజర్వుబ్యాంకు నివేదిక తెలిపింది. 2014-15లో 4.1 శాతం వెచ్చించగా, ఆ తర్వాత వరుసగా 3.9, 4.1, 4.2, 4.0, 4.3, 3.4 శాతం ఖర్చు జరిగింది. ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో 2.5 శాతం ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. వైద్య రంగంపై అతి తక్కువ వెచ్చిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని నివేదిక పేర్కొంది.

విద్యారంగంలోనూ పలు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో చేస్తున్న ప్రభుత్వ వ్యయం తక్కువగా ఉంది. విద్యపై ఢిల్లీ, అసోం, బీహార్, చండీగఢ్ వరుసగా 22.8, 18.6, 18.1 శాతం ఖర్చు చేస్తుండగా, తెలంగాణలో చేస్తున్న ఖర్చు 5.9 శాతం మాత్రమే. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 11.5 శాతం ఖర్చు పెట్టారుగానీ, ఆ తర్వాత క్రమంగా తగ్గిపోయింది.

# నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం తీరును నిరసించిన లోక్‌సత్తా



కరోనా మహమ్మారి రెండో దశ ప్రజాజీవితాల్ని అల్లకల్లోలం చేసిన సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బాధితులకు సేవలందించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకి రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా జీతాలు చెల్లించకపోవటం అన్యాయమని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ జ్యోతిబా పూలే విగ్రహం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన దీక్ష కార్యక్రమంలో మాట్లాడుతూ.. కరోనా విజృంభించిన సమయంలో జిల్లాలోని దాదాపు 1200 మందితో ఆస్పత్రుల్లో పనిచేయించుకుని సక్రమంగా జీతాలు ఇవ్వకుండా అర్ధంతరంగా తొలగించారన్నారు. ఈ ధోరణిని లోక్‌సత్తా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన అదనపు మార్కులను ఇప్పటికీ కలపలేదన్నారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి నిధులు విడుదల చేసి జీతాలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రతినిధి రవితేజ మాట్లాడుతూ, తమ ఆవేదన ప్రభుత్వం అర్థం చేసుకోవాలని, ప్రభుత్వం నూతనంగా భర్తీ చేసే ఉద్యోగాల్లో కొవిడ్ సమయంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, మోహన్, బోర రమేష్, పాలుపర్తి అప్పారావు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రతినిధులు సన్యాసమ్మ, చంద్రిక, రామలక్ష్మి, సూర్యకుమారి, బంగార్రాజు, వెంకట్, అమ్మన్, దిలీప్, రామకృష్ణ, సూరిబాబు, పెద్ద విజయనగరం యూత్ ఫౌండేషన్ ప్రతినిధులు అంబులెన్స్ శివ, అనిల్, పెద్దసంఖ్యలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం, తల్లిదండ్రుల మధ్య విద్యార్థులు నలిగిపోకూడదు

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలయిన విద్యార్థుల ఆత్మహత్యలను ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలుగా పరిగణించాలని బండారు రామ్మోహనరావు అన్నారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసేటప్పుడు ప్రభుత్వం తొందరపాటుతనం లేకుండా ఆచితూచి వ్యవహరించాలన్నారు. మొదట్లోనే కరోనా పరిస్థితులను, విద్యార్థుల భవిష్యత్తును జాగ్రత్తగా సమన్వయం చేసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు. విద్యలో నాణ్యత ముఖ్యమని, పరీక్షలంటే కేవలం విద్యార్థులకు ఎంతవరకు అర్థమైందో బేరీజు వేసే ప్రక్రియ మాత్రమేనని అత్యధిక సంఖ్యాక విద్యార్థులు భావించే విద్యావ్యవస్థ మనకు కొరవడిందన్నారు. తల్లిదండ్రులు కూడా కేవలం పరీక్షల్లో ర్యాంకుల కన్నా నిజమైన విద్య పట్టుబడుతోందా లేదా అని ఆలోచించాలన్నారు. ప్రభుత్వం, తల్లిదండ్రుల మధ్య విద్యార్థులు నలిగిపోకూడదన్నారు. హుస్నాబాద్‌లో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యులెవరు?' అంశంపై జరిగిన సమావేశంలో సిద్దిపేట జిల్లా లోక్‌సత్తా అధ్యక్ష, కార్యదర్శులు పందిళ్ల శంకర్, పి.మోహన్ రెడ్డి, చంద్రారెడ్డి, సాంబమూర్తి, దినేష్ శర్మ తదితర నేతలు పాల్గొన్నారు.

## సమాచార హక్కుకు గండి కొడుతున్న టీఎస్‌ప్రభుత్వం

సమాచార హక్కు చట్టం ప్రకారం ఇవ్వాల్సిన సమాచారాన్ని తమ పైఅధికారులకు తెలియకుండా ఏ శాఖా ఇవ్వరాదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఇచ్చిన సర్క్యులర్ చట్టప్రకారం ఏ మాత్రం చెల్లుబాటు కాదని, సర్క్యులర్‌ను హైకోర్టు కొట్టివేసినా తిరిగి ఏదోక రకంగా అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు. ఇప్పటికే యూనియన్ ప్రభుత్వం ఆర్టీఐని నిర్వీర్యం చేసేందుకు సవరణలు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందన్నారు. వినియోగదారుల చట్టం నుండి సమాచార హక్కు చట్టం వరకు ప్రజల సాధికారతకు ఉపయోగపడే చట్టాలను నీరు గార్చేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. చాలా జిల్లా వినియోగదారుల కమిషన్ ఫోరాలలో సభ్యుల నియామకం చేయకుండా దాటవేస్తున్నారన్నారు.

# పాలనా సంస్కరణలపై పార్టీ రాజకీయాలు తగదు





దేశంలో అనేక పాలనా సంస్కరణలు రావాల్సి ఉందని, పార్టీ రాజకీయాల కోసం వాటిపై రాద్ధాంతం చేసి అడ్డుకోవటం తగదని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. ఓటరు ఐడీకి ఆధార్‌ను సంధానం చేసే సాంకేతిక మార్పుపై కూడా పార్లమెంటులో గందరగోళం సృష్టించటం విచారకరమన్నారు.

సుపరిపాలన వారోత్సవాల సందర్భంగా హనుమకొండలో జరిగిన జరిగిన సమావేశంలో 'ఎన్నికల సంస్కరణలు'పై పి. కోదండ రామారావు, జ్వాలా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుంకరి ప్రశాంత్, సామాజిక రచయితల వేదిక వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డితో కలసి రామ్మోహనరావు మాట్లాడారు.

ఎన్నికల సంస్కరణలకు పోలింగ్ బూత్ బయట ఎంతో చేయాల్సి ఉందని, ప్రాథమిక అంశాల చుట్టూనే ఇలా రాజకీయాలు చేస్తుంటే అసలు సంస్కరణల్ని ఎలా సాధిస్తారని వారు ప్రశ్నించారు. ఆధార్ కార్డును యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ వ్యతిరేకించిందని, ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం ఓటరు నమోదులో వినియోగిస్తుంటే కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు. ఆధార్‌తో అనుసంధానం వల్ల దొంగ ఓట్లను అరికట్టవచ్చని, అలాగే తమ ఓటు ఉందో లేదో ఓటర్లు తనిఖీ చేసుకోవటానికి వీలుగా పోస్టాఫీసులను శాశ్వత నోడల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ చట్టాల నుండి ఎన్నికల సంస్కరణల వరకు అధికారంలో ఉన్నప్పుడు ఒక వైఖరి, ప్రతిపక్షంలో మరో వైఖరి వల్ల జాతి నష్టపోతోందన్నారు. ఏకాభిప్రాయంతో ఎన్నికల సంస్కరణల్ని వేగంగా అమల్లోకి తెచ్చుకుంటే పార్టీల మీద కూడా ఎంతో భారం తగ్గుతుందన్నారు.

రాజకీయ పక్షాలు అంశాలవారీగా మద్దతివ్వటం, వ్యతిరేకించటం చేయాలి తప్ప.. తాత్కాలిక రాజకీయ అవసరాల కోసం మాట మార్చకూడదన్నారు. జాతీయ పార్టీలతోపాటు ప్రాంతీయ పక్షాలకు కూడా లోక్‌సత్తా ఈ విజ్ఞప్తి చేస్తోందన్నారు. పాలన, ఎన్నికలు, న్యాయ, పోలీసు సంస్కరణల కోసం అన్ని పార్టీలూ ఏకాభిప్రాయంతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పరిపాలనలో పారదర్శకత జవాబుదారీతనం, ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారం, అధికార వికేంద్రీకరణ: ఇంటి ముందు ప్రభుత్వం – కంటి ముందు పాలన, అవినీతిరహిత ప్రభుత్వ సేవలు, సత్వర న్యాయం – ముంగిట న్యాయం, చట్టబద్ధపాలన (రూల్ ఆఫ్ లా) సుపరిపాలనకు సప్తసూత్రాలన్నారు.

సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో విద్యార్థులు, యువతతో జరిగిన సమావేశంలో 'సుపరిపాలన ఎందుకోసం.. అవినీతిరహిత పాలనలో ప్రభుత్వ బాధ్యత, ప్రజల భాగస్వామ్యం' అంశంపై రామ్మోహనరావు మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, జడ్పీటీసీ తిరుపతి రెడ్డి, డాక్టర్ దేవేందర్ రావు, ఆర్టీఐ రక్షణ వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, కామిడి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హోదాకు, ఆర్థిక సంఘానికి సంబంధమేమిటి.. శ్వేతపత్రం ప్రకటించండి

ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో పార్లమెంటులో హామీ ఇచ్చిన ప్రత్యేక హోదాను అమలు చేయకుండా యూనియన్ ప్రభుత్వం పెద్ద అన్యాయం చేస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందనటం బూటకమని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఇలాంటి మాటలు చెప్పటం ప్రజాస్వామ్య విశ్వసనీయతను దెబ్బతీస్తుందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో చట్టప్రకారము, పార్లమెంటు ద్వారానూ ఏపీకి రావాల్సిన ఆర్థిక వనరుల్ని, వసతుల్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని స్వతంత్ర నిపుణుల కమిటీ సమగ్రంగా నివేదించిందని, ఇప్పటికైనా ఈ నివేదిక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, బీజేపీ సహా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇందుకు చొరవ తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్ర మద్దతు కూడా కోరాలన్నారు. విభజన నేపథ్యంలో ఏపీకి, తెలంగాణకు రావాల్సిన నిధులు, మౌలిక సదుపాయాలపై యూనియన్ ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో (నవంబర్ 29 - డిసెంబర్ 22, 2021)

# తెలుగు రాష్ట్రాల సమాచారం




- తెలంగాణ నుండి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల కింద ఎంపికైన గ్రేటర్ వరంగల్, కరీంనగర్‌లలో ఇప్పటివరకు రూ.752.09 కోట్ల విలువైన 27 పనులు పూర్తయినట్లు యూనియన్ పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. ఆ రెండు నగరాలలో రూ.3,720.14 కోట్ల విలువైన 162 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్‌సిటీల కింద ఎంపికైన నాలుగు నగరాలకు (విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, అమరావతి) గత ఏడేళ్లలో రూ.1,824.20 కోట్ల నిధులు విడుదల చేశారు. ఇందులో రూ.1,657 కోట్లు ఖర్చయ్యాయి.
- విభజన చట్టం–2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌ని ఏడు వెనుకబడిన జిల్లాలఅభివృద్ధికి యూనియన్ ఇప్పటివరకు రూ.1,750 కోట్లు విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఇందులో ఇంతవరకూ రూ.1,049.34 కోట్ల మేరకు వినియోగ ధృవీకరణ పత్రాలు అందాయి. ఈ నిధుల వినియోగాన్ని నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తోంది.
- తెలంగాణలోని 9 వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.900 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరితే నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు మార్చి 31న రూ.450 కోట్లు విడుదల చేశారు.
- పధ్నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల నేపథ్యంలో ప్రత్యేక కేటగిరీ హోదా అంశం ముగిసిపోయిందని ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా హోం శాఖ తెలిపింది. 'ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలను చాలావరకు అమలు చేశాం. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పన, విద్యాసంస్థల నిర్మాణం వంటివి పూర్తి చేయటానికి చట్టంలోనే పదేళ్లు గడువిచ్చారు. ద్వైపాక్షిక సమస్యల సామరస్యపూర్వక పరిష్కారానికి రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నిస్తున్నాం. ప్రత్యేక హోదా అంశం ముగిసిన నేపథ్యంలో.. ఒకవేళ యూనియన్ ప్రాయోజిత పథకాలను 90:10 నిష్పత్తిలో యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంచి ఉంటే ఏపీకి 2015–16 నుండి 2019–20 మధ్య యూనియన్ ప్రభుత్వం నుండి ఎంత అదనపు నిధి

అందేదో.. దాన్నే 'ప్రత్యేక సాయం' కింద ఇవ్వటానికి అంగీకరించాం. 2015-16 నుండి 2019-20 వరకు కుదుర్చుకున్న విదేశీ రుణాలకు అసలు, వడ్డీని యూనియన్ ప్రభుత్వమే చెల్లించటానికి సుముఖత వ్యక్తం చేసింది' అని వివరించింది.

- రాష్ట్రాలకు యూనియన్ ప్రభుత్వం నుండి వచ్చే పన్నుల వాటా ఏటా తగ్గుతూ వస్తోంది. 2018-19లో ఏపీకి రూ.32,787.03 కోట్ల వాటా రాగా, 2019-20 నాటికి అది రూ.28,242.39 కోట్లు, 2020-21 నాటికి రూ.24,460.59 కోట్లకు తగ్గిపోయింది. ఇదేసమయంలో తెలంగాణకు వరుసగా రూ.18,560.88 కోట్లు, రూ.15,987.59 కోట్లు, రూ.12,691.62 కోట్లు మాత్రమే వచ్చింది. జాతీయ స్థాయిలోనూ అన్ని రాష్ట్రాలకూ కలిపి 2018-19లో రూ.7,61,454 కోట్లు, 2019-20లో రూ.6,50,677 కోట్లు, 2020-21లో రూ.5,94,996 కోట్లు విడుదలయ్యాయి.
- గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,577 కోట్లు, తెలంగాణకు రూ.17,709 కోట్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఏపీకి వచ్చే ఎఫ్‌డీఐలలో ఏటా తరుగుదల కనిపించగా, తెలంగాణకు వచ్చే దాంట్లో హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ఈ మూడేళ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాలకూ కలిపి రూ.7,43,4476.26 కోట్ల పెట్టుబడులు రాగా, అందులో ఏపీ వాటా 0.34%, తెలంగాణ వాటా 2.38%గా ఉంది. అత్యధిక పెట్టుబడులు మహారాష్ట్రకు రూ.2,04,082.22 కోట్లు, గుజరాత్‌కు రూ.1,87,472.28 కోట్లు, కర్ణాటకకు రూ.1,49,718.39 కోట్లు వచ్చాయి. మొత్తం ఎఫ్‌డీఐలలో ఈ మూడు రాష్ట్రాలకే 72.80% దక్కిందని ఆర్థిక శాఖ తెలిపింది.
- కరోనా సమయంలో తెలంగాణలోని వలస కార్మికుల కోసం రూ.330 కోట్ల సాయం అందించినట్లు కార్మిక శాఖ వెల్లడించింది.
- అసంఘటిత కార్మికుల వివరాల నమోదు కోసం యూనియన్ కార్మిక శాఖ ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటివరకు 8.97 కోట్ల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుండి 14,91,161 మంది, తెలంగాణ నుండి 6,53,210 మంది ఉన్నారు. మొత్తం సంఖ్యలో ఏపీ 13, తెలంగాణ 17వ స్థానంలో ఉన్నాయి.
- గత మూడేళ్లలో తెలంగాణ నుండి 220 లక్షల మెట్రిక్ టన్నులు, ఏపీ నుండి 160 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించినట్లు ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండూ డీసీపీ రాష్ట్రాలే (రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి ఏజన్సీలు బియ్యం సేకరించి, నిల్వ ఉంచి పంపిణీ చేస్తాయి) అయినందున.. ఎఫ్‌సీఐ సమన్వయంతో మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలే సెంట్రల్ పూల్ కింద ఈ మొత్తాన్ని సేకరించాయి. ఇదే సమయంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి కలిపి 1,563.03 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించారు.
- తెలంగాణ రైతు కుటుంబాలకు నెలకు సగటున రూ.9,403 ఆదాయం సమకూరుతోందని, అదే సమయంలో ఖర్చు రూ.7,706 మేర ఉంటోందని వ్యవసాయ శాఖ తెలిపింది. ఇందులో పంట ఉత్పత్తి కోసం రూ.6,543, పశువుల కోసం రూ.1,163 మేర వ్యయమవుతోంది. జులై 2018 - జూన్ 2019 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో రైతు కుటుంబం ఆదాయం నెలకు రూ.10,480 కాగా, ఖర్చు రూ.11,919 (పంట ఉత్పత్తి కోసం రూ.8,847, పశువుల కోసం రూ.3,072)గా ఉంది. మేఘాలయ (రూ.29,348), హర్యానా (రూ.22,841) రైతు కుటుంబాల ఆదాయం అన్ని రాష్ట్రాల కంటే అధికంగా ఉంది. పంట సాగుకయ్యే నెలవారీ ఖర్చు పంజాబ్ (రూ.11,277), హర్యానా (రూ.11,190)లలో అత్యధికంగా నమోదైంది. పశువుల కోసం అత్యధికంగా ఖర్చు పెట్టే రాష్ట్రాలలో కేరళ (రూ.3,191), పంజాబ్ (రూ.3,118) తర్వాత ఆంధ్రప్రదేశ్ ఉంది.
- ఆంధ్రప్రదేశ్‌లో 93.2%, తెలంగాణలో 91.7% వ్యవసాయ కుటుంబాలు రుణ ఊబిలో ఉన్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. వ్యవసాయ కుటుంబాల రుణభారంపై నిర్వహించిన 70వ రౌండ్ సర్వే (2012-13) ప్రకారం అప్పుల్లో చిక్కుకున్న వ్యవసాయ కుటుంబాల సంఖ్య ఏపీలో 92.9% ఉండగా, 77వ రౌండ్ సర్వే (2018-19) నాటికి 93.2 శాతానికి చేరింది. ఇదే సమయంలో తెలంగాణలో రుణభారం మోస్తున్న రైతు కుటుంబాల సంఖ్య 89.1% నుండి 91.7 శాతానికి చేరింది. జాతీయస్థాయిలో రుణ ఊబిలో ఉన్న రైతు కుటుంబాలు సగటున ఇదివరకు 51.9% ఉండగా, ఇప్పుడు 50.2%కి తగ్గింది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రుణబాధితుల సంఖ్య పెరిగింది.

అప్పుల ఊబిలో కూరుకున్న అత్యధిక వ్యవసాయ కుటుంబాల్లో ఏపీ, తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో ఉండగా, తర్వాతి స్థానాల్లో కేరళ (69.9%), కర్ణాటక (67.7%), తమిళనాడు (65.1%), ఒడిషా (61.2%), మహారాష్ట్ర (54%), పశ్చిమ బెంగాల్ (50.8%) ఉన్నాయి.

- ఒక కిలో ధాన్యం ఉత్పత్తికి దాదాపు 3 నుండి 5 వేల లీటర్ల వరకు నీటి వినియోగం జరుగుతోందని వ్యవసాయ శాఖ తెలిపింది. రాబోయే రోజుల్లో పంట మార్పిడిని ప్రోత్సహించి రైతులకు విలువ ఆధారిత ఆదాయం దక్కేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. "రైతులను ప్రత్నామ్నాయ పంటల వైపు మళ్లించే రాష్ట్రాలకు యూనియన్ ప్రోత్సాహకాలను అందిస్తోంది. పప్పు ధాన్యాలు, నూనె గింజలు సాగుచేసే రాష్ట్రాలకు హెక్టారుకు రూ.9 వేల ప్రోత్సాహకం అందిస్తున్నాం. వేరుశెనగకు రూ.10 వేలు, సోయాబీన్‌కు రూ.6 వేలు, తృణధాన్యాలకు రూ.6 వేలు, పత్తి సాగు వైపు మళ్లితే హెక్టారుకు రూ.8 వేల నుండి 10 వేలు, వరి నుండి ఉద్యాన పంటలకు మళ్లితే రూ.10 వేలు ప్రోత్సాహకం ఇస్తున్నాం. ప్రకృతి, సేంద్రియ సేద్యానికి కూడా ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తున్నాం. 2013-14 నుండి 2020-21 వరకు 6.34 లక్షల హెక్టార్లలో పంట మార్పిడి జరిగింది" అని వెల్లడించింది.
- తెలంగాణ నుండి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు పెరిగాయి. 2019-20లో రూ.2,692.15 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా, 2020-21లో అది రూ.4,180.14 కోట్లకు చేరింది. రాష్ట్రం నుండి సుగంధ ద్రవ్యాలు, బియ్యం, పండ్లు, కూరగాయలు, చక్కెర, పత్తి, చిరుధాన్యాలు, పప్పు దినుసుల ఎగుమతుల్లో వృద్ధి నమోదైంది.
- ఏపీలో మత్స్యసంపద అభివృద్ధికి 2020-21, 2021-22 సంవత్సరాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం పంపిన రూ.655.38 కోట్ల ప్రతిపాదనలను ఆమోదించినట్లు పశుసంవర్ధక శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ నుండి బియ్యం ఎగుమతులు భారీగా పెరిగాయి. 2019-20లో రాష్ట్రం నుండి రూ.1,902.62 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా, 2020-21లో ఆ విలువ రూ.5,713.15 కోట్లకు చేరింది. ఈ రెండేళ్లలో మొత్తం వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల విలువ రూ.13,154 కోట్ల నుండి రూ.16,054 కోట్లకు పెరిగింది.
- ఆంధ్రప్రదేశ్‌లో 10,981 పాఠశాలల్లో మరుగుదొడ్లు పనిచేయడం లేదు, 18,874 బడుల్లో చేతులు కడుక్కునే సదుపాయం లేదు. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. తెలంగాణలో 11.23%, ఆంధ్రప్రదేశ్‌లో 18.94% ఏకోపాధ్యాయ పాఠశాలలున్నట్లు విద్యా శాఖ తెలియచేసింది. జాతీయ స్థాయిలో సగటున 6.80% మేర ఇలాంటివి ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లోని 13,371 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 1,708 పంచాయతీలకు భారత్ నెట్ కింద బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానం చేశారు.
- వేలం పద్ధతి విధాన నిర్ణయమని, బొగ్గు గనుల వేలాన్ని ఆపి వాటిని సింగరేణికి కేటాయించాలని సమ్మె చేయటం వల్ల దేశ ప్రయోజనాలకు గాని, సింగరేణికి గాని మంచి జరగదని బొగ్గు, గనుల శాఖ స్పష్టం చేసింది.
- ఏపీలోని వినియోగదారుల కమిషన్లకు మూడేళ్లలో 6,400 ఫిర్యాదులు అందినట్లు ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 1,379 కేసులు జాతీయ/రాష్ట్ర స్థాయి కమిషన్లు, 5,021 జిల్లా స్థాయి కమిషన్లలో దాఖలయ్యాయి.
- తెలంగాణలో గత ఆరేళ్లలో 15,19,947 తాగునీటి నమూనాలను పరీక్షించగా, అందులో 1,66,014 (10.92%) కలుషితమైనట్లు తేలిందని ప్రభుత్వం తెలిపింది. ఏపీలో 20,94,131 నమూనాలను పరీక్షించగా 3,03,049 (14.47%) నమూనాలు కలుషితమైనట్లు తేలింది. రెండు రాష్ట్రాల్లోనూ ఏటా కలుషిత నీటి శాతాలు తగ్గుతూ వస్తున్నాయి.
- తెలంగాణ సహా ఏడు రాష్ట్రాలు, యూనియన్ పాలిత ప్రాంతాల్లో (హర్యానా, గోవా, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నాగర్ హవేలి, దమన్ దీవ్) మొత్తం గ్రామాల్లో ప్రతి గడపకూ నల్లా నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఏపీ పల్లెల్లో 51.7% ఇళ్లకే నల్లా సౌకర్యం ఉంది.
- ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటు ఏకాభిప్రాయ సాధనకోసం సంప్రదింపులు జరుపుతున్నట్లు న్యాయ శాఖ తెలిపింది. యూనియన్ ప్రభుత్వం ఆర్టికల్ 312 (1) అనుసరించి ఈ వ్యవస్థకు రూపకల్పన చేసింది. దేశవ్యాప్తంగా ప్రతిభ గల న్యాయ విద్యార్థులు న్యాయమూర్తులయ్యేందుకు ఏఐజేఎస్ ఉపకరిస్తుంది.

**(కర్టెసీ: న్యూస్ రిపోర్టులు)**

# ఎన్‌జేఏసీ వచ్చే లోగా కొలీజియంనైనా సంస్కరించాలి




సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాలకు ఇప్పుడనుసరిస్తున్న కొలీజియం పద్ధతిని మార్చాలని పార్లమెంటు తాజా శీతాకాల సమావేశాల్లో సభ్యులు పార్టీలకతీతంగా మరోమారు బలంగా గొంతు వినిపించారు. న్యాయమూర్తుల పింఛను పెంపుకి సంబంధించిన న్యాయ చట్టాల సవరణ సందర్భంగా చర్చలో వారు మాట్లాడుతూ, జాతీయ న్యాయవ్యవస్థ నియామకాల బిల్లు (ఎన్‌జేఏసీ)ని మళ్లీ తీసుకురావాలని సూచించారు. కొలీజియం వ్యవస్థని పునఃపరిశీలించాలని కోరారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకంలో యూనియన్ న్యాయ శాఖా మంత్రికి ఎటువంటి పాత్రా లేకపోవటం వల్ల ఆయన పార్లమెంటుకు జవాబుదారీగా ఉండలేని పరిస్థితి ఉందన్నారు. కొలీజియం పద్ధతిని రద్దు చేసి నూతన వ్యవస్థ ఏర్పాటుకు ఇప్పటికిప్పుడు బిల్లు తెచ్చే యోచన లేదని చెప్పిన న్యాయ శాఖా మంత్రి కిరణ్ రిజుజు కూడా.. ఎన్‌జేఏసీ ఏర్పాటుకు దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని స్పష్టం చేశారు. పలువురు న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసినవారు సైతం ఎన్‌జేఏసీకి సుముఖంగా ఉన్నారన్నారు. పార్లమెంటు ఆమోదించిన ఎన్‌జేఏసీ బిల్లుని సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని ప్రస్తావించారు. 'జడ్జీల నియామకానికి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఖాళీల భర్తీలో తీసుకురాదలచిన మార్పులపై ముసాయిదా ప్రతిని సుప్రీంకోర్టుకు అందచేశాం' అని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

లోక్‌సత్తా చొరవతో నాలుగు దశాబ్దాలకాలంలో అత్యుత్తమ న్యాయమూర్తులుగా పేరొందిన సుప్రీంకోర్టు జస్టిస్‌లు ఎం.ఎన్ వెంకటాచలయ్య, జేఎస్ వర్మ, వీఆర్ కృష్ణ అయ్యర్‌లు రూపొందించిన ఎన్‌జేఏసీ రాజ్యాంగ సవరణ బిల్లుకు 2014లో పార్లమెంటు దాదాపు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందుకోసం ప్రధాన జాతీయ పార్టీలను ఒప్పించటంలో జేపీ కీలక పాత్ర పోషించారు. అయితే వాదనలు వినిపించటానికి కూడా అవకాశమివ్వకుండా 2015లో ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు 4-1 మెజారిటీతో కొట్టివేసింది. తిరిగి ఇప్పుడు మళ్లీ ఎన్‌జేఏసీ డిమాండ్‌తో చర్చ మొదలైంది.

రాజకీయ జోక్యం అనే విమర్శతో కొలీజియం వ్యవస్థను సమర్థించేవారు కూడా కొలీజియం వల్ల తలెత్తుతున్న బంధుప్రీతి, రాజకీయ పక్షపాతం వంటి తీవ్ర ఆరోపణలను తోసిపుచ్చలేని పరిస్థితి నెలకొంది. కొలీజియం తీర్పు రాసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి స్వయంగా లోక్‌సత్తా రూపొందించిన ఎన్‌జేఏసీ బిల్లు రూపకల్పనలో భాగస్వాములయ్యారు. కొలీజియంలో లోపాలున్నాయని ఎన్‌జేఏసీ చట్టాన్ని కొట్టివేసిన అనంతరం సుప్రీంకోర్టు కూడా అంగీకరించింది. ఈ నేపథ్యంలో కొలీజియం వ్యవస్థను మార్చాలనటంలో సందేహం లేదు. జడ్జీలను జడ్జీలే నియమించుకోవటం ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ లేదు. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజల ప్రమేయం లేకుండా ఉండకూడదు. న్యాయవ్యవస్థ కూడా అందుకు అతీతం కాదు. ప్రజల భాగస్వామ్యమున్న రీతిలో ఏర్పడటంతో పాటు, ప్రజలకు జవాబుదారీగా ఉండే ఏర్పాటు కూడా మన న్యాయవ్యవస్థలో ఉండాలి. ఇందుకోసం.. 2014 సమయంలో ఎన్‌జేఏసీ విషయంలో ఎలాగైతే పార్టీలకతీతంగా వ్యవహరించారో, ఆ బిల్లును మరోరూపంలో తెచ్చేందుకు కూడా అదే రీతిలో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయపక్షాలు వ్యవహరించాలి. పక్షపాత రాజకీయ ఆరోపణలు లేకుండా అంశాలపై హేతుబద్ధంగా స్పందించాలి.

ఎన్‌జేఏసీపై ఏకాభిప్రాయం ఆలస్యమవుతుందనుకుంటే, ఈలోగా అనధికారికమైన, రహస్యమైన కొలీజియంను సంస్కరించి ఒక అధికారిక, పారదర్శక పద్ధతిని తీసుకురావాలి.

'న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం-పారదర్శకత' అంశంపై న్యాయకోవిదులు, వివిధ రంగాలకు చెందిన అనుభవజ్ఞులైన ఆలోచనాపరులతో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (ఆస్కి), ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) 2016లో సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం కూడా కొన్ని ప్రతిపాదనల్ని రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపింది. వీటిని పరిగణలోకి తీసుకోవాలి. ఎన్‌జేఏసీని రద్దు చేసిన సమయంలో జేపీ వ్యాఖ్యానించినట్లు, కొన్నేళ్ల తర్వాతయినా ఎన్‌జేఏసీ వచ్చి తీరుతుంది. కానీ ఈలోగా కూడా యథాతథ పరిస్థితిని కొనసాగించనక్కర్లేదు. నిపుణుల సూచనలను, ప్రజాప్రయోజనాలను, ఇతర ప్రజాస్వామిక దేశాల్లోని మెరుగైన పద్ధతులను పరిగణలోకి తీసుకుని ఒక పారదర్శక పద్ధతిని తీసుకొచ్చేందుకు ఉన్నత న్యాయవ్యవస్థ కూడా ముందడుగు వేయాలి.

గత సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021**

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



4. **ఆరోగ్య స్థితి** – గణాంక పటం 3.6బి లో చూపినట్లు, ఓ దేశ జనాభా ఆరోగ్యానికి స్థూలంగా కీలక సంకేతమైన ఆయుర్దాయం బ్రిటన్‌లో 81 సంవత్సరాలుండగా, అమెరికాలో 78 సంవత్సరాలుంది. నివారించదగ్గ మరణాలు.. నివారించగలిగిన/చికిత్స చేయగలిగిన అకాల మరణాలను సూచిస్తాయి. డయాబెటిస్ విస్తరణ.. ఒక పెద్ద దీర్ఘకాలిక వ్యాధి ప్రబలతను తెలియచేస్తుంది. ఈ రెండు సూచికల్లో అమెరికా అధ్వాన్నంగా, ఓ.ఇ.సి.డి సగటు కంటే ఎక్కువ స్థాయి అంకెలతో ఉంది. వ్యాధి ప్రబలత, మరణాల్లో ఈ రకమైన పెరుగుదల ధోరణులకు.. స్థూలకాయుల శాతం పెరగటం, శారీరక శ్రమ లోపించటం, ఈ రెంటి మధ్యా వయసు పైబడుతున్న జనాభా పెరగటం, వీటన్నిటితోపాటు తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యం అందుబాటులో లేకపోవటం కారణాలు.

**(గణాంక పటం 3.6బి: ఓ.ఇ.సి.డి సగటుతో పోలిస్తే బ్రిటన్, అమెరికాలలో ఆరోగ్య పరిస్థితి)**

బ్రిటన్‌లో ఆరోగ్య వ్యవస్థ ఫలితాలు అమెరికాతో పోలిస్తే అంతరాలు లేకుండా దేశ ప్రజలందరికీ ఒకేస్థాయిలో ఉన్నాయి. పొగ తాగటం, మద్యం వినియోగాల శాతం బ్రిటన్‌లోనే ఎక్కువగా ఉన్నప్పటికీ, జీవనకాలం, నివారించదగ్గ మరణాలు, దీర్ఘవ్యాధుల ప్రబలత వంటి ప్రమాణాల్లో ఆ దేశం మెరుగ్గా ఉంది. బ్రిటన్‌తో పోలిస్తే ఆరోగ్య రంగంపై అమెరికా దాదాపు దాదాపు రెట్టింపు (ప్రభుత్వ+ప్రయివేటు) ఖర్చు చేస్తుంది. ఎక్కువ ఖర్చు పెట్టటం వల్ల తప్పనిసరిగా మెరుగైన ఫలితాలు వస్తాయనుకోనక్కర్లేదని గణాంకాలపై మా విశ్లేషణలో వెల్లడైంది. అకాల మరణాలు, వైకల్యం వల్ల కోల్పోయిన డి.ఎ.ఎల్.వైలు వ్యాధి భారాన్ని గణించటానికి మంచి పద్ధతి. గణాంక పటం 3.7లో చూపినట్లు, సగటు వయసు ప్రమాణంతో నిర్ధారించిన డి.ఎ.ఎల్.వైలు ప్రతి 1,00,000కి బ్రిటన్‌లో కంటే అమెరికాలో స్థిరంగా ఎక్కువగా కొనసాగుతున్నాయి. 2019లో సగటు వయసు ఆధారిత డి.ఎ.ఎల్.వైలు ప్రతి 1,00,000కి బ్రిటన్‌లో 20956 కాగా, అమెరికాలో 26061. పేదల పట్ల వ్యత్యాసంతో ఆరోగ్యం అందుబాటులో లేకుండా దెబ్బతీస్తున్న ఆరోగ్య వ్యవస్థలోని భారీ అసమానతలే అమెరికాలో నాసిరకం ఫలితాలకు ఒక ప్రధాన కారణం.

**(గణాంక పటం 3.7: బ్రిటన్, అమెరికా, భారత్‌లో డి.ఎ.ఎల్.వైల సరళి)**

మెరుగైన ఆరోగ్య ఫలితాలు, మరింత సమానత్వం, వినియోగదారునికి ఎక్కువ సంతృప్తి, లేదా ప్రభుత్వ పాత్ర లేకుంటే అయ్యే ఖర్చు కంటే తక్కువ వ్యయం కావటం, వీటి ద్వారా మెరుగైన సంక్షేమం కనిపిస్తుంటే.. అప్పుడు ఆరోగ్య రంగంలో ప్రభుత్వ విధానం విజయవంతమైనట్లు. ఆరోగ్యంలో భారీ వ్యయం చేస్తే తప్పనిసరిగా మెరుగైన ఫలితాలు వస్తాయనేమీ లేదని, ఆరోగ్యంలో ప్రయివేటీకరణ వల్ల అసమానతలు, అధ్వాన్నమైన ఫలితాలు వస్తాయని అమెరికా అనుభవాలు చెబుతున్నాయి. అమెరికాలో ఆరోగ్య ఫలితాలు ఓ.ఇ.సి.డి దేశాలన్నిటి కంటే దిగువన ఉన్నాయి. ఇంతకుముందు చెప్పుకున్నట్లు, బ్లూమ్‌బర్గ్ ఆరోగ్య రంగ ఫలితాల్లో అమెరికా 35వ స్థానంలో ఉంది. ఆరోగ్యరంగంలో ప్రపంచంలోనే అత్యధిక వ్యయం (ప్రభుత్వ+ప్రయివేటు) చేస్తున్నా, జి.డి.పిలో 18 శాతం లేదా తలసరి 10,624 డాలర్లు ఖర్చు చేస్తున్నా దాదాపు 2.6 కోట్ల మంది అమెరికన్లకు ఆరోగ్య సంరక్షణ వర్తింపు లేదు. ఏ తీవ్ర అనారోగ్యం ఎప్పుడు తమ జీవితాల్ని కబళిస్తుందోనన్న నిరంతర ఆందోళన మధ్య వారు బతుకుతుంటారు. అదే బ్రిటన్ అనుభవాన్ని చూస్తే.. ఎక్కువ శాతం ఆరోగ్య అవసరాలకు ఉపయోగపడే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ బలంగా ఉంటే, పైస్థాయి ఆస్పత్రి సేవలకు ఎఫ్.పి నుండి సిఫార్సు ఆధారిత పద్ధతి ఉంటే ఆరోగ్యంలో చేసే ఖర్చుకు తగ్గ ఫలితాల్ని ప్రభుత్వం సాధించగలుగుతుందని తేటతెల్లమవుతుంది. అలాంటి ఏర్పాట్లతో అందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు లభిస్తాయి. డబ్బులు లేవు కాబట్టి చికిత్స అందలేదు అనే పరిస్థితి ఎవరికీ ఎదురవదు. జి.డి.పిలో 10 శాతం మాత్రమే, తలసరి 4315 అమెరికన్ డాలర్లు మాత్రమే ఆరోగ్య రంగంలో బ్రిటన్ ఖర్చు చేస్తున్నాకూడా ఆరోగ్య ఫలితాలు అమెరికా కంటే మెరుగ్గా ఉన్నాయి. అమెరికాతో పోలిస్తే తలసరి మొత్తం ఆరోగ్య వ్యయం సగం మాత్రమే ఖర్చు చేస్తున్నా కూడా బ్రిటన్ ఆరోగ్య ఫలితాల్లో ప్రపంచంలో 19వ స్థానంలో, అమెరికా కంటే పదహారు స్థానాల ఎగువన ఉందని బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది (పట్టిక 3.1). ప్రభుత్వం ఆరోగ్య సేవల్లో పెద్ద పాత్ర పోషించటం వల్ల అనేక ఇతర దేశాలు ఇంకా మెరుగైన ఫలితాలను సాధిస్తున్నాయి.

మొత్తం ఆరోగ్య సేవలను ప్రభుత్వమే అందించాలని కాదు దీనర్థం. మెరుగైన నియంత్రణ, వినూత్న వ్యయ వ్యూహాల వల్ల, ముఖ్యంగా ఆరోగ్యంపై మరింత ఎక్కువ ప్రభుత్వ నిధుల్ని వెచ్చించే దేశాలు కొన్ని మార్కెట్ అసమర్థతల్ని కూడా పరిష్కరించవచ్చు. అయితే, భారతదేశం విషయానికొస్తే, జి.డి.పికి అనుగుణంగా అతి తక్కువ డబ్బుని మాత్రమే ఆరోగ్య సంరక్షణపై ఖర్చు చేస్తోందని మనం గుర్తించాలి. యూనియన్, రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి ఆరోగ్య సంరక్షణపై చేస్తున్న ఖర్చు జి.డి.పిలో ఒక శాతం కంటే కాస్త ఎక్కువ మాత్రమే. కాబట్టి, ఆరోగ్యానికి పెద్దఎత్తున ఖర్చు చేయటానికి బలమైన హేతుబద్ధ కారణం ఉండటమే కాకుండా, బడ్జెట్‌లో కూడా ప్రభుత్వానికి తగిన అవకాశముంది. వెచ్చించే డబ్బుకి తగ్గ ఫలితాలు వచ్చే పద్ధతిలో, అందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా, ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాలకు అందేలా వ్యయం చేయాలి. ఆరోగ్య సంరక్షణ సేవల్లో ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రభుత్వం వివేకవంతంగా ప్రోత్సహించాలి. ప్రాథమిక వైద్యంలో పోటీ, ప్రజలకు వైద్యుల మధ్య ఎంపిక అవకాశం ఉండేలా, ద్వితీయ స్థాయిలో ఏక చెల్లింపుదారు వ్యవస్థ ద్వారా ఉమ్మడి నష్ట ప్రమాద చెల్లింపు విధానం, పోటీ ఉండేలా ఈ భాగస్వామ్యం ఉండాలి. ఖరీదైన సేవలకు ఎక్కువ ఫీజు చెల్లించే స్తోమతు తమకు ఉందని తమంతటతాము ముందుకొచ్చే సమాజంలోని మెరుగైన ఆదాయ వర్గాలకు ప్రయివేటు రంగం

సేవలను అందిస్తూనే ఉండొచ్చు. అయితే, ప్రభుత్వ వ్యవస్థ నేతృత్వంలో వినూత్న పి.పి.పిల ద్వారా నిర్మించే వ్యవస్థలో అందరికీ ఆరోగ్యాన్ని అందించటం నాణ్యమైన సేవలకు అవసరం. పరిజ్ఞానం, ప్రశ్నించే సంస్కృతి ఉన్నవారికి కూడా వర్తించే విధానం కావటం వల్ల సేవలు గణనీయంగా మెరుగుపడతాయి.

ఖజానాకు, ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆరోగ్య సేవల్ని అందించాలన్న లక్ష్యం, ఆర్థిక హేతుబద్ధతపై వాస్తవ ప్రపంచ అనుభవాలు, భారతదేశ ప్రత్యేక పరిస్థితులు.. తదుపరి అధ్యాయాల్లో చర్చించే ఈ అంశాలే భారత్‌లో ఆరోగ్య నమూనాకు ప్రాతిపదికలు.

**సమగ్ర ఆరోగ్య వ్యవస్థ నమూనాకు మార్గదర్శక సూత్రాలు -**

1. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి ఆరోగ్య సేవలకు ప్రభుత్వ వనరులతో వ్యవస్థ.
2. వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచటం ద్వారా ఖజానా ఖర్చును కనీస స్థాయికి పరిమితం చేయటం.
3. సామర్థ్యాన్ని, నాణ్యతను, సేవల అందుబాటును మెరుగుపరిచేలా కొత్త పద్ధతిలో ప్రోత్సాహకాలతో పి.పి.పిలు.
4. ప్రజలకు నచ్చిన వైద్యుని ఎంచుకునే అవకాశం, వైద్య సేవల మధ్య పోటీ ఉండేలా ఆరోగ్య సేవల నాణ్యతను పెంచటం.
5. ఆరోగ్య సేవలు నిరాఘాటంగా, సజావుగా అందేలా, ఆస్పత్రి వ్యవస్థపై భారం తగ్గించేలా అన్ని స్థాయిల్లో వైద్యుల నుండి సిఫార్సుల పద్ధతిలో సంధానమై ఉన్న సమగ్ర వ్యవస్థ.
6. పటిష్ఠ జవాబుదారీ పద్ధతులతో వికేంద్రీకృత అమలు, పర్యవేక్షణ.
7. పౌరుల ప్రాథమిక ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వ వైద్య సంప్రదింపుల రేటు ఏటా తలసరి 1.5కి పెంపు.
8. గ్రామీణ, అర్థ పట్టణ ప్రాంతాల్లో సమగ్ర ద్వితీయ స్థాయి ఆస్పత్రి సేవల అందుబాటుకు సదుపాయాల్ని పెంచటం.
9. నాణ్యమైన, ఖర్చుకు తగ్గ ఫలితాలనిచ్చే తృతీయ స్థాయి వైద్య సేవలను ప్రధానంగా ప్రభుత్వాస్పత్రుల్లోనే అందించే ఏర్పాటు.
10. వ్యాధి భారాన్ని, ఓ.ఓ.పి.ఇని తగ్గించటం.

## అధ్యాయం 4

### ప్రాథమిక ఆరోగ్యం

ఆరోగ్య వ్యవస్థతో రోగుల మొదటి సంప్రదింపు స్థానం ప్రాథమిక వైద్యం. ఇది దీర్ఘకాలిక, సమగ్ర, వ్యక్తి ప్రధానమైన ఆరోగ్య సేవ. ప్రతి కొత్త అవసరానికి మొదటగా సంప్రదించే సదుపాయంగా ఉండటం, దీర్ఘకాలం వ్యక్తి ప్రధానంగా (వ్యాధి చుట్టూ కాకుండా) ఆరోగ్య సేవ, చాలా ఆరోగ్య అవసరాలకు సమగ్ర సంరక్షణ, ఆస్పత్రులకు అనుసంధానంతో కూడిన ఆరోగ్య సేవలు.. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలోని నాలుగు ప్రధాన అంశాలు! కుటుంబ వైద్యం, మరియు/లేదా సాధారణ వైద్య సేవల విభాగం కూడా ప్రాథమిక వైద్యంలోనే మిళితంగా ఉంటాయి. ఈ పత్రంలో, 'ప్రాథమిక వైద్యం' అనే పదంలో వ్యాధి నివారణ సేవలు కూడా కలిసి ఉన్నాయి. ప్రాథమిక వైద్యం చాలా వరకు నివారణ వైద్యమే అయ్యుంటుంది. ప్రాథమిక వైద్యం అందించే వారు.. మొత్తం వ్యాధి నివారణ సేవల్ని కూడా అందించగలరు. వ్యాధి నివారణ ప్రధానంగా టీకాల కార్యక్రమానికి సంబంధించినది అనే భావన ఉన్నప్పటికీ.. అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్), మధుమేహం (డయాబెటిస్), గుండె జబ్బు (కార్డియోవాస్క్యులర్) మొదలైన దీర్ఘకాల వ్యాధుల పెరుగుతున్న నేపథ్యంలో (అధ్యాయం 1లో గణాంక పటాలు 1.13 & 1.14), ఆ వ్యాధులకి సంబంధించి ప్రాథమిక వైద్యమంటేనే వాటి వల్ల తలెత్తే పోటు (స్ట్రోక్), గుండెనొప్పి మొదలైనవి రాకుండా నివారించటం. ప్రస్తుతం ప్రాథమిక వైద్య సేవల కార్యక్రమాలు చాలావరకు టీకాలు, శిశు మాతా ఆరోగ్య సేవలకు పరిమితమై ఉన్నాయి. సమగ్ర, దీర్ఘకాల, వ్యక్తి ప్రధానమైన సేవలు వీటిలో లోపించాయి. దీంతోపాటు, కుటుంబ సంక్షేమం, పౌష్టికాహారం, వ్యాధుల నియంత్రణ, వివిధ స్థాయిల్లో సంరక్షణలకు ఉద్దేశించిన కార్యక్రమాల సంధానం కొరవడింది. దీనివల్ల సమన్వయం లేకుండా పోయి, సేవలు పేలవంగా అందుతున్నాయి.

భారతదేశం అంటువ్యాధుల భారంతో ఇప్పటికీ పెద్దఎత్తున సతమతమవుతూ ఉంది. ఇదే సమయంలో ఎన్.సి.డిలు పెరుగుతున్నాయి. పేదలపై వ్యాధుల భారం అసమతుల రీతిలో ఉందని ఈ పరిస్థితులు వెల్లడిస్తున్నాయి. ఉత్పాదకతను, పనిచేసే సమయాన్ని కోల్పోవటం పేదల జీవితాలపై తరచూ విధ్వంసక ప్రభావాన్ని చూపుతోంది. వారిని పేదరికంలోకి, అప్పుల్లోకి నెట్టేస్తోంది. భారతదేశ శ్రామికశక్తిలో దాదాపు 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. యజమాని నుంచి వారికి అధికారిక బీమా వర్తింపు లేదు. దీంతో, వైద్య వ్యయం పేదలకు మరీ భారమైంది (ఆస్పత్రి బయట చికిత్సపై). నష్ట ప్రమాదం నుండి రక్షణ నామమాత్రంగా ఉంది. దీంతో మొత్తం వ్యయాన్ని వారు సొంతంగా పెట్టుకోవాల్సి వస్తోంది. మెరుగైన ఆదాయం, బీమా వర్తింపు ఉన్న సంపన్నులపై వైద్య భారం ప్రభావం తక్కువగా ఉంది (పట్టిక 4.1).

**(పట్టిక 4.1: వివిధ వర్గాల సగటు వైద్య వ్యయం, బీమా వర్తింపు)**

ఈ నేపథ్యంలోనే అందరికీ, ముఖ్యంగా పేదలకు నాణ్యమైన ఆరోగ్యానికి ప్రభుత్వ మధ్యవర్తిత్వం లేదా వనరుల సరఫరా కీలకంగా మారింది. వ్యాధి భారంలో గణనీయ శాతం.. నివారణ, ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ విఫలమవటం పర్యవసానమేనని మనం గుర్తించాలి. కొద్దిపాటి అదనపు వనరుల్ని సమకూర్చి, ఖర్చు చేసే పద్ధతుల్ని మారిస్తే.. ఆరోగ్యంలో ఎంతో పెద్ద సానుకూల మార్పుల్ని సాధించవచ్చు. ప్రాథమిక వైద్యంపై ఎక్కువ కేంద్రీకరించటం మొత్తం వ్యయాన్ని తగ్గిస్తుందని, మొత్తంగా వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుందని మనకు అనేక ఫలితాలు తెలియచెబుతున్నాయి. దీర్ఘకాల వ్యాధులు భవిష్యత్తు సమస్యలుగా మారకుండా, తీవ్ర అనారోగ్యాల దశకు చేరకుండా ప్రాథమిక వైద్య స్థాయిలో తీసుకునే చర్యలు నివారిస్తాయి. ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య సేవలతో అనుసంధానమైన పటిష్ఠమైన ప్రాథమిక

వైద్య వ్యవస్థ.. ఆరోగ్య రంగంలో వ్యయాల్ని అదుపు చేయగలదని, అదే సమయంలో ఆరోగ్య ఫలితాలను, జీవన నాణ్యతను పెంపొందించగలదని ఇవన్నీ తెలియచేస్తున్నాయి.

ఈ అంశానికి సంబంధించి, అధ్యాయం 3లో చర్చించినట్లు, ఆరోగ్య వ్యయం, సాధించిన ఫలితాలు రెంటిలోనూ అమెరికా, బ్రిటన్ పరస్పర విరుద్ధ ఉదాహరణలుగా నిలుస్తాయి. జాతీయ ఆరోగ్య సేవ (ఎన్.హెచ్.ఎస్) చుట్టూ నిర్మితమైన బ్రిటన్ ఆరోగ్య వ్యవస్థలో కుటుంబ ఆరోగ్యం, వైద్యుల సిఫార్సు (రెఫరల్) పద్ధతికి ప్రాధాన్యం ఉంటుంది. ప్రభుత్వం చేసే వ్యయం 8 శాతం కాగా, మొత్తం ఆరోగ్య వ్యయం జి.డి.పిలో 10 శాతం దాకా ఉంటుంది. బీమా, అధునాతన సేవల చుట్టూ భారీ ఖర్చు ఉన్న అమెరికా ఆరోగ్య వ్యవస్థ జి.డి.పిలో 18 శాతాన్ని ఖర్చు చేస్తోంది. అయితే, అమెరికాలో ఆరోగ్య సూచికలు బ్రిటన్ కంటే మెరుగ్గా లేవు. భారతదేశం ప్రస్తుతం అమెరికా ఆరోగ్య సేవల నమూనాను అనుకరిస్తోంది. ఆరోగ్య సమస్య రాగానే మొదటి సంప్రదింపుకి స్పెషలిస్ట్ దగ్గరకి వెళ్లటమే మార్గంగా ఉంది. ఇది విజ్ఞత గల రీతి ప్రభుత్వ వ్యయం కాదు. ఖర్చుకు తగ్గ ఫలితం కూడా రాదు. కాబట్టి, పౌరులకు అందుబాటులో, చౌకయిన, విశ్వసించదగిన, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటానికి, వ్యవస్థను సమర్థవంతంగా, వ్యయానికి తగ్గ ఫలితాలనిచ్చేలా చేయటానికి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ పాత్రపై పునస్సమీక్ష తప్పనిసరి.

### 4.1: భారతదేశ ప్రాథమిక వైద్య వ్యవస్థలోని సవాళ్లు

భారత్‌లో ప్రాథమిక వైద్య సేవల్లో బహుముఖ లోటుపాట్లున్నాయి. అందుబాటులో ఉండదు, నాణ్యత అధ్వాన్నం, ప్రాంతీయ అసమానతలు.. ఇలాంటి సమస్యలన్నీ పట్టి పీడిస్తున్నాయి. ఈ కారకాలను వివరంగా పరిశీలిద్దాం.

#### 4.1.1. నాణ్యత, అందుబాటు

భారత్‌లో శిక్షణ పొందిన డాక్టర్లు, వైద్య సిబ్బంది విస్తృత సంఖ్యలో ఉన్నారు (పట్టిక 4.2). అయితే, ప్రాథమిక వైద్య స్థాయిలో మాత్రం మానవ వనరుల కొరత విపరీతంగా ఉంది. ఇదో కళ్లెదురుగా కనిపించే పెద్ద వైపరీత్యం. ప్రాథమిక వైద్య స్థాయిలో పనిచేసే డాక్టర్ల నిష్పత్తి మొత్తం భారతదేశంలోని ప్రభుత్వ డాక్టర్ల (ప్రాక్టీస్ చేస్తున్న) సంఖ్యలో (బాక్స్ 4.1) సుమారు 24 శాతంగా (పట్టిక 4.3) ఉంది. దేశంలో ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లలో ప్రభుత్వ రంగంలో 16 శాతం మాత్రమే ఉండటాన్ని పరిగణలోకి తీసుకుంటే, ఇది ఎంత చిన్న సంఖ్యో అర్థమవుతుంది. భారత్‌లో ప్రాక్టీస్ చేస్తున్న మొత్తం ఫిజీషియన్లలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యంలోని డాక్టర్లు కేవలం 4% ఉంటారు. తమ పౌరులకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించే ఇతర దేశాలతో పోల్చి చూసుకుంటే, ప్రాథమిక వైద్యంలో డాక్టర్ల సంఖ్య మన దేశంలో అతి తక్కువగా ఉండటాన్ని పట్టిక 4.3 మరింత ప్రస్ఫుటంగా తెలియజేస్తుంది.

**(పట్టిక 4.2: రాష్ట్రాలవారీగా మానవ వనరుల లభ్యత)**

**బాక్స్ 4.1: భారత్‌లో డాక్టర్ల లభ్యత**

- భారతదేశంలో నమోదు చేసుకున్న (రిజిస్టర్డ్) డాక్టర్ల సంఖ్య – 12,55,786 (2020 వరకు ఎం.సి.ఐ వివరాలు)
- ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు – 8,47,145
- ప్రాక్టీస్ చేస్తున్న ప్రభుత్వ వైద్యులు – 141681 (జాతీయ ఆరోగ్య ముఖచిత్రం (ఎన్.హెచ్.పి) 2020)
- పి.హెచ్.సిలలో డాక్టర్లు – 34,915 (ఎన్.హెచ్.పి, 2020)

ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లతో పి.హెచ్.సి డాక్టర్ల నిష్పత్తి– 34256/8,47,145= 0.04

**గమనిక: ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్ల సంఖ్యను - "భారత్‌లో మొత్తంగా డాక్టర్ల లభ్యత: 2014-2030', ఇండియన్ జె పబ్లిక్ హెల్త్ 2017, పత్రంలో పొట్నూరు బి., ఇచ్చిన సమీకరణ ఆధారంగా నిర్ధారించటమైంది.**

**(పట్టిక 4.3: ఎంపిక చేసిన దేశాల్లో మానవ వనరుల లభ్యత)**

ప్రభుత్వ నిధులతో అందుతున్న ప్రాథమిక వైద్య సేవల్లో 1,00,000 మంది జనాభాకు కేవలం 2.5 మంది ఫిజీషియన్లు భారత్‌లో ఉన్నారు. అదే బ్రిటన్‌లో 76 మంది, ఫ్రాన్స్‌లో 141 మంది ఉన్నారు! ప్రస్తుతమున్న ప్రాథమిక ఆరోగ్య సేవలు చాలా పేలవంగా, ఏ రకంగా చూసినా అందరికీ కనీస ఆరోగ్యాన్ని అందించగలిగే స్థాయిలో లేవని ఈ అతి తక్కువ నిష్పత్తిని బట్టి అర్థమవుతుంది. ఓ.ఇ.సి.డి ప్రమాణాలను అందుకునేందుకు 1,00,000 జనాభాకి ప్రాథమిక వైద్య ఫిజీషియన్ల నిష్పత్తిని అనేక రెట్లు పెంచటం భారతదేశ ఆదాయ స్థాయిల్లో ఆచరణసాధ్యం అనిపించుకోదు. మన జనాభా, వ్యాధుల పరివర్తన పరిస్థితిని ఆ దేశాలతో పోల్చి చూసుకున్నా కూడా ఈ తరహా పెంపు కొంత కాలంపాటు మనకు అవసరం కూడా కాదు. తొలి దశలోనే రోగాన్ని గుర్తించేలా చికిత్సనందించేలా, సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల్ని నియంత్రించేలా, పేదలకు, సేవలు అందనివారికి సంరక్షణ అందించగలిగేట్లు ఫిజీషియన్లకు, ఆరోగ్య సిబ్బందికి తగిన ప్రోత్సాహకాన్ని అందించేలా, రెఫరల్ ఆస్పత్రి సేవలకు ఇక్కడి డాక్టర్ తొలి అనుమతిదారుగా ఉండేలా, వినియోగదారులకు ఎంపిక స్వేచ్ఛనిచ్చేలా, ఫిజీషియన్ల మధ్య పోటీని పెంచేలా, సమర్థవంతంగా, విశ్వసించదగ్గ రీతిలో సేవలు అందించేలా, జవాబుదారీతనాన్ని వ్యవస్థీకృతం చేసేలా.. మనం ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నమూనాను రూపొందించుకోవాలి.

స్థూలంగా, ఒక ఆచరణ సాధ్యమైన, సమర్థవంతమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను నిర్మించుకోవటానికి కావలసిన మానవ వనరులు మనకున్నాయి. భారతదేశం ఏటా 80,000 మందికి పైగా వైద్య గ్రాడ్యుయేట్లను తయారు చేస్తోంది. చైనాను మినహాయిస్తే అన్ని పెద్ద దేశాల కన్నా ఇది ఎక్కువ.

ఆరోగ్య సేవలెట్లా ఉన్నాయో స్థూలంగా తెలియజెప్పే సూచిక వార్షిక ఔట్‌పేషెంట్ సంప్రదింపుల రేటు. భారత్‌లో ఇది సుమారు 2.3 శాతంగా ఉంది. ఇది ఓ.ఇ.సి.డి సగటు కంటే బాగా తక్కువ (గణాంక పటం 4.1). ఇందులో కూడా కేవలం 25 శాతం సంప్రదింపులు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉన్నాయి (పట్టిక 4.4). మిగిలినవన్నీ ప్రయివేటు రంగంలోనే ఉన్నాయి (రాష్ట్రాల

వారీగా పరిస్థితి వివరాల్ని తెలియజేసే బాక్స్ 4.2ను చూడండి). గ్రామీణ భారతంలో అనధికారికంగా ఆరోగ్య సేవలను అందించేవారు మొత్తం ఆరోగ్య సేవల ప్రొవైడర్లలో 68 శాతం ఉంటారు. కాబట్టి, దేశవ్యాప్తంగా 75 శాతం ప్రయివేటు సంప్రదింపులు ఎటువంటి వైద్య శిక్షణా లేని అనధికారిక వైద్య సేవలందించేవారివే అయ్యే అవకాశముంది.

**(గణాంక పటం 4.1: తలసరి వార్షిక వైద్య సంప్రదింపులు)**

(పట్టిక 4.4: గత 365 రోజుల్లో ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల్లో వినియోగం, తలసరి వైద్య సంప్రదింపుల శాతం)

ప్రభుత్వ రంగంలో డాక్టర్ కన్సల్టేషన్ శాతం తక్కువగా ఉండటం మన ఆరోగ్య సంరక్షణ సేవల్లో రెండు ప్రధాన లోపాలకు సంకేతంగా ఉంది. ఒకటి, ఎంతో అవసరమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలు వాయిదా వేస్తున్నారు. రెండోది, ప్రయివేటు సదుపాయాల వైపు, అందులోనూ ఎక్కువగా అనధికారికంగా వైద్య సేవలందించే వారి వైపు ఉన్నకొద్దీ ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలకు వెళ్లే కొద్దిమందికి కూడా అసంతృప్తే మిగులుతోంది. ఎంతో విచారకరమైన పరిస్థితి ఇది. ఈ వైఫల్యం ప్రభుత్వ బోధనాస్పత్రులపై మితిమీరిన భారానికి దారితీస్తోంది. ఆ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

**బాక్స్ 4.2: ఒడిషా, అస్సాంలలో ప్రాథమిక వైద్య సంరక్షణ సదుపాయాల వినియోగం**

**ఒడిషా:** పి.హెచ్.సి సదుపాయాల్ని ఎక్కువగా వినియోగించటం, డాక్టర్ల సంఖ్యకి అనుగుణంగా ఉండాల్సిన నర్సులు, కాన్పు సహాయకుల నిష్పత్తి ఎక్కువగా 6.71 ఉండటం, సంతానోత్పత్తి రేటు 1.9 ఉండటం మొదలైన అంశాలన్నీ ఒడిషాలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమర్థ కుటుంబ నియంత్రణ, ప్రత్యుత్పత్తి సేవలకు నిదర్శనాలు. వ్యవస్థ అవసరాలకు తగ్గ రీతిలో ఎక్కువమంది నర్సులు, కాన్పు సహాయకులు పనిచేస్తుండటం వల్ల ప్రజలు ఎక్కువగా పి.హెచ్.సిల్లోని కుటుంబ నియంత్రణ సేవలను వినియోగించుకుంటున్నట్లు కనిపిస్తుంది. అయితే ఐ.ఎం.ఆర్, ఎం.ఎం.ఆర్, ఆయుర్దాయం వంటి ఇతర ఆరోగ్య సూచికల్లో రాష్ట్రం పనితీరు నాసిరకంగా ఉంది (అధ్యాయం 2లో పట్టిక 2.1).

**అస్సాం:** అస్సాంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉన్న పడకలు వరుసగా 17,142, 7,036. ప్రయివేటు రంగం రాష్ట్రంలోని ఆరోగ్య రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టకపోవటం వల్ల ప్రాథమిక ఆరోగ్య నెట్‌వర్క్ వినియోగం ఎక్కువగా ఉందని భావించవచ్చు.

**మూలం:**

1. డాక్టర్ల సంఖ్యకు అనుగుణంగా నర్సులు, కాన్పు సహాయకుల నిష్పత్తి – డబ్ల్యు.హెచ్.ఓ దక్షిణాసియా పబ్లిక్ హెల్త్ జర్నల్, 2009.

2. సంతానోత్పత్తి రేటు – ఎస్.ఆర్.ఎస్ గణాంక నివేదిక, 2018, భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం, పేజీ. 78.

3. అస్సాంలో పడకలు – గీతాంజలి కపూర్ తదితరులు, "రాష్ట్రాలవారీగా ప్రస్తుత ఆస్పత్రి పడకలు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ పడకలు, వెంటిలేటర్లు", సెంటర్ ఫర్ డిసీజ్ డైనమిక్స్, ఎకనామిక్స్ & పాలసీ, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, 20 ఏప్రిల్ 2020 (కపూర్ తదితరులు, 2020).

ప్రయివేటు సేవల మీద ఎలా ఆధారపడుతున్నారో, ప్రభుత్వ రంగ ఆరోగ్య సేవల్ని ఎంత తక్కువగా వినియోగిస్తున్నారో, ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య విభాగంలో పరిస్థితిని రాష్ట్రాల వారీగా పట్టిక 4.4 స్పష్టంగా తెలియచేస్తుంది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య సేవల సదుపాయాలను సందర్శించటం మొత్తం ఆస్పత్రి సందర్శనల్లో 10 శాతం లోపే ఉంది. దేశ జనాభాకి అవసరమైన అన్ని రకాల ప్రాథమిక వైద్య సేవలకూ ప్రస్తుతమున్న ప్రభుత్వ ప్రాథమిక వైద్య వ్యవస్థ సామర్థ్యం పూర్తిగా సరిపోకపోయినా, ఉన్న సామర్థ్యం కూడా సక్రమ వినియోగం కాకపోవటం విచారకరం. స్థానిక పి.హెచ్.సి స్థాయిలో సామర్థ్యానికి తగ్గ వినియోగం లేదని, ఓ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి రోజుకు కేవలం 15 మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నారని దాస్ & హ్యామర్ (2014) అధ్యయనం తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో అంచనాలకు భిన్నంగా.. ప్రయివేటు ప్రాథమిక ఆరోగ్య సేవల ఫిజీషియన్లకు కూడా పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదు. ఒక గ్రామీణ వైద్య సేవలదారు ముమ్మరంగా రోగులను చూసే సమయం గంట కంటే ఎక్కువ ఉండదు. దీంతోపాటు, గ్రామీణ భారతదేశంలో ప్రాథమిక వైద్యం అందించేవారు ఇబ్బడిముబ్బడిగా ఉన్నారు. ఒక్కో గ్రామానికి సగటున 3.2 నిష్పత్తిలో ఉన్నారు. అయితే వీరిలో దాదాపు 70% మంది శిక్షణ లేని, నైపుణ్యంలేని వారు. కాబట్టి, ఆరోగ్య రంగంలో ప్రాథమిక స్థాయిలో వినియోగించుకోని సామర్థ్యం గణనీయంగా ఉంది. ఈ వైఫల్యం వల్ల, ఆస్పత్రి స్థాయిలో సేవల కోసం భారీ డిమాండ్ ఏర్పడింది.

అరకొర ప్రాథమిక వైద్య వసతుల్ని వినియోగించుకోవటం పట్ల కూడా నిర్లిప్తత ఉందంటే, భారతదేశంలో ప్రాథమిక ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో నమ్మకం లేదని స్పష్టమవుతుంది. ప్రస్తుతమున్న నమూనా ప్రజల విశ్వాసాన్ని పెంచదు. చాలామంది నేరుగా మొదటి సంప్రదింపునకే ఆస్పత్రికి వెళ్తున్నారు. లేదంటే ప్రాణాల మీదకు వచ్చినదాకా అనారోగ్యాన్ని నిశ్శబ్దంగా భరిస్తున్నారు. వైద్య సంప్రదింపు లేదా ఆస్పత్రి చికిత్స నుండి ఇక తప్పించుకోవటం సాధ్యం కాని అనివార్య పరిస్థితి వారికి ఏర్పడుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో కావచ్చు, పట్టణాల్లో కావచ్చు.. ప్రాథమిక వైద్యంలో నాణ్యత అధ్వాన్నంగా ఉంది. నాణ్యతాలోపం రెండు స్థాయిలో కనిపిస్తుంది– మొదటిది, 'పరిజ్ఞాన అంతరం' (నాలెడ్జ్ గ్యాప్) అనవచ్చు. రెండోది, 'తెలిసిన వైద్యాన్ని చేయటంలో అంతరం' (నో–డూ గ్యాప్). మొదటగా, పరిజ్ఞానానికి సంబంధించిన అంతరం, పోటీతత్వం లోపించటం ప్రాథమిక వైద్య సేవలందించేవారిలో సాధారణమయ్యాయి. అయితే, ఇందులో కూడా రాష్ట్రాల మధ్య ప్రాంతాలవారీ తేడా పెద్దఎత్తున ఉంది.

(ఇంకా ఉంది...)



# నైతిక ఉపన్యాసాలతో అవినీతి పోదు.. నిర్దిష్ట విధానాలు అవసరం: జేపీ

ప్రజాస్వామ్యంలో హక్కుగా అందే సేవలకు లంచాలిస్తున్న ప్రజలు దోషులు కాదని, వాళ్లు బాధితులని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మన దేశంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు గతిలేక ముడుపులు చెల్లిస్తున్నారన్నారు. ఉపన్యాసాలు, నినాదాలతో అవినీతి అంతమవదని, అందుకు నిర్దిష్ట విధానాలు అవసరమన్నారు. సుమారు దశాబ్ద కాలం క్రితం 2జీ స్పెక్ట్రం కేసులో భారీ అవినీతి చోటు చేసుకున్నప్పుడు లోక్‌సత్తాయే చొరవ తీసుకుని దేశంలోని సుప్రసిద్ధ పౌరులతో కలిసి న్యాయపోరాటం చేసిందని, దాంతో ఆ స్పెక్ట్రం లైసెన్సులు రద్దు కావటంతోపాటు ప్రకృతి వనరుల కేటాయింపుల్లో బహిరంగ వేలం విధానం వచ్చిందని అన్నారు. ఆనాడు కేవలం వ్యక్తుల మీదే దృష్టి పెట్టి నినాదాలకు పరిమితమై ఉంటే ఇలాంటి విధానపరమైన మార్పు వచ్చేదికాదన్నారు. విలువైన వనరుల కేటాయింపులో భారీ అవినీతికి ఆస్కారమున్న ఒక లొసుగు లోక్‌సత్తా కృషి వల్ల శాశ్వతంగా మూతపడిందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలందించేందుకు ఏర్పాట్లు చేస్తే ప్రజల రోజువారీ జీవితంలో అవినీతి చీడ పోతుందన్నారు. ఇలా నిర్దిష్టమైన విధానాలతో కృషి చేస్తే భారత్‌లో అవినీతిని అంతం చేయవచ్చన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా లోక్‌సత్తా పార్టీ తెలంగాణ విభాగం నిర్వహించిన వ్యాస రచన పోటీలో తొలి రెండు బహుమతులు గెలుపొందిన జగిత్యాలకు చెందిన అక్కల మనోజ్, లక్ష్మణ్‌లకు హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో జేపీ ప్రశంసా పత్రాన్ని, నగదు బహుమతిని అందించారు. తాను కూడా జగిత్యాలలోనే శిక్షణ పొందానంటూ అభినందించారు. వ్యాసాల్లో వారు రాసిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అవినీతి అనేది నైతిక విషయం కాదని, ఇంకొంచెం లోతుకెళ్లి వ్యవస్థీకృత పోరాటంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, పార్టీ నేతలు శ్రీనివాస వర్మ, వంశీ ప్రసాద్, పెద్దగళ్ల రాజీవ్, వైబీఐ అధ్యక్షుడు బొర్రా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th January, 2022 Posting Date 15 &16th of every month

# 2022 - 'మిషన్ భారత్ 2047'కి పునాది కావాలి..

## నూతన సంవత్సర, జాతీయ యువజన దినోత్సవ (జనవరి 12) శుభాకాంక్షలు



2022 నూతన సంవత్సరం మాత్రమే కాదు, భారత స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవం కూడా. సమగ్ర సమీక్షకు సరైన సందర్భం. భారత్ 'ప్రజాస్వామ్య దేశం'గానే చైనాతో పోటీ పడుతూ పునరుజ్జీవనం పొంది ప్రపంచ స్థాయికి ఎదిగేందుకు పాతికేళ్ల కార్యాచరణను ప్రారంభించాల్సిన సమయం.

'మిషన్ భారత్ 2047'లో భాగంగా ఈ ఎనిమిది అంశాలనూ లక్ష్యాలు గావించుకోండి, అధ్యయనం చేయండి, నాయకత్వం తీసుకోండి, నాయకులను తయారుచేయండి, సమాజంలోకి తీసుకెళ్లండి, దశలవారీగా లక్ష్యాల సాధనకు సంఘటితంగా కృషి చేయండి..

1) **అధికార వికేంద్రీకరణ:** ఓటుకి, వ్యక్తి జీవితానికి మధ్య సంబంధం ప్రజలకు బోధపడేలా అధికార వికేంద్రీకరణ
2) **చట్టబద్ధపాలన:** ఎక్కువ-తక్కువలు, ధనిక-బీద, అగ్ర-నిమ్న కులవివక్ష లేకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చేయటం
3) **సామాన్య పౌరులకి సక్రమంగా పౌర సేవలు:** వేధింపులు, అవమానాలు, లంచాలు లేకుండా సామాన్య పౌరులకి సకాలంలో, సక్రమంగా, గౌరవప్రదంగా పౌర సేవలు అందే ఏర్పాటు
4) **ప్రజలకు ఆర్థిక భారం లేకుండా సమగ్ర ఆరోగ్య వ్యవస్థ అమలు:** కొవిడ్ కాలంలో ఆరోగ్య రంగంలో సంక్షోభం చూశాక ప్రజలంతా కోరుకుంటున్నట్లు.. ప్రాథమికం నుండి తృతీయ దశ వరకూ అన్ని స్థాయిలో ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ప్రజానీకం తమకు నచ్చిన వైద్యుని వద్ద చికిత్స పొందేలా సమగ్రమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించటం
5) **ఏ స్కూల్‌లో చదివినా ప్రతి బిడ్డకూ మంచి ప్రమాణాల విద్య:** విద్యలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల తేడా లేకుండా మంచి ప్రమాణాల విద్యను ప్రతి బిడ్డకూ అందేలా చేయటం .. కుటుంబం మీద ఆర్థిక భారం లేకుండా
6) **పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం:** అన్ని స్థాయిలో పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం తగిన ఏర్పాట్లకు కృషి
7) **వ్యవసాయంలో ఆదాయం:** సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగంలో ఆదాయాన్ని పొందేందుకు విధానాలు చేపట్టటం, వ్యవసాయానికి-ఇతర రంగాలకు మధ్య సంబంధాలను పెంచి యువతకు ఉపాధిని కల్పించటం, చిన్న పట్టణాల అభివృద్ధి, వాటితో వ్యవసాయానికి సంధానం ద్వారా వలసల అవసరం లేకుండా మంచి ప్రమాణాల జీవితాన్ని గ్రామీణ ప్రజలకు అందించటం
8) **రాజకీయ సంస్కరణలు:** ఎన్నికల్లో డబ్బు, తాత్కాలిక తాయిలాలు, కుల, మత, ప్రాంత విభజనల్ని అరికట్టి మంచి నాయకత్వం ఎదిగేందుకు వీలుగా ఎన్నికల వ్యవస్థలో, రాజకీయ వ్యవస్థలో సమూల సంస్కరణలు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**

**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020